లక్షలాదులు నుపయోగించు
సాధారణము పాకెట్టు
నంజన్‌గూడు పండ్లపొడి
సమ్మకమైన ఆయుర్వేద ఔషధములు
అట్‌మంట్రేక్ నరముల బలవృద్ధి టానిక్
ఒజోలా ఆరోగ్యమును వృద్ధిపరచును
బృంగామలక తైలము
మా స్టాకిస్టులుగా ఉండుట మీ కిష్టమేనా !

VISALAANDHRA Phone No. 75301 ఉదయం *** Regd. No. H/VJ 47

విశాలాంధ్ర

704901

సంపుటి 26 సంచిక 209 | విజయవాడ 24—11—76 బుధవారం | 6 పేజీలు 30 పైసలు

1898 నుండి ప్రసిద్ధి గాంచినది
పండిత. డి.గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యమునకు - బలమునకు
ఆయుర్వేదాశ్రమం(ప్రై)లిమిటెడ్ 100 జి.ఎన్.రోడ్ మదరాసు,17

కార్మికుల సంక్షేమం, ప్రభుత్వ ఆదేశాల అమలుపట్ల శ్రద్ధవహించని డైరెక్టర్లు

ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీవిమర్శ

జవహర్‌నగర్, నవంబర్ 23

కంపెనీలలో ప్రభుత్వం నియమించిన డైరెక్టర్లు కార్మికుల సంక్షేమంపట్ల శ్రద్ధ వహించడంలేదని, ప్రభుత్వ ఆదేశాలను సక్రమంగా అమలుజరపడంలేదని ప్రభుత్వానికి ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ పరిస్థితిని పరిదిద్దాల్సిన ఆవశ్యకత వుందని ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ నేడిక్కడ చెప్పారు.

ఇక్కడ జరిగిన ఒక కార్మికుల సభలో ప్రసంగిస్తూ ప్రభుత్వ డైరెక్టర్లు కార్మికుల ప్రయోజనాలను కాపాడేటట్లు, ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలను అమలు జరిపేందుకు తీసుకోవలసిన చర్యలను పరిశీలించడం జరుగుతోందని ఆమె చెప్పారు.

కార్మికుల సంక్షేమంపట్ల తీవ్ర ఆందోళనను వ్యక్తంచేస్తూ కార్మికుల ప్రయోజనాల సంరక్షణకు తీసుకోదలచిన చర్యలను శ్రీమతి గాంధీ వివరించారు.

బోనస్ చట్టంనుండి కేటాయించడానికి లభించే మిగులు నిధులు అన్ని సూత్రాన్ని పాటించాలన్న ఐ. ఎన్. టి. యు. సి. అస్సాంశాఖ అధ్యక్షుడు శ్రీ కె. పి. త్రిపాఠి చేసిన డిమాండ్‌ను ప్రస్తావిస్తూ కంపెనీలు తమ అక్కౌంట్లను సక్రమంగా వుంచేటట్లు చేయాలని శ్రీమతి గాంధీ అన్నారు.

ధరలు పెరిగిపోవడం, రూపాయి విలువ పడిపోవడం జరిగితే కేవలం కొద్దిగా బోనస్ పెరగడంవల్ల ఏమిలాభం చేకూరదన్న విషయాన్ని కార్మికులు దృష్టిలో వుంచుకోవాలని శ్రీమతి గాంధీ కోరారు.

కార్మికులకు కేవలం వృత్తి శిక్షణే కాకుండా జాతీయ జీవనంలోని అన్ని రంగాలలో ఆసక్తి కలిగేలా విస్తృతమైన విద్యా శిక్షణ అవసరమని ఆమె చెప్పారు.

కార్మికుల స్థితిగతులను మెరుగు పరచాలని ప్రభుత్వం కోరుకుంటోందనీ, వారికి అన్నిరకాల సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని ఆమె హామీ యిచ్చారు.

అస్సాం, నాగాలాండ్, మణిపూర్‌లనుండి కార్మికులు అధిక సంఖ్యలో ఈ సభకు హాజరయ్యారు. వీరిలో ఎక్కువగా టీ తోటల కార్మికులునూ, రైల్వే, ఖాదీ, పి డబ్ల్యు. డి. కార్మికులు వున్నారు.

బంగ్లాదేశ్‌నుండి వచ్చిన శరణార్థులవల్ల వర్షాభావం, విద్యుత్ కొరతలవల్ల దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి పెద్ద దెబ్బతగిలింది. అదే సమయంలో నూనె ధరలు పెరిగాయి. కొన్ని అభివృద్ధి చెందినదేశాలు నూనె వుత్పత్తిచేసే దేశాలను దోచుకొంటుండగా భారత్ వంటి వర్ధమానదేశాలు నూనె ధరల పెరుగుదలవల్ల బాగా దెబ్బతిన్నాయి.

అటువంటి పరిస్థితులలో కొన్ని ప్రతిపక్షాలు కేంద్రప్రభుత్వాన్ని బలహీనపరిచేందుకు ప్రయత్నించాయి. ప్రభుత్వంమొక్క సోషలిస్టు కార్యక్రమాలను వదలివేయమని ఒత్తిడిచేశాయి,

అందువల్ల ప్రభుత్వం కొన్నితీవ్రచర్యలు తీసుకోవలసివచ్చింది. వీటిప్రభావం పారిశ్రామిక కార్మికులు వ్యవసాయ రంగంతోసహా అన్ని రకాల ప్రజలపై పడింది. వీటివల్ల వారు యిబ్బందికి గురైనట్లు భావిస్తున్నారు. చివరకు కొంతమంది నా సహచరులు కూడా యిటువంటి తీవ్ర చర్యలు తీసుకుంటే ప్రభుత్వం నిల్వలేదని సలహా యిచ్చారు.

వారికినాసమాధానమేమిటంటే ప్రభుత్వం ప్రతికూలయటపడినలేకపోయినదేశ ప్రయోజనాలదృష్ట్యా అవసరమైన చర్యలు తీసుకోక తప్పదు అని శ్రీమతి గాంధీ స్పష్టం చేశారు.

ఈ చర్యలు తాత్కాలికంగా పొరపాటు చర్యలుగా అనిపించవచ్చు. కాని తర్వాత ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే వున్నాయని రుజువవుతాయి అని శ్రీమతి గాంధీ చెప్పారు.

ధరల పెరుగుదలవల్ల తీవ్రంగా నష్టపోతున్న కార్మికవర్గ ప్రయోజనాల పరిరక్షణకై బ్లాక్‌మార్కెటీర్లు, దొంగనిల్వదారులపై తీవ్రమైన చర్యలు తీసుకోవాలని ఐ. ఎన్. టి. యు. సి. అధ్యక్షుడు శ్రీ బి. సి. భగవతి ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులు తమ వేతనాలలో 75 శాతం ఆహారానికి ఖర్చుచేయవలసి వస్తోందని, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినప్పుడల్లా కార్మికులు తీవ్ర యిబ్బందులకు గురౌతున్నారని ఆయన అన్నారు.

సమాజంలోని బలహీనవర్గాల, పేదల స్థితిగతులను మెరుగుపరచగలిగే ఆర్థిక కార్యక్రమాన్ని త్వరితంగా అమలు జరిపేందుకు ముమ్మర చర్యలు తీసుకోవాలని శ్రీ భగవతి కోరారు.

వేర్పాటువాద శక్తులకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య శక్తుల సమీకరణ

శ్రీ ఎం. కళ్యాణసుందరం పత్రికా గోష్ఠి

మద్రాసు, నవంబరు 23

దేశంలో జాతీయవాద భావాలుగల శక్తులు యింకా బలంగా వున్నాయని యీ శక్తులను సమీకరించడం ద్వారా మితవాద అభివృద్ధి నిరోధక, అస్థిరీకరణ, వేర్పాటువాద శక్తులను సమర్థవంతంగా తిప్పికొట్టవచ్చునన్న అభిప్రాయాన్ని భారత కమ్యూనిస్టుపార్టీ తమిళనాడుశాఖ కార్యదర్శి శ్రీ ఎం. కల్యాణ సుందరం నేడిక్కడ వెలిబుచ్చారు.

ఒక పత్రికా గోష్ఠిలో ప్రసంగిస్తూ ద్రవిడ మున్నేట్ర కళగంపై నిషేధం విధించాలన్న డిమాండ్‌ను తమ పార్టీ బలపరచబోదని ఆయన చెప్పారు. డి. యం. కె పై రాజకీయంగా, సిద్ధాంతపరంగా పోరాడాలిగాని నిషేధం విధించడం ద్వారా కాదని కమ్యూనిస్టుపార్టీ భావిస్తున్నట్లు ఆయన చెప్పారు.

డి. ఎం. కె. విచ్ఛిన్నకర, వేర్పాటువాద సిద్ధాంతాలను బట్టబయలు చేయడానికి, రాష్ట్రంలోని ప్రజాస్వామిక శక్తులన్నింటినీ ఐక్యం చేయడానికి భారత కమ్యూనిస్టుపార్టీ చొరవ తీసుకొని ప్రయత్నం చేస్తుందని ఆయన అన్నారు. ఈ విషయమై తను త్వరలో తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ జి. కురుప్పయ్య, మూపనార్, అఖిలభారత అన్నా డి. ఎం. కె. ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. జి. రామచంద్రన్‌లను కలుసుకుంటానని శ్రీ కళ్యాణ సుందరం చెప్పారు.

యం. జి. రామచంద్రన్, కోవయ్ చెళియన్ బృందానికి మధ్య విభేదాలు అన్నా డి. ఎం. కె. ఆంతరంగిక వ్యవహారంగా తమ పార్టీ భావిస్తుందని, ఏమైనా యం. జి. రామచంద్రన్ నాయకత్వానగల అఖిల భారత అన్నా డి. ఎం. కె. ప్రతిష్టను తగ్గించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు.

20 అంశాల కార్యక్రమం అమలుపై జిల్లా, రాష్ట్రస్థాయి సలహా కమిటీలను నియమించడాన్ని హర్షిస్తూ అత్యవసర పరిస్థితి 20 అంశాల కార్యక్రమాన్ని బలపరిచే రిపబ్లికన్ ఫార్వర్డు బ్లాక్, తమిళనాడు ముస్లింలీగ్, దళిత వర్గాల ప్రగతిశీల లీగ్ అవంటి పార్టీల ప్రతినిధులకు ప్రాతినిధ్యం వుండేలా ఈ కమిటీలకు విస్తృత ప్రాతిపదిక వుండాలని శ్రీ కల్యాణసుందరం కోరారు.

నవంబరు 18 నుండి 21వరకు తిరువన్నమలైలో జరిగిన తమిళనాడు కమ్యూనిస్టు సమితి సమావేశం తీర్మానాలను ఆయన పత్రికలకు విడుదలచేశారు.

రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించిన వెంటనే చురుగ్గా ప్రారంభమైన 20అంశాల కార్యక్రమం అమలులో నత్తనడకపట్ల రాజకీయతీర్మానం అసంతృప్తిని ప్రకటించింది.

భూసంస్కరణలచట్టాలఅమలులో, కరువు నివారణ సహాయక చర్యలలో అసమర్థత, ధరల పెరుగుదల వున్నాయని తీర్మానం ఆరోపించింది.

డి. ఎం. కె. విచ్ఛిన్నకర విధానాలను వెల్లడిస్తూ ఈ సంవత్సరం ఆఖరులో 400 సమావేశాలు జరపాలని పార్టీ నిర్ణయం తీసుకుంది.

తమిళనాడు ఏరియాలో కావేరీ డెల్టా ప్రాంతంలో ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు కేంద్రం జోక్యం చేసుకోవాలని పార్టీ కోరింది.

భూములనుండి కౌలుదార్లను ఖాళీచేయించడాన్ని నిలుపు చేసేందుకు ఒక ఆర్డినెన్స్ తీసుకురావాలని మరో తీర్మానంకోరింది.

నవంబరు 27న కాకతీయ యూనివర్శిటీ ప్రారంభోత్సవం

కేంద్ర విద్యామంత్రిచే

వరంగల్, నవంబరు 23

కాకతీయ విశ్వవిద్యాలయానికి 1976నవంబరు 27వ తేదీన సాయంకాలం 5 గంటలకు వరంగల్‌లో కేంద్ర విద్యామంత్రి ప్రొఫెసర్ నూరుల్ హసన్ ప్రారంభోత్సవం చేస్తారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్, ఛాన్సలర్ శ్రీఆర్.డి.భండారీ ప్రారంభోత్సవానికి అధ్యక్షత వహిస్తారు. రాష్ట్రముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు ఈ సందర్భంగా యూనివర్శిటీ ప్రాముఖ్యాన్నిగూర్చి ప్రసంగిస్తారు, 12 లక్షల రూపాయలతోనిర్మించే 'హ్యూమానిటీస్" విభాగం భవనానికి యు. జి. సి, ఛైర్మన్ ప్రొఫెసర్ సతీష్ చంద్ర శంకుస్థాపన చేస్తారని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలర్‌శ్రీ వెంకట్రామయ్య. తెలిపారు. (వి. వి.)



శ్రద్ధాంజలి

విజయసారథి టుబాకో కంపెనీ పార్టనర్

శ్రీ బండి వెంకట సుబ్బయ్యగారు

9-11-76 న మోటార్ సైకిల్ ప్రమాదంలో చనిపోయారు. పెద్దఖర్మ 25-11-76న. నందనవనం గ్రామంలో జరుగును.

ఈ సందర్భముగా వారి కుటుంబ సభ్యులకు
మా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాం.

ఇట్లు,
విజయసారథి టుబాకో కంపెనీ,
మేనేజిమెంటు, సిబ్బంది
టంగుటూరు.

7 రాష్ట్రాలకు కేంద్ర సాయం

న్యూఢిల్లీ, నవంబరు 23

1976‑77 సంవత్సరంలో కేంద్రం 7 రాష్ట్రాలకు రు. 2 కోట్ల 88 లక్షల 80 వేలను రుణాలు, సబ్సిడీ, గ్రాంట్ల రూపంలో ప్రణాళికా సాయంగా అందించింది.

ఇందులో రు. 30,50,000 లు సబ్సిడీగానూ, రు. 10,04,300 గ్రాంటుగానూ, రు. 3,48 24,000 రుణంగానూ ఇవ్వబడింది.

పశ్చిమబెంగాల్ కేరళకు అస్సాం తమిళనాడుకు పంజాబ్ త్రిపుర ఉత్తర ప్రదేశ్‌లకు ఈ సాయం ఇవ్వబడింది.

వాతావరణం

ఈ నెల 25 వ తేదీవరకు కర్నాటక లోపట్టు ప్రాంతంలోనూ దక్షిణ, తీర కర్నాటక ప్రాంతంలోనూ ఉరుములతో కూడిన జల్లులు కురుస్తాయి. కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, లక్కదీవులు, దక్షిణ ఆంధ్ర కోస్తాలోనూ చెదురు మదురుగా వర్షాలు కురుస్తాయి. మిగతా ఆంధ్రప్రదేశ్‌లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయి.

బ్రెజ్నెవ్ - సెసెస్క్యూ చర్చలు

బుకారెస్ట్, నవంబర్ 23

రుమేనియాలో అధికార పర్యటన జరుపుతున్న సోవియట్ కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి లియోనిద్ బ్రెజ్నెవ్ నిన్న రుమేనియా అధ్యక్షుడు నికొలాయ్ చెసెస్క్యూ చర్చలు జరిపారు.

ఇద్దరు నాయకుల మధ్య మొదటి దఫా చర్చలు స్నేహపూరిత వాతావరణంలో జరిగాయని అధికారవర్గాలు తెలిపాయి.

నిన్న ఉదయం బుకారెస్ట్ ఒట్‌పెనీ విమానాశ్రయం నుండి నగర కేంద్రం వరకు సుమారు 2 లక్షల మంది ప్రజలు బారులుతీరి బ్రెజ్నెవ్‌కు స్వాగతం చెప్పారు.

బ్రెజ్నెవ్‌కు స్వాగతం చెబుతూ ఈ పర్యటన రెండు దేశాల పక్షాల మధ్య, స్నేహ సహకారాలను మరింత పటిష్టవంతం చేయగలదన్న విశ్వాసాన్ని వెలిబుచ్చారు.

ఆంద్రి మాల్రో మృతి

పారిస్, నవంబరు 23

ప్రముఖ ఫ్రెంచి రచయిత, మాజీ గాలిస్టుమంత్రి ఆంద్రి మాల్రో నేడు మరణించారు.

ఆయన వయస్సు 75 సంవత్సరాలు.

ఫ్రెంచి మాజీఅధ్యక్షులుచార్లెస్ డిగోల్‌తో ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయి. ఆయన - తీవ్రమైన పాల్మోనరి ఎంబాలిజంతో, ఊపిరితిత్తులో రక్తం గడ్డకట్టడంతో బాధపడుతున్నారు.

యువకుడుగా వున్నప్పుడు పురాతత్వ శాస్త్ర అన్వేషణకై దూరప్రాచ్యంకువెళ్ళారు, అయితే స్థానిక రాజకీయాలతో ప్రభావితుడై చైనా విప్లవంలో చురుకుగా పాల్గొన్నారు.

చైనా విప్లవాన్ని చిత్రీకరిస్తూ ఆయన వ్రాసిన "లాకండిషన్ హ్యూమెన్ "20 శతాబ్దపు ఫ్రెంచి రచనల్లో ప్రముఖ స్థానాన్ని సంతరించుకుంది.

స్పానిష్ అంతర్యుద్ధంలో రిపబ్లికన్ తరఫున విమానదళంలో మిషన్ గన్నర్‌గా పని చేశారు. ఆ అనుభవంతో లీక్‌స్పెయిర్ అనే నవల రచించారు.

రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ ఆక్రమణకువ్యతిరేకంగాజరిగిన ఫ్రెంచిపోరాటంలో నాయకత్వంవహించారు. ఆతరువాత డిగోల్ అధ్యక్షులుగా ఏర్పడిన మొదటి ప్రభుత్వంలో మంత్రిగా చేరారు.

బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు కృషి : పోలీసులకు రాష్ట్రపతి ఉద్బోధ

(విశాలాంధ్ర విలేకరి)

హైద్రాబాద్, నవంబర్ 23

రాజ్యాంగంలో బలహీనవర్గాలకు హామీ యివ్వబడిన హక్కులూ, సత్వాలను పరిరక్షించే విషయంలో దేశంలోని పోలీసులు న్యాయమైన పాత్ర నిర్వహించాలని రాష్ట్రపతి నేడిక్కడ పిలుపు యిచ్చారు.

సర్దార్‌వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమిలో ఐ.పి. ఎస్. ప్రొబేషనర్ల 28 వ బట్టు పేరేడ్‌లో మాట్లాడుతూ ప్రసంగిస్తూ "మీ విధులు, బాధ్యతలు రెండు చాలా కష్టతరమైనవి. ఇందుకు సమయ స్ఫూర్తి, సహనం అవసరం. మీరు ముందుచూపుతో రాబోవు పరిస్థితిని అంచనావేసి, అవాంఛనీయ పరిణామాలు సంభవించకుండా నిరోధించడం, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొవాలి" అని ప్రొబేషనర్లకు చెప్పారు.

ప్రజల ఆశించడానికి, పోలీసుల నిర్వహణమధ్యఅంతరం వున్నది కొంతమందిలో భావన వుందని ఆయన అన్నారు.

ఈ జాతీయ సంస్థలో శిక్షణ పొందడం వలన ఈ లోపం కొంతవరకైనా తగ్గడానికి సహాయపడగలదని ఆశాభావం అయన వ్యక్తం చేశారు.

పోలీసుశాఖ ప్రతిష్టను గురించి ప్రస్తావించి ప్రజలతో నిత్యసంబంధంవుండే పోలీసు స్టేషన్లకు బాధ్యత వహించే సబ్ ఇన్‌స్పెక్టర్లు త్వరితంగాను, సమర్థవంతంగాను చిత్తశుద్ధితోను వ్యవహరించడంపై ఈ ప్రతిష్ట ప్రధానంగా ఆధారపడి వుంటుందని అన్నారు,

పోలీసుస్టేషన్‌కు మామూలు ప్రజలు చేసుకొనే ఫిర్యాదులపై విచారణ జరపడం మాట అటుంచి కనీసం నమోదుకూడా చేయక పోవడం అనేది అసహజమేమీకాదని ఆయన అన్నారు.

ఇటువంటి ఇతర విషయాలు కాకుండా ఈ వాస్తవంవల్లనే పోలీసులు మంచిపేరు పొందలేకపోతున్నారని ఆయన అన్నారు.

ప్రజల న్యాయమైన వాంఛల కనుగుణ్యంగా ఈ విషయంలో సమర్థవంతమైన నిర్వహణను మెరుగుపరచాలని ఐ.పి.ఎస్, ప్రొబేషనర్లను ఉద్దేశించి ఆయన అన్నారు, నిష్పాక్షికమైన విచారణ, కేసులను త్వరితంగా పరిష్కరించడంకూడా జరగాలని కోరారు.

సమాజంలోని బలహీనవర్గాలకు రక్షణ కల్పించే సామాజిక న్యాయాన్ని పటిష్టవంతం చేయడమనేది ప్రధాని 20 అంశాల కార్యక్రమంలో కీలకమైన అంశమని, అది జరక్కపోతే సంక్షేమదేశం అన్న పదానికి అర్థంలేదని అన్నారు.

ప్రభుత్వ కార్య నిర్వాహకసాధనంగా పోలీసులకు వివిధ చట్టాల సవరణలవల్ల విశేషమైన అధికారాలు ఇవ్వబడ్డాయని అన్నారు. వాటిని సక్రమంగా వినియోగించినప్పుడే పోలీసుల ప్రతిష్ట పెరుగుతుందని అన్నారు.

ప్రొబేషనర్లను అభినందిస్తూ ప్రజాసేవ దృష్టితో సమర్థవంతంగా తమ బాధ్యతలు నిర్వహించగలరనే ఆశాభావం వెల్లడించారు.

ప్రధాని ఢిల్లీ పయనం

షిల్లాంగ్, నవంబరు 22

ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధి నేడిక్కడ నుండి ఢిల్లీకి బయలుదేరి వెళ్ళారు.

జె. ఎన్. టి.యు.లో ఎం.ఎస్., పి. హెచ్‌డి డిగ్రీ కోర్సులు

హైద్రాబాదు, నవంబరు 22

సాంకేతిక విద్యలో పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులను, పోస్టు గ్రాడ్యుయేట్ స్కూలు కొనసాగించుటతోపాటు మరో రెండు డిగ్రీలు ఎం. ఎస్; పి. హెచ్ డి లను కూడా ప్రారంభించాలని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం నిర్ణయించింది.

యూనివర్శిటీ ఆమోదించిన ఎక్స్‌టర్నల్ గైడ్స్ క్రింద దేశంలో అర్హతవున్న అభ్యర్థులు ఎక్కడున్నా ఈ పరిశోధన డిగ్రీలకు పని చేయవచ్చును.

ప్రస్తుతం పి. జి. స్కూలు నిర్వహిస్తున్న కోర్సులకు అదనంగా ఈ సదుపాయాన్ని కలుగచేస్తూ నిన్న వైస్‌ఛాన్సలర్ అధ్యక్షతన జరిగిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నిర్ణయంచేసింది.

రాష్ట్రంలో మొక్కజొన్న పంట విస్తీర్ణం

హైదరాబాద్, నవంబరు 23

1976 సెప్టెంబరు మాసాంతం నాటికి రాష్ట్రంలో 2,41,300 హెక్టార్లలో మొక్కజొన్న పంట పండించబడింది. గత సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో పోల్చిచూస్తేమొక్కజొన్న పండించేప్రాంతం 6.8 శాతం పడిపోయింది

తెలంగాణా ప్రాంతంలోని హైద్రాబాద్, నిజామాబాద్, మెదక్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలలో మొక్కజొన్న పంట ప్రధానంగా పండించబడుతుంది. ఖరీఫ్ పంట జూన్, జులై మాసాలలో నాట్లు వేయబడతాయి. వర్షాధారంతో పాటుగా ఇరిగేషన్ సౌకర్యాల ద్వారా కూడా ఈ పంట పండించబడుతూంది.

తూర్పు గోదావరి, గుంటూరు, అనంతపూర్, చిత్తూరు, నల్గొండ, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలలో ఈ సంవత్సరం మొక్కజొన్న పండించే ప్రాంతం గత సంవత్సరం మోతాదులోనే వుంటుందని అంచనా వేయబడింది. ఏజెన్సీ ప్రాంతాలలో ఈ పంట విస్తారంగా పండించబడినందున విశాఖపట్నంజిల్లాలో మొక్కజొన్నపండించే ప్రాంతం కొంత పెరిగింది.

ఇరిగేషన్ వనరులద్వారా నీటిని తగినంతగా సరఫరా చేసినందున, పంటలు మార్చవలసినందున హైదరాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాలలో పంట పండించే ప్రాంతం పెరిగింది.

ఉపఖండంలో ఆయుధపోటీకి దారితీసే అమెరికా ప్రతిపాదన: పాక్‌కు ఆయుధసరఫరాపై వాషింగ్టన్‌కుభారత్ స్పష్టీకరణ

వాషింగ్టన్, నవంబరు 23

పాకిస్తాన్‌కు 110ఎ.7 యుద్ధ విమానాలను సరఫరా చేయాలన్న అమెరికా ప్రతిపాదన భారత ఉపఖండంలో ఆయుధ పోటీకి దారి తీయగలదని భారత దేశం అమెరికాకు తెలియజేసింది. ఈ ప్రాంతంలో శాంతికి ప్రమాదం ఏర్పడుతుందని తెలిపింది.

అయితే ఈ విషయంపై తుదినిర్ణయాన్ని అధ్యక్షులుగా ఎన్నికైన జిమ్మీకార్టర్‌కు వదిలి వేయటంజరిగిందని విదేశాంగ మంత్రి హెన్రీ కిసింగర్ భారత్‌కు సమాధానంగా తెలియజేశారు.

అణ్వస్త్రాలను పాకిస్తాన్ తయారు చేయరాదన్న షరతుమీద ఆదేశానికి ఆయుధాలను సరఫరా చేయాలన్నది ప్రస్తుతం అమెరికా విధానమని కిసింగర్ భారత విదేశాంగశాఖ కార్యదర్శి శ్రీ జగత్ మెహతాకు తెలియజేశారని అమెరికా అధికారులు తెలియజేశారు.

అంటే దీని అర్థం ఫ్రాన్సునుండి అణు ఇంధన శుద్ధి కర్మాగారాలను పాకిస్తాన్ కొనుగోలు చేసినట్లయితే పాకిస్తాన్‌కు ఆయుధాల సరఫరాను నిలుపు చేయాలని ఫోర్డుప్రభుత్వం జిమ్మీ కార్టర్‌ప్రభుత్వానికి సిఫారసు చేయదమేనని వారు తెలిపారు.

1200 మైళ్ళ రేంజిగల బాంబర్‌లను సరఫరా చేయాలని పాకిస్తాన్ చేసిన అభ్యర్థనను ఆమోదించాలని పెంటగన్ గత వారం విదేశాంగ శాఖకు సిఫారసు చేసింది.

టెక్సాస్‌కు చెందిన ఎయిరోసేన్ కార్పొరేషన్ ఆఫ్ డిల్లా నుండి 70 కోట్ల డాలర్ల విలువగల ఆయుధాలను కొనుగోలు చేయడానికి టర్కీ ప్రభుత్వంఒప్పందం కుదుర్చుకున్నది. ఫ్రాన్సునుండి అణు ఇంధనశుద్ధి కర్మాగారాలను, కొనుగోలు చేసినట్లయితే పాకిస్తాన్‌కు అమెరికా మొత్తం సైనిక సహాయం నిలిపివేయ వచ్చునని తెలియజేసినందున పాక్ ప్రభుత్వం ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తున్నది.

న్యూయార్కుకు వెళ్ళేముందు శ్రీ జగత్ మెహతా కిసింగర్‌తో చర్చలు జరిపారు. చర్చలలో అమెరికాలోని భారత నూతన రాయబారి శ్రీ కేవల్‌సింగ్ కూడా పాల్గొన్నారు. భారత అమెరికా సంబంధాలకు సంబంధించిన వివిధ అంశాలపై వారు చర్చలు జరిపారు.

పాకిస్తాన్‌కు యుద్ధ విమానాలను సరఫరా చేయడంవల్ల ఈ ప్రాంతంలో శాంతికి ప్రమాదం ఏర్పడగలదని శ్రీ జగత్‌మెహతా స్పష్టం చేశారు. ఎ‑7 యుద్ధ విమానాలు భారతదేశంలోని ఏ ప్రాంతంమీదనైనా దాడి చేయగలవు. ఈ విమానాలు 7 టన్నుల బాంబులను తీసుకువెళ్ళగలవు.

భారత్ - న్యూజిలాండ్ జట్ల మధ్య

రెండవ క్రికెట్ టెస్ట్ డ్రా

కాన్పూర్, నవంబరు 23

భారత్ - న్యూజిలాండ్ జట్ల మధ్య యిక్కడ గ్రీన్ పార్క్‌లో జరుగుతున్న రెండవ క్రికెట్ టెస్ట్ పోటీ నేడు చివరి రోజున డ్రాగా ముగిసింది.

ఈ పోటీలో విజయాన్ని సాధించాలంటే 383 పరుగులు చేయవలసిన న్యూజిలాండ్ జట్టు నేడు ఆట ఆఖరయ్యే సమయానికి ఏడు వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది.

ఆట ముగిసే సమయానికి వారెన్‌లీ 49 పరుగులతో, డే.డ్ ఒసలివాన్ 23 పరుగులలో అజేయంగా వున్నారు.

ఈ పోటీలో విజయాన్ని సాధించాలంటే 383 పరుగులు చేయవలసి వున్న న్యూజిలాండ్ జట్టు నేటి ఉదయం ఆట ప్రారంభించి లంచ్ సమయానికి మూడు వికెట్ల నష్టానికి 86 పరుగులు చేసింది. న్యూజిలాండ్ రెండవ ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన మారెపొర్కర్, గ్రీన్‌టర్నర్‌లు జాగ్రత్తగానే ఆడారు. అయితే మారెపొర్కర్ చంద్రశేఖర్ బౌలింగ్‌లో 10 పరుగులకు అవుటయ్యారు. అనంతరం టర్నర్ 35 పరుగులకు బేడి బౌలింగులో అవుటయ్యారు. మరికొంతసేపటికివెంకట్రాఘవన్‌బౌలింగ్‌లో బర్జెస్ అవుటయ్యారు.

లంచ్ తరువాత టీ విరామ సమయంలోగామరోనాల్గువికెట్లు టకటకపడిపోయాయి.

స్కోరు వివరాలు :

భారత్ మొదటి ఇన్నింగ్ : 9 వికెట్లకు 524 డిక్లేర్.

‑ రెండవ ఇన్నింగ్స్ ‑ 2 వికెట్లకు 208 డిక్లేర్.

న్యూజిలాండ్ మొదటి ఇన్నింగ్స్ ‑ 350

రెండవ ఇన్నింగ్స్ ‑ 7 వికెట్లకు 193.

మూడవ టెస్టుకు భారత్ జట్టు

నవంబరు 26 నుండి మద్రాసులో ప్రారంభం కానున్న భారత న్యూజిలాండ్‌ల మూడవ క్రికెట్ టెస్ట్‌లో పాల్గొనే భారత జట్టు సభ్యుల పేర్లను నేడిక్కడ ప్రకటించారు. దిలీప్‌వెంగ్‌సర్కార్ స్థానంలో రాజస్తాన్‌కు చెందిన పార్థసారథిశర్మను ఎంపికచేశారు.

భారత క్రికెట్ బోర్డు కార్యదర్శి శ్రీ గులామ్ అహమ్మద్ నేటి ఉదయం జట్టు సభ్యుల పేర్లను ప్రకటించారు.

బిషన్‌సింగ్‌బేడి (కెప్టెన్) ఎస్. ఎం. గవాస్కర్, ఎ. డి. గయక్వాడ్, ఎం. అమర్‌నాథ్, జి. ఆర్. విశ్వనాథ్, బి. పి. పటేల్, ఎ. ఎస్. మంకడ్, మదన్‌లాల్ ఎస్. వెంకట్రాఘవన్, కిర్మాణీ. బి. ఎస్. చంద్రశేఖర్, ప్రసన్న, భరతరెడ్డి, పార్థసారథి శర్మ.

హైద్రాబాద్‌లో మహిళా సాంకేతిక శిక్షణా సంస్థ

వచ్చే విద్యా సంవత్సరం నుండి ప్రారంభం

హైదరాబాద్, నవంబరు 23

వచ్చే విద్యా సంవత్సరంనుండి మహిళా సాంకేతిక శిక్షణా సంస్థ పనిచెయ్యడం ప్రారంభించగలదని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రకటించింది.

అంతర్జాతీయ మహిళా సంవత్సరం సందర్భంగా ఏర్పాటుచేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి కమిటీ సిఫారసు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ సంస్థను నెలకొల్ప సంకల్పించింది.

రు. 20.9 లక్షల ఖర్చుతో నిర్మిస్తున్న భవన నిర్మాణ కార్యక్రమాలు పూర్తికి చురుకుగా పని కొనసాగుతూంది. వచ్చే విద్యా సంవత్సరం నుండి శిక్షణా సంస్థ పని చెయ్యడం ప్రారంభిస్తే 19 8‑79 నాటికి సాంకేతిక శిక్షణ పొందిన ఒక బృందం ఉద్యోగార్హత పొందుతుంది.

శిక్షణా సంస్థలో ఈ క్రింది ఏడు రకాల సాంకేతిక శిక్షణలను ప్రారంభిస్తున్నారు.

అవి టెలివిజన్, రేడియో: నిర్వహణ, ముద్రణ, రంగుల అద్దకం, బైండింగ్, కంపోజింగు, టెలిఫోన్ అపరేషన్ కమ్ రిసెప్షన్, దుస్తులు, ఆభరణాలు. సేల్స్‌మన్‌షిప్, మార్కెటింగ్, జౌళి దుస్తుల డిజైనింగు. (వి. వి.)

రీ కండిషన్ చేసిన ఐదు స్టీమ్ ఇంజన్లు

టాంజానియాకు ఎగుమతి

మద్రాసు, నవంబరు 23

నూనె సహాయంతో నడిచే రీ కండిషన్ చేయబడిన ఐదు మీటర్‌గేజ్ స్టీమ్ ఇంజన్లను దక్షిణ రైల్వే నేడు టాంజానియాకు పంపింది. వీటి ఖరీదు సుమారు కోటిరూపాయలు వుంటుంది,

వీటితోపాటు టాంజానియా నుండి 17 కోచ్‌లు, 10 డీసెల్ లోకోమోటివ్‌లకు కూడా ఆర్డర్లు వచ్చాయి. తర్వాత వీటిని టాంజానియాకు పంపుతారు. ఈ ఆర్డరువల్ల దేశానికి 1½ కోట్ల డాలర్ల విదేశీ మారకద్రవ్యం లభ్యమవుతుందని రైల్వే అధికార్లు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

తిరుచిరాపల్లి గోల్డెన్‌రాక్ వర్క్‌షాపులో వీటిని మూడునెలల కాలంలో తయారుచేశారు.

అంగోలాకు ఐ.రా.స. సభ్యత్వం: భద్రతా సంఘం సిఫారసు

ఐ. రా. స. నవంబరు 23

ఐ. రా. స. లో అంగోలాకు సభ్యత్వం యివ్వాలని జనరల్ అసెంబ్లీకి సిఫారసు చేస్తూ భద్రతాసంఘం నిన్న ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

భద్రతాసంఘంలో ఈ విషయంపై జరిగిన ఓటింగ్‌లో తీర్మానానికి అనుకూలంగా 13 ఓట్లు వచ్చాయి. రెండు దేశాలు ఓటింగులో పాల్గొనలేదు. భద్రతా సంఘం సభ్యుల సంఖ్య 15.

అంగోలా భూభాగంలో క్యూబా సైన్యాలు వున్నాయన్నసాకుతోగతజూన్‌లో ఐ.రా.సలో అంగోలా సభ్యత్వాన్ని వ్యతిరేకిస్తూ వీటో చేసిన అమెరికా నిన్నటి ఓటింగులో పాల్గొనలేదు.

గతంలో మాదిరిగానే చైనా ఓటింగులో పాల్గొనలేదు.

భారత దేశం భద్రతా సంఘం సభ్యదేశంకాక పోయినప్పటికి సమావేశంలో పాల్గొన్నది.

భారత శాశ్వత ప్రతినిధి శ్రీ రిఖిజైపాల్ అంగోలాకు సభ్యత్వం యిచ్చే విషయంలో జాప్యం చేయరాదని కోరారు.

"ఆఫ్రికా స్నేహితులు వెల్లడించిన అభిప్రాయాలను గౌరవించేందుకుగాను, ఈసారి అంగోలా సభ్యత్వ విషయంలో తాము వీటో చేయడంలేదని అమెరికా ప్రతినిధి అన్నారు.

"అంగోలా ప్రభుత్వ నిజమైన స్వాతంత్ర్యంపై తమకు ఇంకా అనుమానున్నాయని" అమెరికా ప్రతినిధి అన్నారు.

మిగతా సభ్యులంతా అంగోలాను చేర్చుకోవాలని గట్టిగా కోరారు.

వలసదేశంలో వున్నప్పుడు పోర్చుగల్ ద్వారా ఐరాసలో పరోక్ష ప్రాతినిధ్యం కలిగిన అంగోలా ప్రజలకు, స్వాతంత్ర్యం పొందిన తరువాత ప్రపంచసంస్థలో ప్రాతినిధ్యం లభించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నదని భారత ప్రతినిధి శ్రీ రిఖి జైపాల్ అన్నారు.

అంగోలా చేరికతో ఐ రా.స సభ్యత్వం 146 కు చేరుకుంటుంది. ఈ సంవత్సరం సభ్యత్వం పొందిన దేశాలలో అంగోలా రెండవ దేశం అవుతుంది. సెషెల్స్ ఈసంవత్సరమే ఐ.రా.స. సభ్యదేశం అయిన విషయం పాఠకులకు విదితమే.

శ్రీ ప్రగతి నికేతన్
(కనకదుర్గాటాకీసు ఎదుటి రోడ్డులో)
సూర్యారావుపేట, విజయవాడ-2. ఫోను: 77971

10వ తరగతి (తప్పినవారికి) మార్చి తరగతులు
ది 1-12-76 నుండి ప్రారంభం

- అప్లికేషన్లు ది 22-11-76 నుండి ఇవ్వబడుచున్నవి
- హాస్టలులోను, తరగతిలోను సీట్లు పరిమితము.

కోటగిరి సీతారామ మూర్తి, B A , B.Ed., హెడ్మాస్టరు
యలమంచిలి చంద్రశేఖర్ M.A., B.Ed., L.S.G.D. ప్రిన్సిపాల్.

విశాలాంధ్ర

1976 నవంబరు 24 బుధవారం

విద్యుత్ అవసరాలు

వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు అధికాధికంగా విస్తరించేకొలదీ విద్యుత్ వినియోగం పెరుగుతున్నది. ఈ అవసరాలన్నీ తీర్చడానికి వీలుగా విద్యుదుత్పత్తిని యెక్కువ చేయాల్సిన అవసరం ఏర్పడుతున్నది. కానీ వినిమయంలోనూ విద్యుత్ ఉత్పత్తిలో రాష్ట్రం యింకా వెనకబడివుంటున్నది. అఖిలభారత స్థాయిలో తలసరి దామాషా విద్యుత్ వినిమయం 100 కిలోవాట్లు కాగా ఆంధ్రప్రదేశ్‌లో యిది 64 కిలోవాట్లు మాత్రమే వున్నది. అలాగే రాష్ట్రంలోని మొత్తం 27,221 గ్రామాలుండగా సగానికి తక్కువ గ్రామాలకు - 12,478 - మాత్రమే విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయబడింది. రాష్ట్రంలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకోసం పెట్టబడిన 60 వేల దరఖాస్తులు పెండింగ్‌లో వున్నాయి. ఇందులో 30 వేలు యింటి కనెక్షన్‌లకు సంబంధించినవి. 15 శాతం వ్యవసాయానికి సంబంధించినవి. మిగతావి పరిశ్రమలు యితరత్రా అవసరాలు తీర్చడానికి ఉద్దేశించినవి.

నాల్గవ ప్రణాళికాంతానికి మన రాష్ట్రంలో తీవ్రవిద్యుత్ కొరతను ఎదుర్కొన్నది. 1972 నుండే దాదాపు ప్రతి సంవత్సరం 10 నుండి 30 శాతంవరకు విద్యుత్ వినియోగంలో కోతపెట్టబడింది. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం నాల్గవ ప్రణాళిక చివరకున్న 663 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదక శక్తిని 5 వ ప్రణాళికాంతానికి 1990 మెగావాట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ సంవత్సరం మార్చి నెలలో, దిగువ సీలేరు ప్రాజెక్టుకు సంబంధించిన 100 మెగావాట్ల మొదటి విద్యుత్ కేంద్రానికి కేంద్ర ఇంధనశాఖ మంత్రి కె. సి. పంత్ ప్రారంభోత్సవం చేశారు. అలాగే ఈ యేడాది అక్టోబరు చివరమాసంలో దిగువ సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో 115 మెగావాట్ల ఉత్పత్తి శక్తిగల 2 వ యూనిట్‌ను ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు ప్రారంభించారు. ఈ యూనిట్ ప్రారంభం కావడంతో రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తిశక్తి 1100 మెగావాట్లకు చేరుకున్నది ఈ సందర్భంగానే ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు మాట్లాడుతూ ప్రతి ఆరు మాసాలకు అదనంగా 115 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిచేసే కేంద్రాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు కూడా.

అందువల్ల 5 వ ప్రణాళికాంతానికి లక్ష్యంగా నిర్ణయించుకొన్న 1990 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని సాధించాలంటే మిగిలిన ప్రాజెక్టులను పూర్తి చేయవలసి వుంది. వీటిలో దిగువ సీలేరుకు సంబంధించి ఒక్కొక్కటి 100 మెగావాట్లను ఉత్పత్తిచేసే 2 కేంద్రాలు, కొత్తగూడెం థర్మల్ కేంద్రంలో నాల్గవదశ విస్తరణ పథకం లోని 110 మెగావాట్ల రెండు యూనిట్లు, నాగార్జునసాగర్‌లోని 110 మెగావాట్ల యూనిట్, శ్రీశైలం లోని 110 మెగావాట్ల యూనిట్, విజయవాడ థర్మల్ కేంద్రంలోని 100 మెగావాట్ల రెండుయూనిట్లు వున్నాయి అలాగే రామగుండం, మణుగూరు సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు కేంద్ర ప్రణాళికా సంఘ ఆమోదం లభించితే మనరాష్ట్రం విద్యుత్ ఉత్పత్తిశక్తి గణనీయంగా పెరగగలదు ఆనాడుయిరుగు పొరుగు రాష్ట్రాలకు సరఫరా చేసే శక్తి స్తోమతలు మన రాష్ట్రానికి వుంటాయి. అందువల్ల ఈప్రాజెక్టులకు సంబంధించి ప్రపంచ బ్యాంకు, తదితర సంస్థల, దేశాల, కేంద్ర ప్రభుత్వంసహాయం త్వరితగతిన పొందడానికి రాష్ట్ర ప్రభుత్వంకృషి చేయడం, తద్వారా విద్యుత్ అవసరాలనుతీర్చడంతో పాటు రాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామికాభివృద్ధికి దోహదపడడం ముఖ్య కర్తవ్యం.

గ్రామాలలో హౌసింగ్ సొసైటీల ఏర్పాటు : శ్రీ మహేంద్రనాద్ సూచన

నిజామాబాద్, నవంబర్ 22

బలహీన వర్గాల ప్రజలకు గృహాల నిర్మాణానికి గ్రామీణ సహకార హౌసింగ్ సొసైటీలకు ప్రభుత్వం రుణాలు నిస్తుందని అందువల్ల గ్రామాలలో హౌసింగ్ సొసైటీలను ఏర్పాటు చేసుకోవాలని హరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పి. మహేంద్రనాథ్ యిటీవల యిక్కడ చెప్పారు. ఎల్లారెడ్డిలో మార్కెటింగ్ కమిటీకి 14 ఎకరాల భూమి సేకరణకు వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హామీ యిచ్చారు.

ఎల్లారెడ్డిలో జరిగిన బహిరంగసభలో రు. 54,750 విలువగల 37 జతల ఎడ్లను ఆయన పంపిణీ చేశారు.

సభకు అధ్యక్షత వహించిన జిల్లాకలెక్టర్ ప్రసంగిస్తూ, యీ తాలూకాలో లంబాడీల సంక్షేమానికి రు. 2 లక్షలతో పథకాలను చేపట్టాలని తలపెట్టినట్లు ప్రకటించారు.

కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు శ్రీ శ్రీనివాసరావు, శాసనసభ్యులు శ్రీ సత్యనారాయణ, శ్రీ వెంకట్రామరెడ్డి శ్రీ రామచంద్రారెడ్డి ప్రసంగించారు. నిజామాబాద్ డి. ఆర్. ఓ. శ్రీ జి. నారాయణ వందన సమర్పణ చేశారు.

మల్కాపూర్‌లో రైతు దినోత్సవం

వరంగల్ చిన్నకారు రైతుల అభివృద్ధి సంస్థ అధ్వర్యాన ఘన్‌పూర్ పంచాయతీ సమితిలోని మల్కాపూర్‌లో రైతు దినోత్సవం జరిగింది వరంగల్ పంజాబ్ నేషనల్ బ్యాంక్ మంజూరుచేసిన రు. 61,800 రుణాలను పంపిణీ చేశారు.

షాద్‌నగర్‌లో మల్బరీ తోటల పెంపకానికి చర్యలు

హైదరాబాద్, నవంబర్ 22

ఆంధ్రప్రదేశ్‌లో అనావృష్టి ప్రాంతాల అభివృద్ధి పథకం క్రింద, మహబూబ్‌నగర్ జిల్లాలోని షాద్‌నగర్‌లో పట్టు పరిశ్రమ, మల్బరీ తోటల పెంపకం విషయాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.

శిక్షణ కాలం ఒక నెల రోజులు. ఈ శిక్షణకాలంలో ఒక్కొక్క శిక్షితునికి రు 100 చొప్పున ఇవ్వడానికి నిర్ణయించబడింది. ఈ పథకంలో నెలకు 12 మంది చొప్పున నాలుగు నెలలపాటు శిక్షణ నిర్వహించడానికి నిర్ణయించబడింది. డిసెంబరు ఒకటినుండి తరగతులు ప్రారంభమవుతాయి.

రాష్ట్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలలోని రైతులకు సబ్సిడీపథకం క్రింద మల్బరీ మొక్కలను ఇస్తారు.

నెల్లూరులో వ్యవసాయ పారిశ్రామిక ప్రదర్శన

నెల్లూరు, నవంబరు 22

ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవాల సందర్భంగా నెల్లూరు సహకార సెంట్రల్ బ్యాంకు ఆవరణలో జిల్లా స్థాయి వ్యవసాయ పారిశ్రామిక ప్రదర్శనను ఏర్పాటు చేశారు.

ప్రదర్శనకు జిల్లా జడ్జి శ్రీ టి.ఎల్.ఎన్. రెడ్డి ఈనెల 15వ తేదీరాత్రి ప్రారంభోత్సవం చేశారు.

రాష్ట్రం, జిల్లా వివిధ రంగాలలో సాధించిన ప్రగతిని ప్రజలు తెలుసుకునేందుకు ప్రదర్శన దోహదం చేయగలదని ఆయన అన్నారు.

పోలీసు సూపరింటెండెంటు శ్రీ ఎస్. సి. ద్వివేది రాష్ట్రం సాధించిన ప్రగతిని వివరించారు.

వ్యవసాయశాఖ, పశుగణాభివృద్ధి శాఖ, కుటుంబ నియంత్రణ చేనేత,మత్స్య శాఖలు, సమాచార శాఖ, మహిళా సంక్షేమ శాఖల కార్యకలాపాలను, సాధించిన విజయాలను ప్రదర్శనలో ప్రదర్శించారు. జిల్లా కలెక్టరు, ప్రధాన అతిథులు ప్రదర్శనను తిలకించి, జిల్లాలో సాధించిన విజయాలను ప్రజలకు తెలియ జేయటానికి వివిధశాఖలు చేసిన కృషిని ప్రశంసించారు.

వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ టి కోటేశ్వరరావు ప్రదర్శన లక్ష్యాలను వివరించారు.

డి. పి. ఆర్. ఓ. శ్రీ ఎం. చంద్రశేఖరయ్య వందన సమర్పణచేశారు. అనంతరం రాష్ట్ర చలన చిత్రాభివృద్ధిసంస్థ రూపొందించిన డాక్యుమెంటరీలను ప్రదర్శించారు.

బాలలదినోత్సవం

బాలల దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని 16 విద్యాసంస్థలకు చెందిన ఆరువేల మంది బాలబాలికలు ఈ నెల 14న ప్రదర్శన జరిపారు.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమి ఆధ్వర్యాన వ్యాసరచన వక్తృత్వ పోటీలు, నాటకాలు, నాట్యప్రదర్శన పోటీలు జరిగాయి. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు యిచ్చారు.

సాయంత్రంసెయింట్ పీటర్స్‌హైస్కూలు ఆవరణలో జరిగిన సభకు జిల్లా కలెక్టరు శ్రీ సి. అర్జునరావు అధ్యక్షత వహించారు. జిల్లా జడ్జి శ్రీ టి. ఎల్. ఎన్. రెడ్డి ప్రసంగించారు.

సెయింట్ జోసెఫ్ ఇంగ్లీషు మీడియం పాఠశాలకు చెందిన 8 సంవత్సరాల బాలిక టి.యస్. దీప పండిట్ నెహ్రూ జీవితాన్ని, బోధనలను గురించి అనర్గళంగా ప్రసంగించడం ఉత్సవాలలో ప్రత్యేక విశేషం ఆ పాపకు జిల్లా కలెక్టరు రు. 25 ల నగదు బహుమతిని ప్రకటించారు.

అంతకుముందు జిల్లా విద్యాశాఖాధికారి శ్రీ సి. ఎచ్. వి. సుబ్బారెడ్డి స్వాగతం చెప్పారు.

నెల్లూరు ఫిలిం క్లబ్‌వారు బాలలనిమిత్తం లీలామహల్‌లో బాలల చిత్రాలను ప్రదర్శించారు. బాలలకు మిఠాయిలు పంచిపెట్టారు.

డి. పి. ఆర్. ఓ. శ్రీ చంద్రశేఖరయ్య ఈ సందర్భంగా జరిగిన సభకు అధ్యక్షత వహించారు. శ్రీ సి. ఎచ్. వి. సుబ్బారెడ్డి ఉత్సవాలకు ప్రధాన అతిథిగా హాజరయ్యారు.

మురికివాడల నిర్మూలన దినం

మురికివాడల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈ నెల 13న ఏర్పాటు చేయబడిన బహిరంగసభలో జిల్లా జడ్జి శ్రీ టి. ఎల్. ఎన్. రెడ్డి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా వుంచాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో ఆక్రమణలను తొలగించటానికి, రోడ్లు, కుళాయిలు, స్నానాలగదులు, పాయిఖానాల ఏర్పాటుకు మునిసిపాలిటీ చేస్తున్న కృషిని అభినందించారు.

మునిసిపాలిటీ మాజీఅధ్యక్షులు శ్రీ హైదర్ ప్రసంగిస్తూ మురికివాడలలో శాశ్వత గృహాలను నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కలెక్టరు శ్రీ అర్జునరావు సభకు అధ్యక్షత వహించారు. సీనియర్ యూత్ ఆఫీసర్ శ్రీ పి. వెంకట శేషయ్య, పోలీసు సూపరింటెండెంట్ శ్రీ ఎస్. సి. ద్వివేది. జిల్లాహెడ్ క్వార్టర్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి. సరోజాక్షి సభలో పాల్గొన్నారు.

అంతకు ముందు మునిసిపల్ కమిషనర్ శ్రీ నాగేశ్వరరావు ప్రసంగిస్తూ దశలవారీగా పట్టణంలోని మురికివాడ లన్నింటికి విద్యుత్, నీరూ, రోడ్లు తదితర సౌకర్యాలు ఏర్పాటుచేస్తామని అన్నారు.

మునిసిపల్ ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ 3 వేలమంది బాల బాలికల నిమిత్తం రోగ నిరోధక పథకం క్రింద కార్యక్రమాన్ని చేపడతామని అన్నారు.

20 అంశాల ఆర్థిక కార్యక్రమంలోసమాచారశాఖ "లోకకల్యాణం" నాటికను ప్రదర్శించింది.

నెల్లూరువిద్యార్థులచే శ్రమదానం

నెల్లూరు, నవంబర్ 20

జాతీయ సేవాపథకంక్రింద స్థానిక వి. ఆర్. కళాశాల విద్యార్థులు 250 మంది శ్రమదానం చేసి ఐదు ఫర్లాంగుల మట్టిరోడ్డు వేశారు.

ఈరోడ్డు వెంకటేశ్వరపురం ప్రాంతాన్ని జాతీయరహదారితో కలుపుతుంది.హరిజనులు గిరిజనులు యితర వెనుకబడిన తరగతుల వారు నివసించే యీ ప్రాంతంలో మంచినీటి బావిని త్రవ్వేందుకు కూడ విద్యార్థులు శ్రమదానం చేస్తారు.

ఈ కార్యక్రమంలో జిల్లాకలెక్టర్ శ్రీ సి. అర్జునరావు పాల్గొంటూ బలహీనవర్గాల కొరకు సంక్షేమ కార్యక్రమాన్ని చేపట్టిన విద్యార్థులను అభినందించారు. పోలీసులు కూడ జాతీయ సేవాపథకంలో పాల్గొని రోడ్డునిర్మాణంలో సహాయం చేస్తారని సభలో ప్రసంగించిన పోలీసు సూపరింటెండెంట్ శ్రీ ద్వివేది ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో శ్రీ యుతులు టి. యస్. యన్. రెడ్డి, పి. నాగేశ్వరరావు, చంద్రశేఖరయ్య, వి. యస్. రంగారావు, వెంకటసుబ్బయ్య, జైనలుద్దీన్, పి. రామసుబ్రహ్మణ్యంలు వున్నారు.

జి. డి. ఆర్. వార్షికోత్సవం

నెల్లూరు సాంస్కృతిక కేంద్రం, భారత. జి. డి. ఆర్. మైత్రి సంఘం ఆధ్వర్యాన ఈనెల 14 వ తేదీన జి. డి. ఆర్. 27 వ వార్షికోత్సవాన్ని, నెహ్రూ 87 వ జన్మ దినోత్సవాన్ని పాటించటం జరిగింది.

ఈ మహాసభకు మాజీ పార్లమెంటు సభ్యులు శ్రీ ఆర్. యల్. రెడ్డి అధ్యక్షత వహించారు.

డాక్టర్ సి. వి. శాస్త్రి జవహర్‌లాల్ విధానాలపైనా, శ్రీ కె. పురుషోత్తమరావు జి. డి. ఆర్. గత 27 సంవత్సరాలలో సాధించిన పురోగతిపైన ప్రసంగించారు.

యూరప్‌లో శాంతి పరిరక్షణకు జి. డి. ఆర్. నిర్వహించిన ప్రముఖ పాత్రను శ్రీ యస్. కృష్ణారావు వివరించారు.

ధరల అదుపు దినం పాటింపు

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో పెట్టేందుకు ఉత్పత్తిదారులు, వినిమయదారులు, వ్యాపారస్తులు, ప్రభుత్వ అధికారులు కలిసి పనిచేయాలని మాజీ మంత్రి శ్రీ సంజీవరెడ్డి యీ నెల 15 వ తేదీన జరిగిన ధరల అదుపు దినోత్సవంలో పాల్గొంటూ సూచించినారు.

సభకు అధ్యక్షత వహించిన డి. ఆర్. ఓ. శ్రీ రామచంద్ర మాట్లాడుతూ ధరలను అదుపు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

జిల్లాలో 2700 టన్నుల బియ్యం వున్నాయని, ఈ నెలనుండి పట్టణంలో కుటుంబానికి 30 కిలోలు, గ్రామంలో 20 కిలోలు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు.

అడ్వొకేట్ శ్రీ యం. సుందరాచారి మాట్లాడుతూ టోకు వ్యాపారాన్ని, పంపిణీని జాతీయంచేయాలని డిమాండు చేశారు ప్రారంభంలో జిల్లా సప్లయిస్ అధికారి శ్రీ రఘునాథరావు స్వాగతం చెప్పారు

రాజమండ్రిలో

రాజమండ్రి మల్లయ్య పేటలోని పేపర్ మిల్లు కార్మిక కాలనీలో కార్మిక సంక్షేమ కేంద్రంవద్ద జరిగిన సభకు పేపర్‌మిల్లు కార్యదర్శి శ్రీ ఆర్ వి మహేశ్వర్ అధ్యక్షత వహిస్తూ గత 20 సంవత్సరాలలో సాధించిన కృషిని వివరించారు

సంక్షేమ దినోత్సవం సందర్భంగా వారం రోజులపాటు ఆటలు, వక్తృత్వ, కట్టుబల్లి కల పోటీలు నిర్వహించారు ఈ పోటీలో గెలుపొందినవారికి శ్రీ మహేశ్వర్ బహుమతులను అంద చేశారు

కార్మిక పయోజన విద్యాశాఖాధికారి శ్రీ ఎ వి సుబ్బారాయుడు పర్యవేక్షణలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని ప్రచారం చేసే నాటిక "కాలమారింది, మనుషులే మారాలి" ప్రదర్శించబడింది.

కార్మిక సంబంధాల అధికారి శ్రీ సి. వి. కృష్ణయ్య వందన సమర్పణ చేశారు.

ఇల్లెందులో స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ బ్రాంచి ప్రారంభం

ఇల్లెందు, నవంబరు 22

ఖమ్మంజిల్లా ఇల్లెందు తాలూకాలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ బ్రాంచికి జిల్లా కలెక్టర్ శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్ ప్రారంభోత్సవం చేశారు.

బ్యాంకు రీజినల్ మేనేజర్ శ్రీ వి. శ్రీనివాసన్ స్వాగతం చెబుతూ యిది 339 వ బ్రాంచి అని చెప్పారు.

శ్రీ ప్రసాద్ ప్రసంగిస్తూ జిల్లాలో [illegible] 50 బ్రాంచీలు ప్రారంభించబడ్డాయని యీ సంవత్సరం వివిధ బ్యాంకుల ద్వారా రు. 12 కోట్లు రుణాలు యిచ్చినట్లు తెలిపారు.

జిల్లా మార్కెట్ కమిటీ సంఘ అధ్యక్షులు శ్రీ నాదెండ్ల శంకరరావు, సబ్ కలెక్టర్ శ్రీ కృష్ణకుమార్ సైగల్, తహశీల్దార్ శ్రీ యం. వీరల్‌రావు, బి. డి. ఓ. శ్రీ యం. రామకృష్ణయ్య హాజరయ్యారు. బ్రాంచి మేనేజర్ శ్రీ యస్. ఎన్. వి. మల్లికార్జునరావు వందన సమర్పణ చేశారు.

ప్రధాని జన్మదినోత్సవం

ఖమ్మం జిల్లా ఇల్లెందు తాలూకాలో ప్రధాని ఇందిరాగాంధీ జన్మదినోత్సవ సందర్భముగా ఉత్సవములు జరిగినవి. ఇల్లెందులో వివిధ పాఠశాలల విద్యార్థులు,స్కౌట్లు, గైడ్లు ఉపాధ్యాయులు, జిల్లా కలెక్టరు శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్, సబ్ కలెక్టరు శ్రీ కృష్ణకుమార్ సైగల్ తహశీల్‌దారు శ్రీ యన్. వీరల్‌రావు, బి. డి.ఓ. శ్రీ రామయ్య ముందు నడవగా ఊరేగింపు జరిపి స్థానిక వెంకటేశ్వరస్వామి దేవాలయములో హరిజనుల ప్రవేశము గావించిరి. సమితి కార్యాలయములో జరిగిన బహిరంగసభలో జిల్లా కలెక్టరు స్థానిక స్టేట్ బ్యాంకు బ్రాంచి వారు వివిధ వృత్తులకై మంజూరు చేసిన అప్పులను 145 మంది బలహీన వర్గాలవారికి పంపిణీ చేశారు. రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలు జరిగినవి.

ముల్కనూరులో

ముల్కనూరు గ్రామంలో జిల్లా పరిషత్తోన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు గ్రామీణులు ఊరేగింపు జరిపి స్థానిక గిరిజనవాడ బజార్లను శ్రమదానంతో శుభ్రపరచారు. సాయంత్రం జరిగిన బహిరంగసభకు జిల్లా సహకార మార్కెటు కమిటీ అధ్యక్షులు శ్రీ నాదెండ్ల శంకరరావు అధ్యక్షత వహించారు.

ప్రధాన ఉపాధ్యాయులు శ్రీ కె. రామయ్య తాలూకా పౌర సంబంధాల శాఖాధికారి శ్రీ వి రామారావులు ఇందిరా గాంధీ దేశాన్నిఅత్యయిక పరిస్థితి పెట్టి ఏవిధ పరిస్థితులలో కాపాడినది వివరించారు తదుపరి పౌర సంబంధ శాఖ వారిచే నియమించబడిన శ్రీ ఈశ్వరరావు దళం వారిచే 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం గురించి బుర్రకథ చెప్పబడింది, శ్రీ జి సాంబశివరావు వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

భీమవరం బియ్యం వర్తకులసంఘం భవనానికి శంకుస్థాపన

భీమవరం, నవంబరు 19

భీమవరం ధాన్యం, బియ్యం, కిరాణా వర్తక సంఘ భవనానికి పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరు శ్రీ జి. కుమారస్వామిరెడ్డి ఈ నెల 15 న శంకు స్థాపన చేశారు.

సంక్షేమ కార్యక్రమాలకు నిధులిస్తున్న వ్యాపార సంస్థల సేవాభావంపట్ల శ్రీ రెడ్డి సంతృప్తిని వ్యక్తంచేశారు.

మానవ మేధకు పదును పెట్టే సాధనంగా గ్రంథాలయాలు

—కడప సభలో శ్రీ మల్లారెడ్డి ఉద్బోధ

కడప, నవంబరు 22

కడపలో శ్రీ పి. యల్. సంజీవరెడ్డి (కడపజిల్లా కలెక్టర్) అధ్యక్షతన శ్రీ సి. హెచ్. దేవానందరావు (గ్రంథాలయాల మంత్రి) గ్రంథాలయ వారోత్సవాలను యీ నెల 16 న ప్రారంభించారు.

అధ్యక్షులు శ్రీ పి. యల్. సంజీవరెడ్డి మాట్లాడుతూ కడపజిల్లా కేంద్ర గ్రంథాలయ భవనాన్ని త్వరలో నిర్మించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని - ప్రొద్దుటూరులో గ్రంథాలయ భవనాన్ని ఏర్పాటు చేయాలనీ - అన్నారు.

శ్రీ వి. సుబ్రహ్మణ్యరెడ్డి (జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు) స్వాగతం పలికారు.

శ్రీ గజ్జల మల్లారెడ్డి(ప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షవర్గ సభ్యులు) గ్రంథాలయాలు మానవ మేధస్సుకు పదును పెట్టేవనీ - అజ్ఞానాన్ని పారద్రోలేదానికి ఆయుధాగారాల వంటివని, కాలాన్ని వృధా చేసుకోకుండా విజ్ఞానాన్ని పొందాలని-ఉద్బోధించారు.

శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు మాట్లాడుతూ గ్రంథాలయాలను పోషించుకోవాల్సిన బాధ్యత ప్రజలపైన వున్నదనీ, గ్రంథాలయాలకు కావలసిన అన్ని వసతులు ప్రభుత్వం సమకూరుస్తుందనే ఆశాభావాన్ని వెలిబుచ్చారు.

శ్రీ వి. రమాపతిరాజు వందన సమర్పణతో సభ ముగిసింది.

రెండవరోజు జానపద వాఙ్మయంపై సదస్సు జరిగింది. డా॥ మల్లెమాల వేణుగోపాలరెడ్డి (కడపజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు) అధ్యక్షత వహించారు. జానపద సాహిత్యం అనిబద్ధ కవిత్వమైనా అతి మనోహరంగావుంటుందని జనపదులు ఉల్లాసంగా ఆనందంగా పాడుకొన్న పాటలు ఎన్నో వున్నాయని, వీటిని సేకరించాల్సిన బాధ్యత ప్రభుత్వంమీద వున్నదని అన్నారు.

శ్రీ యం. అప్పప్ప ప్రభుత్వ కళాశాల తెలుగు లెక్చరర్ జానపద సాహిత్యం రాను రాను లుప్తమవుతూందనీ పదాలనన్నింటినీ విధిగా సేకరించాలనీ నొక్కిచెప్పారు.

మొదట శ్రీ వెలగా వెంకటప్పయ్య (గ్రంథాలయ లైబ్రేరియన్) స్వాగతం పలికారు.

శ్రీ వి. రమాపతిరాజువందనసమర్పణతో సదస్సు ముగిసింది.

సాంస్కృతిక కార్యక్రమాలు జరిగినాయి. ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించారు.

16 వ తేదీన శ్రీ వై. వి. రమణారెడ్డి (మునిసిపల్ కమీషనర్) సభకు అధ్యక్షత వహించారు. శ్రీ రాఘవేంద్రరావు (ఆర్ అండ్ బి ఇంజనీరు) సభను ప్రారంభించారు.

శ్రీ చెరుకుపల్లి జమదగ్నిశర్మ(ప్రభుత్వ కళాశాల తెలుగు వుపన్యాసకులు) ఆంధ్ర భాషా సాహిత్యములు-వాని సుసంపన్నత్వం అన్న విషయంపై మాట్లాడారు.

శ్రీ వెలగా వెంకటప్పయ్య వక్తలకు స్వాగతం పలికారు.

శ్రీ వి. రమాపతిరాజు వందన సమర్పణ చేశారు.

వేసక్టమీ క్యాంపు

మధిర, నవంబర్ 17

కల్లూరు పంచాయతీ సమితి హెడ్ క్వార్టర్సులో అయిదు రోజులు నిర్వహించిన వేసక్టమీ క్యాంపులో 463 ఆపరేషన్లు చేశారు. ఈ కార్యక్రమము సమితి,రెవిన్యూ, హెల్తు యువజన కాంగ్రెస్ కార్యకర్తల సహకారముతో నిర్వహించబడినది. సమితి మండలి అధికారి శ్రీ బి. వి. యస్. నరసింహారావు అధ్వర్యంలో ఈ క్యాంపు నిర్వహించబడింది.

వరకట్న వ్యతిరేక సభ

కాకినాడలో

కాకినాడ, నవంబరు 20

వరకట్న దురాచారాన్ని నిర్మూలించేందుకు, ప్రేమించి పెళ్ళి చేసుకోవడానికి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని యిక్కడ జిల్లా పరిషత్ హాలులో వరకట్న వ్యతిరేక సభలో ప్రసంగిస్తూ జిల్లా స్త్రీ సంక్షేమశాఖాధికారిణి శ్రీమతి డి. గురుదేవి అన్నారు.

జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ వారు ఏర్పాటు చేసిన యీ సభకు పి. ఆర్. జి. కాలేజి ప్రిన్సిపాల్ శ్రీ ఆర్. వి. హనుమారెడ్డి అధ్యక్షత వహిస్తూ వరకట్న నిషేధ ఉద్యమాన్ని విస్తృత ప్రాతిపదికపై ఆచరణలో పెట్టాలని, ముఖ్యంగా విద్యార్థులు యిందుకు ప్రతిన పూనాలని, బీద వాళ్ళలోకంటె విద్యాధికులలోనే యీ దురాచారం ఎక్కువగా ఉందని అన్నారు.

డా॥ పి. యస్. మూర్తి ఉపన్యసిస్తూ కట్నాలు స్వీకరించబోమని యువకులు ప్రతిజ్ఞలుచేసి, ఆచరణలోపెట్టాలని కోరారు.

డా॥ శ్రీమతి పి. చిరంజీవినీ కుమారి ప్రసంగిస్తూ వివిధకాలాల్లో వివిధ రకాలుగా మారిన వివాహ వ్యవస్థ పరిణామాలను వివరించి, ప్రతిజ్ఞలు మాత్రమే సమస్యకు పరిష్కారం కాదని, యువకులు తమ కాళ్ళమీద తాముబ్రతుకుతామనేది లేకపోతే, కట్నాలకోసం చూడడం జరుగుతుందని, ప్రతిజ్ఞతోపాటు ఆచరణ కూడా కావాలని అన్నారు.

ఇంజనీరింగు విద్యార్థి శ్రీ రమేష్ నారాయణ్, మెడికల్ విద్యార్థిని కుమారి డి. వి. ఎ. ఎస్. సుబ్బలక్ష్మి, శ్రీమతి కె. స్వరాజ్యలక్ష్మి ప్రసంగించారు.

సభాధ్యక్షులు శ్రీహనుమారెడ్డి ప్రసంగిస్తూ వివాహబ్యూరోను యిక్కడకూడా స్థాపించి కృషిచేస్తే తప్పక ప్రయోజనం కలుగుతుందని అన్నారు.

డి. పి. ఆర్. ఓ. శ్రీ పి. రామకృష్ణారావు స్వాగతం చెప్పారు.

శ్రీ జి. రాము పార్టీ వారు "నవ చైతన్యం" అనే బుర్రకథను చెప్పారు.

(వి. వి.)

కాకినాడలో రోటరాక్టు క్లబ్ సమావేశం

కాకినాడలో నూతనంగా ఏర్పాటు చేసిన రోటరాక్టు క్లబ్ ప్రథమ సమావేశం క్లబ్ అధ్యక్షులు శ్రీ ఆర్. అజయ్ అధ్యక్షతన ఇటీవల జరిగింది.

శ్రీ అజయ్ ప్రసంగిస్తూ తమ క్లబ్ సభ్యులు రక్తదానం చేయుటకు నిర్ణయించారని తెలిపారు.

ముఖ్య అతిథి డా॥ పి. యస్. మూర్తి 'అమెరికాలో యువకులు' అనే అంశంపై ప్రసంగించిన పిదప, కార్యదర్శి శ్రీ పి. శ్రీనివాసరావు వందన సమర్పణ చేశారు.

బాలల దినోత్సవం

రోటరీక్లబ్ అధ్యక్షులు డా॥ పి. ఎస్. మూర్తి అధ్యక్షతన రోటరీసర్వీస్ సెంటర్‌లో బాలల దినోత్సవం జరిగింది.

సంగీతం, పాటలు, వీణ, డ్యాన్సు, విచిత్ర వేషధారణ పోటీలలో గెలుపొందిన 11 మంది బాల బాలికలకు బహుమతులు పంచిపెట్టారు.

అంతర్వేది పాలెంలో

అంతర్వేది పాలెంలో జరిగిన ఒకసభలో మంత్రి శ్రీహనుమయ్య ప్రసంగిస్తూ కుటుంబ నియంత్రణ పథకాన్ని ప్రచారం చేయడానికి స్వచ్ఛందసంస్థలు ముందుకురావాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రి శ్రీ సుబ్బారావు ప్రసంగిస్తూ ఈ ప్రాంతంలో హరిజనులు 90 శాతం విద్యావంతులుగా వుండడం కొనియాడారు.

పంచాయతీ సమితి మాజీ అధ్యక్షులు శ్రీ బోళ్ళ సత్యనారాయణ సభకు అధ్యక్షత వహించారు.

మంత్రిశ్రీహనుమయ్య చేకిసెట్టిపాలెంలో అప్పర్ ప్రయిమరీ స్కూలు భవనాలకు, సకినేటిపల్లిలో మరొక పాఠశాలకు, అంతర్వేదిపాలెంలో పాఠశాల బ్లాకుకు శంకుస్థాపన చేశారు.

రు. 12 వేలతో అంతర్వేదిపాలెంలో నిర్మించిన రోడ్డుకు మంత్రి శ్రీ బత్తిన సుబ్బారావు, రు. 21 వేలతో నిర్మించిన పాఠశాల భవనానికి శ్రీ సత్యనారాయణరావు, హాస్టల్‌కు మంత్రి శ్రీ హనుమయ్య ప్రారంభోత్సవం జరిపారు.

అంతర్వేది, రాజోలులలో 154 ఇళ్ళస్థలాలకు పట్టాలు, పాడి పశువుల కొనుగోలుకు రు. 29 వేలు రుణాలు పంచిపెట్టారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో శ్రీభీమరాజు, శ్రీబిక్కినగోపాలకృష్ణ (ఎం.ఎల్.ఎ) తదితరులు ప్రసంగించారు

కాకినాడలో పూల మొక్కల ప్రదర్శన

కాకినాడ మునిసిపల్ వాటర్ వర్క్సు ఆవరణలో 1977 జనవరిలో 10 రోజుల పాటు పూలమొక్కల ప్రదర్శన జరుగుతుంది.

ఏ తేదీలలో జరిగేది తరువాత తెలుపబడుతుంది.

వివరాలు : మునిసిపల్ స్పెషల్ ఆఫీసర్ కాకినాడ నుండి తెలుసుకోవచ్చునని ఒక ప్రకటనలో తెలుపబడింది.

అమలాపురంలో హాస్పటల్ ప్రారంభోత్సవం

డా॥ చిరంజీవిరాజు, డా॥ సత్యవతి, డా॥ కృష్ణంరాజు, డా॥ శకుంతలచే నిర్మింపబడిన శ్రీ సత్యనారాయణ మెమోరియల్ హాస్పటల్‌కు ప్రారంభోత్సవం ఇటీవల శ్రీ ఎస్. బి. పి బి.కె.సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది.

ప్రధాన అతిథిగా దేవాదాయశాఖ మంత్రి శ్రీసాగి సూర్యనారాయణరాజు హాజరయ్యారు

ఈ సందర్భంగా జరిగిన సభలో శ్రీకుడిపూడి ప్రభాకరరావు, శ్రీ పళ్ళ వెంకట్రావు (శాసన సభ్యులు) తదితరులు ప్రసంగించారు

ముంగండ వ్యవసాయ కార్మికుల సమావేశం

తూర్పుగోదావరిజిల్లా కొత్తపేట తాలూకా ముంగండలో వ్యవసాయ కార్మికసంఘ సమావేశం శ్రీ కోటయ్య అధ్యక్షతన ఇటీవల జరిగింది.

సమావేశంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ ఉపాధ్యక్షులు శ్రీ కె. చినవీరాస్వామి శ్రీ ఈదర దేవదానం, జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ముళ్ళపూడి సూర్యనారాయణ ప్రసంగిస్తూ 20 అంశాల ఆర్థిక కార్యక్రమం ప్రాధాన్యతను వివరించారు.

కరకగూడెంలో 3 రోజుల్లో 302 ఆపరేషన్లు

బూర్గంపహాడ్, నవంబరు 20

బూర్గంపహాడ్ తాలూకా కరకగూడెం గ్రామంలో నవంబరు13వ తేదీనుండి16 వ తేదీ వరకు నిర్వహించిన కుటుంబ నియంత్రణ శిబిరంలో 302 ఆపరేషన్లు చేశారు.

వాటిలో ఎక్కువగా గిరిజనుల కేసులు ఉన్నాయి.

బూర్గంపహాడ్ సమితి బి.డి ఓ. తహశీల్‌దారు, పంచాయతీ సర్పంచ్‌ల యువకుల సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ బాబూరావు, డాక్టరు ప్రసాద్‌లు ఆపరేషన్లు చేశారు.

ఇల్లెందులో పశు సంవర్ధకశాఖ దినోత్సవం

ఇల్లెందు, నవంబరు 20

ఆంధ్రప్రదేశ్ ద్విదశ వార్షికోత్సవ సందర్భంగా ఈనెల 18 న ఇల్లెందులో పశుసంవర్ధకశాఖ దినోత్సవం జరిపారు. ముందుగా ఉదయం పాల పోటీలు నిర్వహింపబడినవి. యీ సందర్భంగా తాలూకా సమాచార కేంద్రములో జరిగిన బహిరంగ సభకు సహకార మార్కెటు కమిటీ సంఘాధ్యక్షులు శ్రీ పర్వాలక్ష్మీనరసింహారావు అధ్యక్షత వహించగా, మాజీ మునిసిపల్ చైర్మన్ శ్రీ అబ్దుల్‌వాహిద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీయుతులు కస్తూరి లక్ష్మీనరసింహం, యర్రారాములు, ఆర్. దుర్గాలాల్ గుప్తాలు, పశుగణాభివృద్ధికి ప్రభుత్వం చేయుచున్న కృషిని శ్లాఘించుతూ, ఖమ్మంలోని పాల శీతలీకరణ కేంద్ర పరిధిలోనికి యీ తాలూకానుకూడా చేర్చి, సబ్సిడీమీద, గిరిజనులకు, గిరిజనేతరులకు, పశువులను, పశువాణాను సరఫరా చేయాలని కోరారు. ముందుగా స్థానిక పశువుల డాక్టరు శ్రీ ఎ. కామేశ్వరరావు ఆహూతులకు స్వాగతం పలుకుతూ ప్రభుత్వం పశుగణాభివృద్ధికై యీ తాలూకాలో చేపట్టిన పనులను వివరించారు. తాలూకా పౌర సంబంధశాఖాధికారి శ్రీ వి. రామారావు వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

మితవాదుల కుట్రలపట్ల అప్రమత్తత: శ్రీ సి. హెచ్. రాజేశ్వరరావు హెచ్చరిక

ఆదిలాబాద్, నవంబర్ 17

మితవాదశక్తుల కుట్రలపట్ల అప్రమత్తంగా వుండాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ ప్రధానకార్యదర్శి శ్రీ సిహెచ్ రాజేశ్వరరావు ఒక బహిరంగసభలో ప్రసంగిస్తూ హెచ్చరించారు.

ఇక్కడకు సమీపంలోనిభీమసరి గ్రామంలో యీ నెల 9 వ తేదీన 20 అంశాల కార్యక్రమంపై జరిగిన బహిరంగసభలో ప్రసంగిస్తూ. కమ్యూనిస్టు వ్యతిరేకతతో జాతీయ పునర్ నిర్మాణం, ప్రగతిశీల ఆర్థిక-సామాజిక కార్యక్రమాల అమలు సాధ్యం కావని శ్రీ రాజేశ్వరరావు స్పష్టంచేశారు 20 అంశాల కార్యక్రమం అమలుకు, ఆర్థిక సామాజిక మార్పుల సాధనకు ప్రగతిశీల శక్తులన్నీ సమైక్యంగాకృషి చేయాలన్నారు

స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న కరువు పరిస్థితులను ప్రస్తావిస్తూ దీనిపై ఉన్నతాధికారులతో చర్చించగలనని హామీ నిచ్చారు

భీమసరి నదిపై మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతి లభించేటట్లు శాయశక్తులా కృషి చేస్తానని బహిరంగ సభలో గ్రామప్రజల తరపున సమర్పించిన మెమొరాండాన్ని ప్రస్తావిస్తూ తెలియచేశారు

రైతాంగం ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి మౌలికంగా ప్రభుత్వ వ్యవసాయవిధానంలో మార్పులు రావాలన్నారు.

గ్రామ సర్పంచ్ శ్రీ ఉపాన్న అధ్యక్షత వహించిన యీ బహిరంగసభకు వెయ్యి మందికి పైగా హాజరయ్యారు. బహిరంగసభ అనంతరం తంబిబృందం సాంస్కృతిక ప్రదర్శన లిచ్చింది.

నర్సంపేటలో సహకార వారోత్సవ సభ

నర్సంపేట, నవంబరు 22

వరంగల్ జిల్లా నర్సంపేటలో యీనెల 15 న తేదీన జరిగిన సహకార వారోత్సవ సభలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు వివిధ తరగతుల ప్రజల కిచ్చిన రుణాలను జిల్లా కలెక్టర్ శ్రీ సమర్‌జిత్ రే అంద చేశారు.

సభకు వర్ధన్నపేట నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ పురుషోత్తమరావు అధ్యక్షత వహించారు.

స్టేట్ బ్యాంక్ మేనేజర్ శ్రీ కోటయ్య మాట్లాడుతూ 20 అంశాల కార్యక్రమం క్రింద వివిధ వర్గాల వారికి బ్యాంక్ అందచేసిన సహాయం వివరాలను తెలిపారు.

సేవాదీక్షతో ప్రజలకు పోలీసుల సేవలు

డి ఐ జి రావు సూచన

కడప, నవంబరు 22

ప్రజలకు ఉపయోగకరమైన ప్రాజెక్టులను సేవా దీక్షతో చేపట్టవలసిందిగా కర్నూల్ రేంజ్ డిప్యూటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీ టి యస్ రావు పోలీసులకు విజ్ఞప్తి చేశారు

చైనాచౌక్ గ్రామ పంచాయతీ ప్రాంతంలోని యన్ జి వో ల జయనగర్‌కాలనీ వద్ద కమ్యూనిటీహాలు ప్రారంభోత్సవానికి శ్రీ రావు అధ్యక్షత వహించారు.

పోలీసు కార్యకలాపాలపట్ల ప్రజలలో విశ్వాసం కలిగించే విధంగా పోలీసులకు ప్రజలకుమధ్యగల అఘాతాన్ని తొలగించేటట్లు స్నేహ అవగాహనతో పనిచేయాలన్నారు

ఇక్కడకు మూడుమైళ్ళ దూరంలోగల చైనాచౌక్ గ్రామాన్ని దత్తత తీసుకొని శ్రమదానంతో కమ్యూనిటీ హాలును నిర్మించిన పోలీసులను ఆయన అభినందించారు.

కమ్యూనిటీ హాలుకు టూరిజం శాఖ మంత్రి శ్రీ దేవానందరావు ప్రారంభోత్సవం చేస్తూ హాలును సక్రమంగా ఉపయోగించుకోవాలని సూచించారు

సభ ప్రారంభంలో పోలీసు సూపరింటెండెంటు అతిథులకు స్వాగతం చెబుతూ గ్రామ తగాదాలుగల కొప్పోలు గ్రామాన్ని పోలీసులు దత్తత తీసుకోబోతున్నారని ప్రకటించారు

జిల్లా కలెక్టర్ శ్రీ సంజీవరెడ్డి మాట్లాడుతూ జయనగర యన్. జి. వో కాలనీ మంచినీటి సదుపాయంతో పాటు టెలిఫోన్‌కి టెలిగ్రాఫ్ సౌకర్యాలు కలుగ జేసేందుకు ప్రయత్నిస్తానని హామీ యిచ్చారు.

సభలో యింకా చిన్న చౌక గ్రామపంచాయతి సర్పంచ్ శ్రీ హరినారాయణ, శాసన సభ్యులు శ్రీ జి రంగారెడ్డి, యన్ జి.వో, అధ్యక్షులు శ్రీ సునందరావు, శ్రీ యస్ యస్ లాంబర్ట్, శ్రీ కె రామసుబ్బయ్యలు ప్రసంగించారు డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్ శ్రీ కె కె జె రాజు వందన సమర్పణ చేశారు

పకీరపల్లివద్ద యిటుకల ఫ్యాక్టరీ

మంత్రి శ్రీ దేవానందరావు పకీర్‌పల్లి మెకనైజ్డు ఇటుకల ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారు

కడపలోని పారిశ్రామికశిక్షణ కేంద్రంలో గ్రామీణ వృత్తిదారులకు కార్పెంటరీ, బ్లాక్ స్మిత్, రేడియో టెక్నాలజీ తదితరమైన వీటిలో శిక్షణ కోర్సులను ప్రారంభించారు

కలెక్టరేట్‌లో పారిశ్రామిక ప్రదర్శనకు మహిళల దుస్తుల తయారీ కేంద్రానికి, మొజాయిక్ ఇటుకలపరిశ్రమలకు పరిశ్రమల దినోత్సవాలలో భాగంగా మంత్రి ప్రారంభోత్సవాలు చేశారు.

8,479 ఆపరేషన్లు

కడప నవంబరు 22

కడప జిల్లాలో నవంబరు 10 నుండి 13 వ తేదీ వరకు సగటున రోజుకి 800 కుటుంబనియంత్రణ ఆపరేషన్లు జరిపినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య సర్వీసుల అడిషనల్ ఆఫీసరు తెలియజేశారు.

నవంబరు 13 వ తేదీ వరకు మొత్తం 8 479 ఆపరేషన్లు జరిగాయని అన్నారు.

దీనితో జిల్లాలో 1976 ఏప్రిల్ నుండి నవంబరు 13 వరకు మొత్తం 16085 ఆపరేషన్లు జరిగాయి

నవంబరు 10 నుండి 13 వరకు కడప డివిజన్‌లో 3432 జమ్మలమడుగు డివిజన్‌లో 3433,రాజంపేట డివిజన్‌లో1614 ఆపరేషన్లు జరిగాయి

రాయచోటి తాలూకా1781 ఆపరేషన్లతో ఇతర తాలూకాల కంటే అగ్రస్థానంలో వుంది జమ్మలమడుగు తాలూకా 1601 ఆపరేషన్లతో రెండవస్థానం సాధించింది.

రాయలసీమ రైతు సేవా సహకార సొసైటీకి ప్రారంభోత్సవం

కడప, నవంబరు 20

రాయలసీమ గ్రామీణ బ్యాంక్, కడప ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన రాయలసీమ రైతు సేవా సహకార సొసైటీకి జిల్లాకలెక్టర్ శ్రీ సంజీవరెడ్డి దేవునికడపలో ప్రారంభోత్సవం చేశారు రాష్ట్రంలో యిటువంటి సొసైటీ ఏర్పాటు యిదే ప్రథమం

కడప పట్టణంలో పాలకు డిమాండ్ ఎక్కువగా వున్నందువల్ల మిల్క్ చిల్లింగ్ ప్లాంట్ ఏర్పాటుకు రాయలసీమ గ్రామీణ బ్యాంక్ సహాయం చేయాలని, పాడి పశువులను జిల్లా అధికార యంత్రాంగం సరఫరా చేయగలదని ఆయన రైతులకు హామీ యిచ్చారు

జిల్లా సహకారఅధికారి శ్రీ కె చెన్నయ్య అధ్యక్షత వహిస్తూ రుణాలను సక్రమంగా తిరిగి చెల్లించి సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని సభ్యులకు విజ్ఞప్తి చేశారు

రాయలసీమ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ శ్రీ కృపాసాగర్ స్వాగతం చెప్పారు రైతు సేవా సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ బి వి డి పట్నాయక్ సొసైటీ కార్యకలాపాలు వివరించారు సొసైటీ ఉపాధ్యక్షుడు శ్రీ డి వెంకటసుబ్బారెడ్డి వందన సమర్పణ చేశారు.

తుపానువల్ల డెల్టాలో తీవ్రనష్టం

మచిలీపట్నం, నవంబరు 22

ఇటీవల సంభవించిన తుపానువల్ల దివి, బందరు తాలూకాల్లో దాదాపు 2 లక్షల ఎకరాలలో పంట తీవ్రంగా దెబ్బతినడంతో పాటు 20 వేల ఇళ్లు కూలిపోయిన దృష్ట్యా తక్షణం సహాయ కార్యక్రమాలను ప్రారంభించవలసిందిగా కృష్ణాజిల్లా కమ్యూనిస్టు సమితి సహాయ కార్యదర్శి శ్రీ మోదుమూడి శ్రీహరిరావు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అయన ప్రకటనలో యింకా యిలా తెలిపారు.

ఇటీవలి తుపాను మూలంగా జిల్లాలో భారీ నష్టాలు సంభవించాయి. ఈ నెల 16 నుండి ఎడతెగని భారీ వర్షాలవల్ల బందరు, దివి, గుడివాడ, కైకలూరు తాలూకాలలో వేలాది ఎకరాలలోని పంటకు తీవ్ర నష్టం జరిగింది. ఫలితంగా రైతులు భారీ నష్టాలకు గురయ్యారు.

అలానే వల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వరి పొలాల్లో 3 అడుగుల నీరు నిలిచి వుంది. ప్రస్తుత అంచనాబట్టి బందరు పట్టణంలోను తాలూకాలో 7 వేల ఇళ్ళు నేలమట్టమయ్యాయి. మసూరి, తదితర రకాలు కోతకు సిద్ధంగా వున్న తరుణమిది.

వీటిపై రైతులు అత్యధిక వ్యయంచేసి, చేతికి వచ్చిన పంటను అందుకోవడానికి ఆతృతను వ్యక్తం చేస్తున్న సమయంలో ఈ తుపాను సంభవించింది. ఫలితంగా రైతులు అస్తవ్యస్త పరిస్థితికి గురయ్యారు.

వర్షపునీరు, మురుగునీరు నిలిచిపోవడం వల్ల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదమేర్పడింది అందువల్ల తక్షణం ప్రజారోగ్య చర్యలను ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

అలానే, వ్యవసాయ కార్మికులకు, రిక్షా కార్మికులకు పనులులేక అనేక యిబ్బందులు పడుతున్నారు. దానికి తోడుగా బియ్యం ధర పెరిగిపోయి రు. 1.70 నుండి 2.10 వరకు అమ్ముతోంది.

అందువల్ల అత్యవసర ప్రాతిపదికపై చౌక డిపోలను వెంటనే తెరువవలసిందిగా అయన విజ్ఞప్తి చేశారు.

గన్నవరం తాలూకాలో పంటలకు అపారనష్టం

ఈనెల 4 వ తేదీ తుపాను, తర్వాత 15 వ తేదీ నుండి భారీవర్షాల మూలంగా కృష్ణాజిల్లా గన్నవరం తాలూకాలో వరి, చెరకు మొదలైన మాగాణి పంటలకు మిర్చి, పొగాకు, శనగ, ధనియాలు తదితర మెట్టపైర్లకు అపారనష్టం సంభవించిందని తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ కాట్రగడ్డ పెదవెంకట్రాయుడు ఒక ప్రకటనలో తెలియజేశారు.

4 వ తేదీ తుపానువల్ల కోతకు సిద్ధంగా వున్న వరులు పడి, భూమిని అంటుకొనిపోవడంతో గింజలు రాలి పోవటం, మొక్క రావటం జరిగింది. చెరకు విరిగిపోయి చిందరవందరగా పడిపోయింది. ముదురు తమలపాకు తోటలు పనికిరాకుండా పోయాయి. కాయకూరల పందిళ్ళు పడిపోయాయి.

తర్వాత వాతావరణం అనుకూలంగా వుండి రైతులు కోతలుమొదలు పెట్టినవెంటనే తిరిగి 15 నుండి విపరీతమైన వర్షాలవల్ల వేలాది ఎకరాలలో పనలమీద వున్న వరిపైరుకు తీవ్ర నష్టం జరిగింది. రెండవ పంటగా వేసిన అపరాలు పూర్తిగా పోయాయి. అలాగే మెట్టపైరులు మిర్చి, పొగాకు ధనియాలు పూర్తిగా దెబ్బతిని, తిరిగి వేయాల్సిన పరిస్థితి ఏర్పడి అనుకూల వాతావరణం, వసతి సౌకర్యం లేక మెట్ట ప్రాంతపు రైతాంగం బాధలకుగురయ్యారు.

కనుక నష్టపోయిన రైతాంగానికి శిస్తు రెమిషన్ యివ్వాలని, 5 ఎకరాలలోపు రైతులను లెవీ నుండి మినహాయించాలని, అన్ని రకాల రుణాలను వాయిదా వేయించాలని, మెట్ట ప్రాంత రైతులు రెండు దఫాలుగా నష్టపోయినందున వారికి విత్తనాలు, ఎరువులు సమకూర్చుకొనేందుకు రుణ సౌకర్యం కలిగించి, ఈ సంవత్సరమైనా వాణిజ్య పంటల పన్నును రద్దు చేయాలని, వర్షానికి గురైన అన్ని రకాల ధాన్యాన్ని ఆహార కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆ ప్రకటనలో శ్రీ వెంకట్రాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నర్సాపురం ప్రాంతంలో తిరిగి తీవ్ర నష్టం

ఈనెల 17, 18, 19 తేదీల్లో పడిన భారీ వర్షాలమూలంగా నర్సాపురం పరిసర ప్రాంతాలలో తిరిగి తీవ్ర నష్టాలు జరిగాయి.

పంటపైవున్న ధాన్యం తడిసి రంగు మారింది. కప్పులులేని యిళ్ళు పూర్తిగా పాడైపోయాయి. వీధులలో రోడ్లు, ముఖ్యమైన రహదార్లు దెబ్బతిన్నాయి.

ముఖ్యంగా చేనేతవారి పడుగులు తడిసిపోయాయి. మగ్గం గోతులు నీటితో నిండి పనులు కుంటుపడ్డాయి. ప్రభుత్వం క్షణ సహాయం అందించాలని కోరుతూ అర్జీలు పెట్టారు.

శిస్తు రెమిషన్‌తోపాటు నీటి సప్లయి విషయమై ప్రత్యేకశ్రద్ధ వహించి దాళ్వాపంట అయినా పండించే అవకాశం కల్పించాలని, రుణ సౌకర్యం కల్పించాలని, తడసిన ధాన్యం అమ్మకానికి ఏర్పాట్లు చేయాలని, రవాణా మార్గాలు సత్వరం మరమ్మత్తు చేయించాలని, ఇందుకు అత్యవసర ప్రాతిపదికపై తగిన నిధుల్ని మంజూరు చేసేందుకు ప్రభుత్వం పూనుకోవాలని రైతాంగం, చేతి వృత్తులవారు కోరుతున్నారు.

ఏలూరు తాలూకాలో

కోసిన పనలు కోసినట్లుండగానే ప్రారంభమైన గాలివానవల్ల పనలు నీటిలో మునిగి ఒక్క ఏలూరు తాలూకాలోనే 30 వేలఎకరాల పంట జలమయమైనట్లు అనధికార అంచనా.

ఏలూరు సమీపంలోని చాటపర్రు, జాలిపూడి, మాదేపల్లె తదితర గ్రామాలు స్వయంగా పర్యటించి వచ్చిన మాజీ శాసనసభ్యులు శ్రీ మాలే వెంకటనారాయణ వెంటనే ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టాలని నష్టమైన పంటకు పూర్తిగా రెమిషన్ యివ్వాలని, రుణాల వసూలు వాయిదా వేయాలని ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

భీమవరం తాలూకాలో

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలవల్ల భీమవరం తాలూకాలో పంటలకు విపరీతంగా నష్టం వాటిల్లింది.

పొలాలలో మొలకెత్తిన ధాన్యం ఎవరూ కొనని దుస్థితి ఏర్పడింది. కోతలు జరగని చేలల్లో గింజ రాలిపోయింది. గడ్డి కూడా నీట మునిగి కుళ్ళిపోయింది. కోసిన పనలు పట్టుకోటానికి కూడా వీలులేక మట్టిపాలయ్యాయి.

దూడలపాకలు, ప్రాథమిక పాఠశాలలు, యిళ్ళు కూలిపోయి నష్టం జరిగింది.

కనుక శిస్తు రెమిషన్, లెవీ మినహాయింపు, రుణాల మంజూరు, డ్రైనేజి పెన్ను నిలుపుదల లాంటి తక్షణ చర్యల ద్వారా రైతాంగాన్ని, మధ్య తరగతి ప్రజానీకాన్ని ఆదుకోవటం ప్రభుత్వ బాధ్యత.

కోనసీమలో

గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలవల్ల కోనసీమలో వరిచేలకు వేల రూపాయల విత్తనాలకు నష్టం సంభవించింది.

నీట మునిగిన చేలలో మొలచిన విత్తనాలు కుళ్ళిపోయాయి. ఇంతవరకు సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో నాలుగోవంతు చేలు మాత్రమే హైబ్రీడ్ వరి కోసి మాసూలు చేశారు.

ఇంకా కోనసీమలో మూడు వంతుల పండి కోత కొచ్చిన తరుణంలో తీవ్ర నష్టానికి గురైంది.

నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం లెవీ నుండి మినహాయించి, శిస్తురెమిషన్ యిచ్చి ఆదుకోవాలని అమలాపురం తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ చింతపల్లి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

పెద్దాపురం తాలూకాలో

పెద్దాపురం తాలూకాలో అధిక ఎండల వల్ల కొన్ని వరిచేలు ఎండిపోగా, యిటీవల భారీవర్షాలవల్ల కోసిన వరిపనలు నీట మునిగిపోయి తీవ్రనష్టం సంభవించింది.

కోసిన చేలలో మొక్కలుమొలుస్తున్నాయి. మొత్తంమీద నూటికి 30 వంతుల పంట పాడైపోయింది. ఈ వరి పొలాలకు లెవీ మినహాయించాలని, శిస్తు రెమిషన్ యివ్వాలని రైతులు కోరుతున్నారు.

చీరాల తాలూకాలో

చీరాల తాలూకా ఈపూరిపాలెం మొదలు వేలపాలెం వరకు రొంపేరు క్రింద పొలాలు దరివాడ పొలాలు పూర్తిగా నీట మునిగాయి. ఉప్పులూరువాగు నీరు స్ట్రెయిట్‌కట్ తెరిచినందున వర్షాలవల్ల యీ ముంపు సంభవించి నష్టం వాటిల్లింది.

పొలాల్లో పైరు మొలకలెత్తింది. కోసిన పైరు కొట్టుకుపోవడం మట్టిలో కలసిపోవటంవల్ల విపరీత నష్టం జరిగింది.

ప్రభుత్వం వెంటనే కలుగజేసుకొని దారివాక మురుగుకాల్వకు స్ట్రెయిట్ కట్టకాల్వ వద్ద పోసిన అడ్డకట్ట వెంటనే తీసివేయించాలని, వెదుళ్ళపల్లి, రొంపేరు కాల్వకు నీరు వెళ్ళేమార్గం చేయాలని, ఈ సంవత్సరం పంటలు దెబ్బతిన్న రైతులకు శిస్తు రెమిషన్ యిచ్చి, రుణసౌకర్యం కలిగించాలని తాలూకా రైతుసంఘ నాయకులు శ్రీ కన్నం రెడ్డి లక్ష్మయ్య ఒక ప్రకటనలో జిల్లా కలెక్టరును కోరారు.

ఈపురుపాలెం సర్పంచ్ వినతి

రైతులకు, చేనేత కార్మికులకు తగిన సహాయంచేసి, రక్షణ కల్పించాల్సిందిగా కోరుతూ చీరాల తాలూకాలో ఈపూరుపాలెం సర్పంచ్ శ్రీ అందె రామారావు తహశీల్దారుకు ఒక వినతిపత్రం సమర్పించారు.

భారీ వర్షాలవల్ల ఓదెలు పూర్తిగా నీట మునిగి, కోయకుండా వున్న పైరు పడిపోయి నోటి దగ్గర కొచ్చిన పంటపాడై రైతాంగం దెబ్బతిన్నదని, ఈపూరుపాలెం గ్రామంలోని శీతారాంపేటకు చెందిన 600 చేనేత కుటుంబాలకు చెందిన యిళ్లు నీట మునిగి నానాబాధ పడుతున్నారని అయన పేర్కొన్నారు.

రేపల్లె తాలూకాలో

ఈ నెల 16 వ తేదీనుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలవల్ల రేపల్లె తాలూకా రైతాంగం తీవ్రంగా దెబ్బతిన్నందున వ్యవసాయ పంటకు శిస్తు రెమిషన్ యివ్వాలని, వాణిజ్య పంటల పన్ను రద్దు చేయాలని తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ పులిగడ్డ కోటేశ్వరరావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

ఈ తాలూకాలోని లంకగ్రామాలలో 4 వ తేదీ తుపానువల్ల వాణిజ్యపంటలైన అరటి, చెరకు, పసుపు, మిర్చి విపరీతంగా దెబ్బతిన్నదని, సుమారు 2½ కోట్ల రూపాయల నష్టం వాటిల్లి వుంటుందని, గత పదిరోజులుగా కురుస్తున్న వర్షాలవల్ల కోతకు సిద్ధంగావున్న, అక్కడక్కడ, కోసి పనలపై వున్న మసూరి పంటలు పూర్తిగా నష్టపడ్డాయని అయన తెలిపారు. వ్యవసాయ కార్మికులు పనులు లేక యిబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

5 ఎకరాలలోపు రైతులకు లెవీ మినహాయించాలని, ఆపై రైతులకు కూడా రాయితీ యివ్వాలని, బియ్యం నాణ్యతకు సంబంధించి ఫుడ్ కార్పొరేషన్ నిబంధనలు సడలించేట్లు చూడాలని, పనులు కల్పించి వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని అయన విజ్ఞప్తి చేశారు.

మణిపూర్ ప్రాంతీయ పార్టీ కె. ఎన్. ఎ. త్వరలో కాంగ్రెస్‌లో విలీనం

జవహర్‌నగర్, నవంబరు 22

మణిపూర్ ప్రాంతీయపార్టీకి నేషనల్ అసెంబ్లీ (కె.యన్.ఎ) త్వరలోనే కాంగ్రెస్‌లో విలీనమయ్యే అవకాశముందని ఆ పార్టీ తన విశ్వాసాన్ని వ్యక్తం చేసింది.

కె. యన్. ఎ అధ్యక్షుడు శ్రీ ఖాయ్‌జంగ్ మావోకిప్ యిక్కడ ఒక ప్రకటన విడుదల చేస్తూ దేశాన్ని పటిష్టవంతం చేసేందుకు కాంగ్రెస్ చేస్తున్న కృషి విజయవంతంకావాలని ఆకాంక్షించారు.

20 అంశాల కార్యక్రమం, ఇటీవలి రాజ్యాంగ సవరణలకూ, గిరిజనుల, యితర వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి తీసుకున్న చర్యలకు కె. యన్. ఎ. మద్దతును అయన పునరుద్ఘాటించారు.

పురపాలకసంఘ కార్యాలయము
మండపేట
ఆర్.సి. నెం. 4537/సి3/76
దీ. 20-11-76

రెండవ దఫా టెండరు నోటీసు

మండపేట మునిసిపల్ ప్రజారోగ్య శాఖ సిబ్బంది వగైరాలకు యూని ఫారములు కుట్టుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లు దీ. 14-12-76 తేదీ మంగళవారం సాయంకాలం 4-00 గంటల వరకు కమీషనరుగారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని తీసుకొనబడి అదే రోజున హాజరయిన టెండరుదార్ల సమక్షమున తెరువబడును. సదరు టెండరు ధరావత్తు సొమ్ము మరియు టెండరు షెడ్యూలు ఖరీదు దీ. 13-12-76 వ తేదీ లోగా మునిసిపల్ ఖజానాలో జమ కట్టవలెను. ఇతర వివరములు ఆఫీసు పనిచేయు వేళలలో తెలుసుకొన వచ్చును.

1. టెండరు షెడ్యూలు ఖరీదు : రూ. 2-08
2. టెండరు ధరావత్తు : 50-00

(సం.) కె. లక్ష్మీకాంతం,
కమీషనరు మరియు ప్రత్యేకాధికారి,
మండపేట మునిసిపాలిటీ.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ఆఫీసు ఆఫ్ ది డైరెక్టర్ ఆఫ్ ఆర్కియాలజీ & మ్యూజియమ్స్: ఆం.ప్ర. హైదరాబాద్.
Rc. D2. No. 5273/76
Dt. 11-11-1976.

టెండరు పొడిగింపు నోటీసు

కృష్ణాజిల్లా "కొండపల్లి ఖిల్లా యొక్క కన్సర్వేషన్ పని"కి సంబంధించి ఆఫీసు లెటరు నెం. 12-10-1976 లో జారీచేయబడిన టెండరు నోటీసుకు సంబంధించి. టెండర్లు తీసుకొను వారు ఆఖరి గడువు 25-11-1976 తేదీ మ॥ 12-00 గంటల వరకు పొడిగించబడైనది. అందగా చేరిన టెండర్లు 25-11-1976 తేదీ మ॥ గం. 2-00 లకు తెరువబడును.

టెండరు నోటీసుయొక్క యితర నిబంధనలు మరియు షరతులలో మార్పులేదు.

(సం) ఆర్. నారాయణ,
పర్ డైరెక్టరు.

1896/Advt/76/19-11-76.

ఆంధ్రప్రదేశ్ డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్
(రాష్ట్రప్రభుత్వ సంస్థ)
మిల్క్ పౌడర్ ఫ్యాక్టరీ, విజయవాడ-9

టెండరు నోటిఫికేషన్

No 3000/D1/76 Dt. 19-11-76

చెక్క క్రేట్స్ సప్లయిచేయుట మరియు మొత్తం పాలపొడి డబ్బాలు మిల్క్ పౌడరీ ఫ్యాక్టరీ విజయవాడలో ప్యాక్‌చేయుటకు సీలువేసిన టెండర్లు క్రింది సంతకం దారుచే కోరబడుచున్నవి. చెక్క క్రేట్స్ సప్లయి చేయవలసినవి సుమారుగా 20 000.

చెక్క క్రేట్స్ నమూనాలు, టెండరు షెడ్యూల్సు జనరల్ మేనేజరు మిల్క్ పౌడరీ ఫ్యాక్టరీ, విజయవాడవారి కార్యాలయములో ఒక్కొక్క దానికి రు. 10-40 చెల్లించి 9-12-76 వరకు ఆఫీసు పనివేళలలో పొందవచ్చును.

టెండర్లు 10-12-76 సాయంత్రం 3.00 గంటలవరకు స్వీకరించబడును. అదేరోజు సాయంత్రం 4 గంటలకు తెరువబడును.

టెండర్లు అంగీకరించుటకు లేదా నిరాకరించుటకు ఈ క్రింది సంతకందారునికి అధికారం కలదు.

జనరల్ మేనేజరు

'అభివృద్ధి కృషిలో మహిళల పాత్ర'పై హైద్రాబాద్‌లో జరిగిన గోష్టిలో ప్రసంగిస్తున్న కార్మిక మంత్రి శ్రీ అంజయ్య.

ప్రజాతంత్ర భావాలుగల యువతీ, యువకుల ఐక్యకార్యాచరణకై పిలుపు

ఫిబ్రవరిలో శాసనసభ ఎదుట ప్రదర్శన ; నవంబరు, డిసెంబరులలో ప్రచారోద్యమం ; యువజన సమాఖ్య కార్యక్రమం

హైదరాబాద్, నవంబరు 23

సామ్రాజ్యవాద అస్థిరత విధానాలకు అభివృద్ధి నిరోధకుల కుట్రలకు వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్య పరిరక్షణకు ప్రజాతంత్ర భావాలుగల యువతీ యువకులంతా ఐక్యం కావాలని రాష్ట్ర యువజన సమాఖ్య పిలుపు నిచ్చింది.

ప్రజాస్వామ్య పరిరక్షణకు, సోషలిజం సాధనకు, ఇరవై అంశాల ఆర్థిక కార్యక్రమం అమలుకై వేలాది యువకులతో ఫిబ్రవరిలో శాసనసభముందు రాష్ట్ర వ్యాపిత ప్రదర్శన జరపాలని సమావేశం నిర్ణయించింది.

అభివృద్ధి నిరోధకుల దుష్ట పన్నాగాలను ప్రజలకు తెలియజెప్పేందుకు నవంబర్, డిసెంబర్ మాసాలలో తీవ్రంగా రాజకీయ ప్రచార ఉద్యమాన్ని నిర్వహించాలని పిలుపు నిచ్చింది.

అఖిలభారత యువజన సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రసమితి రెండురోజుల సమావేశం, నవంబర్ 13,14 తేదీలలో ఖమ్మం జిల్లా తనికెళ్ళ గ్రామంలో జరిగింది. రాష్ట్ర యువజన సమాఖ్య అధ్యక్షులు శ్రీ బి స్టాలిన్ బాబు అధ్యక్షత వహించారు.

రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ తమ్మారెడ్డి సత్యనారాయణ ప్రసంగిస్తూ 20 అంశాల ఆర్థిక కార్యక్రమాన్ని పక్కదారి పట్టించడానికి జరుగుతున్న ప్రయత్నాలను వమ్ము చేసేందుకు, ప్రజాస్వామ్యాన్ని మంటగలపడానికి ప్రతీఘాతక విప్లవశక్తులు నూతన ఎత్తుగడలతో జరుగుతున్న పన్నాగాలను తిప్పికొట్టేందుకు యువతరం ముందుకు రావాలన్నారు.

అఖిలభారత యువజన సమాఖ్య అధ్యక్షులు సి. కె. చంద్రప్పన్ మాట్లాడుతూ "దారిద్ర్యాన్ని నిర్మూలించాలంటే సోషలిజమే ఏకైకమార్గం. అందుకే రాజ్యాంగ ఉపక్రమణికలో చేర్చిన సోషలిజం లక్ష్యసాధనకై యువతరం నడుంకట్టాలి. సిద్ధాంత రాహిత్యవాదనను తిప్పికొట్టాలి" అన్నారు.

రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ సి హెచ్. రాజేశ్వరరావు, ఎ.ఐ.టి.యు.సి. కార్యదర్శి శ్రీనివాస్, విద్యార్థి ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీనివాసులు నాయుడు యువజన సమాఖ్యతో సమన్వయంపై సంయుక్త కార్యాచరణపై మాట్లాడారు.

శ్రీ బి. స్టాలిన్‌బాబు ప్రతిపాదించిన నివేదికపై రెండు రోజుల సుదీర్ఘ మయినచర్చల తర్వాత సమావేశం భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించింది.

44వ రాజ్యాంగ సవరణను బలపరుస్తూ "దేశ స్వాతంత్ర్య పరిరక్షణ కోసం జనవరి 26 న రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాపితంగా వుత్సవాలు, సభలు, సమావేశాలద్వారా యువతరంలో దేశభక్తిపై యింకా దృఢమయిన విశ్వాసాన్ని పెంపొందించాలని పిలుపు నిచ్చింది.

రాష్ట్ర యువజన సమాఖ్యలోకి 4 లక్షల మందిని సభ్యులుగా చేర్పించి, తద్వారా ఈనాడున్న సంక్లిష్ట సమయంలో వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించింది.

ఇరవై అంశాల ఆర్థిక కార్యక్రమాన్ని ఆచరణలో అమలు జరపడానికి అన్ని స్థాయిల్లోనూ చొరవ తీసుకొని పనిచేసేందుకు నిర్దిష్టమయిన కార్యక్రమాలను ఆయా స్థాయిలలో చేపట్టాలని పిలుపు నిచ్చింది.

యువజన సమాఖ్య కార్యకలాపాలకోసం ఉద్యమ నిధి రాష్ట్ర యువజన సమాఖ్య, విద్యార్థి ఫెడరేషన్‌ల సమర శంఖారావం "యువజన" పోరాట నిధికోసం లక్ష రూపాయల్ని వసూలు చేయాలని సమావేశం పిలుపునిచ్చింది.

యువ కార్మిక, యువ మహిళ, యువ కర్షక సదస్సుల్ని నిర్వహించాలని, బాల సంఘాలను విస్తృతంగా ఏర్పర్చాలని, నిరక్షరాస్యతా నిర్మూలనకు ప్రస్తుతం నడుస్తున్న 125 రాత్రి పాఠశాలలు కాక అదనంగా మరో 500 పాఠశాలలను నడపాలని నిర్ణయించింది.

యువజన సమాఖ్య బహుముఖ కార్యకలాపాల్లో భాగంగా క్రీడా, సాంస్కృతిక, కార్యక్రమాలను నడపాలని నిర్ణయించింది.

కుటుంబనియంత్రణను బలపరుస్తూనే దీని అమలులో కొనసాగిస్తున్న నిర్బంధ విధానాన్ని, అనుచిత చర్యల్ని ఖండిస్తూ సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

చిలికి సంఘీభావాన్ని ప్రకటిస్తూ, లూయి కార్వాలాన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

డిగో గార్షియాను శాంతిమండలంగా వుంచాలని డిమాండ్‌చేస్తూ మద్రాసులో జరిగిన అంతర్జాతీయ యువజన మహాసభ నిర్ణయాలపట్ల హర్షం ప్రకటిస్తూ, ఆ నిర్ణయాల అమలుకు పూనుకోవల్సిందిగా మరొక తీర్మానంలో యువతరానికి విజ్ఞప్తి చేసింది.

18 సంవత్సరాలకే ఓటింగు హక్కు యివ్వాలని, అతివృష్టి - అనావృష్టి ప్రాంతాల్లో శిస్తు రెమిషన్ సౌకర్యాన్ని కల్పించాలని సమావేశం కోరింది.

తొలుత సమావేశం గ్రెచ్ కోవ్, మావో, భూటే, చంద్రశేఖర్‌సింగ్, ఉషా బాయి డాంగే, బాదు నారాయణరావుల మృతిపట్ల సంతాపాన్ని తెలియజేసింది.

ప్రస్తుతం కౌన్సిల్‌లోవున్న ఖాళీలను సమావేశం భర్తీ చేసింది. ఆ తరువాత ఉపాధ్యక్ష, కార్యదర్శుల స్థానంలోవున్న రామకృష్ణారెడ్డి, టి. వి. చౌదరిలను కార్యదర్శి, ఉపాధ్యక్షులుగా ఎన్నుకొంది.

రెండవ పంట సాగుకు హామీ, మొదటిపంట లెవీకి రాయితీ యివ్వాలి

ఉభయ గోదావరి జిల్లాల్లోను, యీస్టరన్ డెల్టా మినహా సెంట్రల్, వెస్టరన్ డెల్టా భూములకు పర్మినెంట్, రొటేషన్ జోన్‌లలో వున్న భూములకు యథాప్రకారం రెండవ పంట (రబీ) సాగుకు రైతాంగం సిద్ధంకావచ్చని. ఎలాంటి అభ్యంతరం లేకుండా వారికి నీటి సరఫరా జనవరి 1నుండి లేదా డిసెంబరు చివరి వారం నుండిగాని జరుగుతుందని అధికారులు ప్రకటిస్తున్నారు. అదనపు సాగు ప్రాంతం గురించికూడా త్వరలో నిర్దిష్టమైన ప్రకటన చేయగలమని చెపుతున్నారు.

కనుక సెంట్రల్, వెస్టరన్ డెల్టాలలో గణనీయమైన నష్టానికి రైతాంగం గురైనందున రెండవ పంటసాగుకి పెట్టుబడులకు నష్టం రాకుండా నీటి సప్లయి, ఎరువులు, క్రిమి సంహారక మందులు సక్రమంగా అందిస్తూ మొదటి పంటకాలంలో పంట అంచనాల సక్రమంగా సేకరించి పన్నుల రెమిషన్, రుణాల వాయిదా, లెవీ మినహాయింపులు ప్రకటించాలని, యీస్టరన్ డెల్టాలోను, సెంట్రల్ డెల్టాలోను 5 ఎకరాలలోపు రైతుల నుండి ఏవిధమైనవి సేకరించకుండా మినహాయించాలని, యీస్టరన్ డెల్టాలో లెవీ మొత్తం పెద్ద రైతులనుండి సేకరించటం గురించి ఆలోచించాలని, ఈ కనీస రాయితీలు రైతాంగానికి కలిగించాలని, మెట్ట పంటలకు, పైరు పంటలకు కూడా నీరు సప్లయి చేయాలని తూర్పుగోదావరిజిల్లా రైతు సంఘ కార్యదర్శి శ్రీ రెడ్డి కొండలరావు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

భారత్‌తో వాణిజ్యం రెట్టింపుకు రుమేనియా ఆసక్తి: శ్రీ బి. ఆర్. భగత్ వెల్లడి

న్యూఢిల్లీ, నవంబరు 22

భారత్‌తో వాణిజాన్ని రెట్టింపు చేసుకోవాలని రుమేనియా ప్రభుత్వం వాంఛిస్తున్నది. ఏటాదికి ప్రస్తుతం జరుగుతున్న 100 కోట్ల డాలర్ల నుండి 1980 నాటికి 200 కోట్ల డాలర్లకు పెంపుచేయాలని కోరుతోంది.

లోక్‌సభ స్పీకర్ శ్రీ బి. ఆర్. భగత్ బుఖారెస్టులో రుమేనియా అధ్యక్షుడు నికొలాయ్‌సెసెస్క్యూ, యితర నాయకులతో సుదీర్ఘ చర్చలు జరిపిన సందర్భంగా పై విషయం వెల్లడైంది.

7 గురు సభ్యులుగల భారత పార్లమెంటరీ ప్రతినిధివర్గానికి శ్రీ భగత్ నాయకత్వం వహించారు.

రుమేనియా నుండి తిరిగి వచ్చిన శ్రీ భగత్ నేడు విమానాశ్రయంలో సమాచార్‌తో మాట్లాడుతూ, భారత్‌తో మంచి మైత్రీ సంబంధాలకు రుమేనియా అత్యంత ప్రాధాన్యత యిస్తోందని, ఉభయ దేశాల మధ్య పలు రంగాల్లో సహకారం విస్తృతం కాగలదన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు.

ప్రాణసంకటంగా పరిణమించిన పాలెపురుగు

యుగోస్లావియాలో

ట్రెడింజె, (యుగోస్లావియా) నవంబరు 22

హెర్సిగోవినా ప్రాంతంలోని కొన్ని పొలాల్లో విషపూరితమైన నల్ల పాలెపురుగు ప్రవేశించడంతో పైర్లకు నష్టంకలిగించే పీడగానే గాకుండా గ్రామీణులకు ముప్పుగా తయారయింది

రైతులు పొలాల్లో ప్రవేశించే ముందుగా దళసరి వస్త్రాలను ధరించి వాటికోసం వెదకి నిర్మూలించడానికి యత్నిస్తున్నారు.

అవి లక్షలాదిగా వున్నాయి. గొర్రెలకు అవి ఎటువంటి హానిచేయనందున వాటిని నిర్మూలించడానికి గొర్రెలను వినియోగిస్తున్నట్లు ఒక రైతు తెలిపారు.

ఈ పాలె పురుగువల్ల హాని జరుగుతున్న కేసులు అధికం కావడంతో దుబ్రోవ్నిక్ సమీపంలో గల ఈ నగరంలోని ఆస్పత్రి రోగులకు చికిత్స చేసే నిమిత్తం తగినంత సీరమ్ సరఫరాను సమకూర్చుకుంది. ఆ పురుగువల్ల, వారు స్పృహతప్పిపోవడం కూడా జరుగుతుంది.

గాజులదిన్నె కాలువపై నిర్మించిన వంతెనకు ప్రారంభోత్సవం

కర్నూల్, నవంబర్ 22

కర్నూల్ - బళ్ళారి రోడ్డులో గాజులదిన్నె కాలువపై లక్ష రూపాయల వ్యయంతో నిర్మించిన వంతెనను తుంగభద్ర హైలెవెల్ కెనాల్ (అనంతపూర్) సూపరింటెండెంట్ ఇంజనీరు శ్రీ కె. శ్రీరామకృష్ణయ్య గత శుక్రవారం నాడు ప్రారంభోత్సవం చేశారు.

కర్నూల్‌జిల్లాలోని గాజులదిన్నె ప్రాజెక్టు కాలువ పనులు 1977 జూన్ నాటికి పూర్తి చేస్తామని అయన అన్నారు. ప్రాజెక్టును సత్వరం పూర్తి చేయుటానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రు. 60 లక్షలు మంజూరు చేసిందని అన్నారు.

38 కిలోమీటర్ల పొడవుగల తూర్పు కాలువ, 26 కిలోమీటర్ల పొడవుగల పడమర కాలువ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి

మెట్ట పంటలను పండించే నిమిత్తం ఖరీఫ్‌పంట కాలంలో 32 వేల ఎకరాలకు, రబీపంట కాలంలో 32 వేల హెక్టార్లకు కాలువల నుండి నీరు లభించగలదని అన్నారు.

కావలి తాలూకాలో రెవిన్యూ బోర్డు సభ్యుని పర్యటన

కావలి, నవంబరు 23

కావలితాలూకాలోని జలదంకి, చినక్రాక, పెదపాడు, నాగసముద్రం, కనిగిరి, కావలి పట్టణాలలో తుపానుకు గురయిన ప్రాంతాలను రెవిన్యూబోర్డు సభ్యుడు శ్రీ కె. సుబ్రహ్మణ్యం నేడు సందర్శించారు.

ఈ సందర్భంగా పెదపాడులో పొగాకు బ్యారన్‌లు కూలిపోయి భారీ నష్టాలకు గురైన కొంతమందిని అయన కలుసుకొని వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు.

అయన చినక్రాక పోలీసు స్టేషన్‌ను, పెదపాడులోని పొగాకు బ్యారన్‌లు, కావలి పట్టణంలో బాగా దెబ్బతిన్న కొన్ని సంస్థలను సందర్శించారు.

జిల్లా కలెక్టరు శ్రీ సి. అర్జునరావు పోలీసు సూపరింటెండెంటు శ్రీ యస్. సి. ద్వివేది, అసిస్టెంట్ కలెక్టరు శ్రీ యస్. వి. ప్రసాద్. టి. కోటేశ్వరరావు, యం. వి. రామమోహనరావు, డి. రాధాకృష్ణమూర్తి, తదితరులు అయన వెంట వున్నారు.

కావలి పట్టణంతో సహా కావలి తాలూకాలోని అన్ని గ్రామాలలో తుపాను బాధితులకు సహాయ కార్యక్రమాలు కొనసాగించడానికి కొన్ని అధికార బృందాలు నిర్విరామంగా కృషి చేస్తున్నాయి. సహాయ కార్యక్రమాల నిమిత్తం జిల్లా కలెక్టర్ రు 8 లక్షలు విడుదల చేశారు.

శ్రీ వెంకటేశ్వరస్వామివారి పాదపద్మ సన్నిధిలో
ఇప్పుడు విరారు
ప్రశాంతం పొందండి!
హోటల్
ఊర్వశి

తిరుపతిలో, నిశ్చింతగా విశ్రమించడానికి వీలైన పెక్కు సౌకర్యాలతో, సరికొత్త స్టార్ హోటల్

- మేనక ఏ సి వెజిటేరియన్ రెస్టారెంట్
- ఏ సి డబుల్ రూములు
- ఏ సి సూట్స్
- సింగిల్ డబుల్ గదులు (ఏ సి లేకుండా)
- శ్రావ్యమైన సంగీతం
- లిఫ్ట్ సర్వీసు
- భోజనశాలలో టెలివిషన్
- పార్టీలివ్వడానికి రూఫ్‌గార్డెన్
- సభలు, సమావేశాలకు విశాలమైన హాలు
- కొండమీదికి కారు ప్రయాణ సదుపాయాలు
- వివిధమైన షాపుల వరుస,

హోటల్ ఊర్వశి
(ప్రొప్రయిటర్లు:
గౌతమ్ హోటల్స్ ప్రయివేట్ లిమిటెడ్)
రేణిగుంట రోడ్ తిరుపతి (ఏ.పి.)
ఫోన్: 2827
ACIL H02 T

ఇదిగో
బాధా నివారిణి అదనపు శక్తిగలది
ఎక్కువ చురుకయినది
చాల సురక్షితమయినది
ప్లస్‌ప్రిన్
PLUSPRIN
చాల చురుగ్గా పనిచేస్తుంది!
తలనొప్పి, వీపునొప్పి, శరీరపునొప్పులు, పంటినొప్పి, కండరాలనొప్పి, జలుబు, జ్వరము నుంచి నివారణకు ఒక బిళ్ళచాలు సురక్షితంగా మంచి నివారణ
పైగా
ప్లస్‌ప్రిన్ సురక్షితము,
దీనివలన మత్తుగా ఉండదు, వెగటు పుట్టదు, రక్తస్రావం కాదు, అజీర్ణం కాదు, యాసిడిటీ రాదు, అలవాటుగా మారదు
ఎంతయినా
ప్లస్‌ప్రిన్ అనేది ఆస్పిరిన్ కాదుగా
PLUSPRIN త్వర నివారిణకు 'ప్లస్' శక్తిగలది
JAISONS

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
మేజర్ ప్రాజెక్టుల డిపార్టుమెంటు
శ్రీశైలం ప్రాజెక్టు సివిల్ సర్కిల్

టెండరు నోటీసు నెం. 9 SE/76-77

1. ఈ దిగువ నుదహరించిన పనులకుగాను, సీలువేసిన టెండర్లు ఫారములో శ్రీశైలం ప్రాజెక్టు, సివిల్ సర్కిల్, సూపరింటెండింగ్ ఇంజనీరు వారిచే శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలో వారి కార్యాలయము నందు 31-12-1976 సాయంత్రం 4 గంటల వరకు తీసుకొనబడును. అదేరోజు సదరు టెండర్లు సాయంత్రము 4 గంటల 10 నిమిషములకు సూపరింటెండింగ్ ఇంజనీరు వారిచే వారి కార్యాలయమునందు తెరువబడును.

వరుస నెం.	పని పేరు	కాంట్రాక్టు ఫారము	బయానా ధరావత్తు	టెండరు ఫారముల ఖరీదు	కాంట్రాక్టుకు కాలపరిమితి
1.	శ్రీశైలం డాం, 14 మరియు 15 బ్లాకులకు దిగువ భాగమున అదనపు షాఫ్టు మరియు డ్రిఫ్టు త్రవ్వకము మరియు కాంక్రీటుతో నింపుట.	ఎల్.ఎస్.	రు. 8820	రు 52.75	6మాసములు

2. టెండరు ఫారముల ఖరీదు ఒక పర్యాయము చెల్లించిన పిదప, ఎట్టి పరిస్థితులలోను వాపసు చేయబడదు.

3. టెండరు ఫారముల కొరకు దరఖాస్తులు, సూపరింటెండింగ్ ఇంజనీరు, శ్రీశైలం ప్రాజెక్టు, సివిల్ సర్కిల్ వారి పేర శ్రీశైలం డాం, తూర్పు పోస్టు కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్ చిరునామాకు పంపుకొనవలయును. టెండరు ఫారముల ఖరీదు శ్రీశైలం ప్రాజెక్టులో స్టేటు బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచిమీద "పే అండ్ ఎకౌంట్సు ఆఫీసర్" శ్రీశైలం ప్రాజెక్టు వారి ఖాతాకు డ్రాఫ్టు చెల్లించి, సదరు డ్రాఫ్టును దరఖాస్తుతో పంపుకొనవలయును.

4. టెండరు ఫారములకు దరఖాస్తులు దీ. 22.12.1976 తేదీ లోగా పంపుకొనవలయును.

5. టెండరు ఫారములు ఆఫీసు పనిచేయు కాలములో దీ. 23.12.1976 నుండి 27.12.1976 వరకు దొరుకును. కోరిన యెడల పోస్టులో పంపించబడును. పోస్టులో పంపగోరువారు "అయిదు రూపాయల" తపాలా బిళ్ళలు పోస్టు ఖర్చుల నిమిత్తం పంపవలయును.

6. పైన ఉదహరించిన పనికిగాను 1వ తరగతి, 2వ తరగతి మరియు 3వ తరగతి కంట్రాక్టర్లుగా రిజిష్టరు అయినవారు, రిజిస్ట్రేషను ఆర్డరు జతపరచి దరఖాస్తులు పెట్టుకొనవలెను.

షరా. శ్రీశైలం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరు వారి వద్ద 60,000 రూపాయలు నిలకడ ధరావత్తు కలిగి యుండి, సదరు డాండు పూర్తి చేసిన కంట్రాక్టర్లు పై ధరావత్తు క్రింద 5,880 రూపాయలు చెల్లించుటకు అనుమతి యివ్వబడమైనది.

సూపరింటెండింగ్ ఇంజనీరు
సివిల్ సర్కిల్, శ్రీశైలం ప్రాజెక్టు.
శ్రీశైలం డాం తూర్పు పోస్టు,
దీ. 19.11.1976.

జాతీయ వేతనం, ధరల విధాన రూపకల్పనకు సత్వర చర్యలు

ఎ. ఐ. సి. సి. ఆర్థిక తీర్మానంలో ప్రభుత్వానికి సిఫారసు చేస్తూ ప్రతిపాదించిన సవరణ ఆమోదం

జవహర్ నగర్, నవంబరు 22

జాతీయ వేతనం, ధరల విధానరూపకల్పనకై సత్వర చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫారసుచేసే సవరణతోసహా మరి కొన్ని సవరణలతో నేడు ఎ. ఐ. సి. సి. ఆర్థిక తీర్మానాన్ని ఆమోదించింది.

ఆర్థిక రంగంలో యింతవరకు సాధించిన స్థిరత్వం సమ్మె కాకుండా అప్రమత్తంగా వుండాలని తీర్మానంలో వుంది.

గత సంవత్సరం చండీఘర్ సమావేశంలో అనుకూలంగా వున్నదని చెప్పబడిన ఆర్థిక పరిస్థితి 1976 లో యింకా పుంజుకున్నదని తీర్మానంలో సంతృప్తి వ్యక్తం చేయబడింది.

తీర్మానాన్ని మేఘాలయ ముఖ్యమంత్రి కెప్టెన్ విలియం సంగ్మ ప్రవేశపెట్టారు. వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ జగ్జీవన్ రామ్ చర్చను ముగించారు.

జాతీయ వేతన విధాన మంటే దేశంలోని అందరి వేతనాలు తప్పనిసరిగా పెరగాలనే అర్థం కాదని శ్రీ జగ్జీవన్ రామ్ అన్నారు.

గత కొద్ది నెలలుగా ప్రభుత్వం తీసుకున్న ఆర్థిక చర్యలను ఎ. ఐ. సి. సి. ఆమోదించింది. ప్రస్తుత అభివృద్ధి పూపును కొనసాగించేందుకు కొన్ని ప్రాధాన్యతలను తీర్మానం సూచించింది.

గ్రామీణ జీవితాభివృద్ధిలో చెట్లు నాటే ఉద్యమం ప్రాధాన్యతను గుర్తిస్తూ ఈ ఉద్యమానికి రాష్ట్రప్రభుత్వాలు అన్ని రకాల ప్రోత్సాహ మివ్వాలని ప్రవేశ పెట్టబడిన మరో సవరణను సమావేశం ఆమోదించింది

భూమి రికార్డులు పాటించవద్దు

భూమి రికార్డులతారుమారు ఆరోపణలను శ్రీ జగ్జీవన్ రామ్ ప్రస్తావిస్తూ ప్రతి గ్రామంలో మిగులు భూమి ఏ మేరకు లభ్యమౌతుందని అంచనా వేసేందుకు "పట్వారీ" వద్ద గల రికార్డులపై ఆధారపడనవసరం లేదన్నారు.

ఎవరికి ఎంత భూమి వుందనే విషయం గ్రామస్థులకు తెలుసు. భూమి యాజమాన్యానికి సంబంధించిన విషయాలను వారి ద్వారా తెలుసుకొని, సరిగ్గా అంచనా వేయటం ఏమంత కష్టం కాదు అని ఆయన అన్నారు.

పెట్టుబడిదారీ ఆర్థిక విధానంలో వాస్తవంగా సంపదను సృష్టించేవారు అనగా ఫ్యాక్టరీ కార్మికులు, వ్యవసాయ కార్మికులు నిరుపేదలుగా వుంటారు. వారి పట్ల ఆ ప్రభుత్వం కొద్దిపాటి లేదా ఏ మాత్రం శ్రద్ధ కనపరచదు. భారత సోషలిస్టు ఆర్థిక వ్యవస్థలో వారిపట్ల ప్రభుత్వం ఎంతో శ్రద్ధ కనబరుస్తున్నదనే విషయాన్ని ఆయన నొక్కిచెప్పారు.

జాతి సంపదను వాస్తవంగా సృష్టించే వారికి న్యాయం కలుగజేసేందుకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి వుందనీ, తమ తమ రాష్ట్రాలలో వ్యవసాయ కార్మికులకు రూపొందించిన కనీస వేతనాలు లభ్యమగునట్లు చూడాలని ప్రతినిధులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

పొడవైన మనిషి

జవహర్ నగర్, నవంబరు 22

ఇక్కడ జరుగుతున్న ఎ. ఐ. సి. సి. సమావేశానికి సమీపంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ కు 7 అడుగుల 1 అంగుళంగల పొడవైన వ్యక్తి కరింసింగ్ బ్రార్ ను పంజాబ్ నుండి తీసుకు వచ్చారు.

పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం మార్కెటింగ్ ఫెడరేషన్ అమ్మకపు కౌంటరువద్ద వున్న ఆయనను చూసేటానికి జనం తండోపతండాలుగా వచ్చి అక్కడి వస్తువులను విపరీతంగా కొంటున్నారు.

సామాన్య ప్రజల్లో పనిచెయ్యండి

కాంగ్రెసు కార్యకర్తలకు శ్రీ బారువా విజ్ఞప్తి

జవహర్ నగర్, నవంబరు 22

ఎ. ఐ. సి. సి. మహాసభల నుండి తిరిగి వెళ్ళి, సామాన్య ప్రజలలో, ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలలో పని చెయ్యవలసిందిగా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ డి. కె. బారువా నేడు కాంగ్రెసు కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.

ఎ. ఐ. సి. సి సమావేశాల ముగింపు సందర్భంగా మాట్లాడుతూ, ఇక్కడకువచ్చి విప్లవాత్మకమయిన ప్రసంగాలు చేసినంత మాత్రాన చాలదు అని అన్నారు.

వచ్చే ఎ. ఐ. సి. సి. సమావేశానికి ఆరు రాష్ట్రాల ఆహ్వానాలు

జవహర్ నగర్, నవంబరు 22

వచ్చే ఎ. ఐ. సి. సి. సమావేశాలను తమ తమ రాష్ట్రాలలో నిర్వహిస్తామని యిక్కడ కాంగ్రెసు కమిటీకి ఆరు రాష్ట్రాల నుండి ఆహ్వానాలు వచ్చాయి. అవి: కర్నాటక, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, హిమాచల్ ప్రదేశ్ లు.

ఈ ఆహ్వానాలు కాంగ్రెసు కార్యవర్గం పరిశీలన అనంతరం వచ్చే సమావేశ తేదీ, స్థలం తెలియచెయ్యటం జరుగుతుందని ఎ. ఐ. సి. సి. ప్రధాన కార్యదర్శి శ్రీమతి పూరబీ ముఖర్జీ నేడిక్కడ ప్రకటించారు.

తప్పుడు తూకాలు, కొలతలు వేసిన వారికి జరిమానా

హైదరాబాద్, నవంబర్ 22

తూకాలు కొలతల శాఖవారు అక్టోబర్ లో రాష్ట్రమంతా దాడులు జరిపి 854 మందిపై కేసులు పెట్టారు. కాంపౌండింగ్ ఫీజుగా రు. 63,55 , కోర్టుజరిమానాగా రు. 8,776 వారికి విధించారు.

హైదరాబాద్ కు చెందిన అమీర్ ఆలీ, హుస్సేన్ ఆలమ్ లకు రు. 450 జరిమానా విధించారు.

నిరాయుధీకరణ కృషిలో సోవియట్ కు తోడ్పాటు: ప్రధాని వెల్లడి

జవహర్ నగర్, నవంబర్ 22

"అణ్వాయుధ పరిమితి సాధారణ నిరాయుధీకరణకు భారత్ ఖచ్చితమైన తోడ్పాటు" నిస్తుందనీ, ఈలక్ష్యాల సాధనకు సోవియట్ తదితర దేశాలతో సహకరిస్తుందని ప్రధాని శ్రీమతి గాంధీ నేడిక్కడ చెప్పారు.

భారత విదేశాంగ విధానం "చాలా చిన్న సూత్రం"పై ఆధారపడి వుంది.

"స్నేహం ఉన్నచోట దాన్ని పటిష్టం చేయడం, స్నేహం లేనిచోట దాన్ని సృష్టించటం, శతృత్వం ఉన్నచోట దాన్ని తగ్గించడానికి ప్రయత్నించడం" అని ప్రధాని చెప్పారు.

భారత్ ను వత్తిడిచేసే విదేశీశక్తులకు ప్రతికూల ఫలితాలు తప్పవని ప్రధాని హెచ్చరించారు.

పెద్దవారైనా, చిన్నవారైనా, సంస్థలు గానీ ప్రభుత్వాన్నుండి లేదా ప్రతిపక్ష పార్టీలనుండిగానీ ఈ దేశం వ్యవహారాలలో బయట జోక్యంవస్తే సహించబోమని స్పష్టం చేశారు. నేటి ఎ. ఐ. సి. సి. లో ఆమె ఉద్రేక పూరితమైన ప్రసంగంచేశారు.

ప్రతిపక్షాల ధోరణి

ప్రతిపక్షాల వైఖరిలో మార్పు వచ్చిన సూచన ఇంతవరకూ ఏమీ లేదని శ్రీమతి గాంధీ అన్నారు.

కాంగ్రెస్, వారికి అనేకసార్లు స్నేహహస్తం చాచింది. వైఖరి మార్చుకున్నారా లేదా? అన్న విషయం వారు చెప్పాల్సిందే. కానీ ప్రభుత్వం ఏది చేసినా సరే విమర్శించడాన్ని వారు కొనసాగిస్తున్నారని ఎ. ఐ. సి. సి. లో ఆమె చెప్పారు.

ప్రతిపక్షాలతో సంప్రదింపులు సాగించాలనే సూచనలు వస్తున్నాయి. కానీ వారి ధోరణి ఏమిటి? దేశం కష్టసుఖాలన్ని చూసినతర్వాత మౌలిక అంశాలయిన ప్రజాస్వామ్యం, సోషలిజం, సెక్యులరిజంలను పటిష్టం చేసేందుకు కాంగ్రెసుతో కాకపోయినా ప్రజలతో, దేశంతోనయినా వారు సహకరిస్తారని భావించాను. ఈ మౌలిక విషయాల విధ్వంసం కొనసాగించాలో లేక వీటికి సహకరించాలో నిర్ణయించుకోవలసిందివారే. తమ ధోరణి మారిందని వారు రుజువుచేసుకుంటే "కొత్త మార్గం కనుగొనవచ్చు" అన్నారు. కాని యింతవరకు అలాంటి సూచనలేదు అని చెప్పారు.

విదేశాల్లో ప్రచారంవల్ల ప్రభుత్వంఅనేక పనులను వాయిదా వేసుకుందన్నారు. విదేశాల ప్రచారమే లేకపోతే ప్రస్తుతంవ్యక్తుల విడుదలవంటి పనులు చాల కాలం క్రితమే జరిగివుండే వన్నారు.

తమ ఆదేశాలు పాటించే ప్రభుత్వం ఉండాలని కొన్ని విదేశీ శక్తులు కోరుకుంటున్నాయి. కానీ భారత్ ను ఒత్తిడి చేయటోతే ప్రతికూల ఫలితాలు తప్పవు.

"మేం ఏ రాష్ట్రంలో ఏమి చేయాలో చెప్పేవారు" ఈ దేశంలో కొందరున్నారన్నారు. వారి సలహాలు తాము కోరడం లేదని చెప్పదలచుకున్నాను. మా పార్టీలో మంచివారెవరో, చెడ్డవారెవరో నిర్ణయించుకోవలసింది మేమే" అని శ్రీమతి గాంధీ చెప్పారు

తనతోసహకరిస్తామనీ, తన పార్టీలోవారితో సహకరించబోమనే సూత్రాన్ని అంగీకరించలేనని తెలిపారు.

ముఖ్యమంత్రుల గురించి నిన్న తన ప్రస్తావనను ఆమె తిరిగి పేర్కొన్నారు. తమను వ్యతిరేకించే వారి గురించి తానేమీ చెప్పలేదని వారు అడిగారు. ముఖ్యమంత్రిని గానీ, ప్రభుత్వాన్నిగానీ వ్యతిరేకిస్తూ కాంగ్రెసువారు ప్రచారం చేయకూడదు. ఇతరులను కలుపుకొచ్చేందుకు ముఖ్యమంత్రులు కూడా ప్రయత్నించాలని సలహా యిచ్చారు.

విదేశీ జోక్యంగురించి తిరిగి ప్రస్తావిస్తూ ప్రచారంలోనే కాక యిది యితర రూపాలలో ఉందనీ, ముఖ్యంగా యీశాన్య ప్రాంతానికి ఇది ప్రమాదకరమనీ అన్నారు. ఈ ప్రాంతానికి శాంతి తిరిగి వచ్చినప్పటికీ మళ్ళీ హింసాకాండను రెచ్చగొట్టేయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు.

అనేక ప్రాంతాలలో మంచి పంటల గురించి చెప్పారు. కొన్నిచోట్ల కరువు, వరదలు వచ్చాయని, అక్కడి ప్రజలకు సానుభూతి ప్రకటించారు. వారికి సహాయం అందించేందుకు అన్ని చర్యలూ చేపట్టామన్నారు.

ఎమర్జెన్సీ మందు బాగా పనిచేస్తుందను కున్నానని చెప్పారు. అన్ని స్థాయిల్లో క్రమశిక్షణవల్ల ఇటీవల దేశం పురోగమించగలిగిందన్నారు.

ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని వ్యతిరేకించరాదని తామెప్పుడూ అనుకోలేదనీ, గతంలో వారి హక్కుల దుర్వినియోగాన్ని సహించామనీ ఇకపై కూడా సహిస్తామని చెప్పారు.

ప్రజాస్వామ్యమంటే కేవలం ఎన్నికలూ పత్రికలే కాదు. ప్రజలవాణి వినిపించడానికే అవి ఉద్దేశించబడ్డాయి. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు సాధనాలు మాత్రమే. ఇతర దేశాల్లో మాదిరిగా వాగ్వివాదాలకు కాక హింసాకాండకు దారితీసే పక్షంలో ఎన్నికలు జరపాలా? వద్దా? అనేవిషయాన్ని ఈ దేశ ప్రజలు యోచించాలి.

"ప్రజాస్వామ్యాన్ని ప్రేమిస్తాను. కానీ దేశం మనుగడను మరింత ప్రేమిస్తాను" అన్నారు.

ప్రజల సహకారాన్ని పొందడంలో విఫలమైన ప్రతిపక్షాలు, అతివాద వుగ్రవాదుల నుండి ప్రస్తుతంనిషేధించబడినసంస్థల నుండి సాయం పొందాయి. ఇప్పుడు ప్రతిపక్షాలు విదేశీ సాయంతో బలం పుంజుకోవాలని చూస్తున్నాయి. దీన్ని సహించలేం.

భారత్ తన స్వాతంత్ర్యాన్ని ఎలా కాపాడుకుందన్న విషయం దాని సొంత వ్యవహారం. స్వాతంత్ర్య పోరాటంలో మనకు సాయం చేసిందెవరు? అని అడిగారు.

అంతకుముందు కాయితం మీద మిగిలిపోయిన కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయడం ప్రారంభించినపుడే ప్రభుత్వానికి ప్రతిఘటన ఎదురయిందన్నారు.

మహిళకు బదులు భారత్

శ్రీ బారువా సూచన

జవహర్ నగర్, నవంబరు 22

స్త్రీలను పేర్కొనేటప్పుడు "మహిళ" అనే పదానికి బదులుగా "భారత్" అని వాడితే బాగుంటుందని కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ డి. కె. బారువా అన్నారు.

సంస్కృతంలో "మహిళ" అంటే రాచరిక కుటుంబ స్త్రీ అనీ, "భారత్" అనే పదాన్ని గౌరవిస్తాననీ, ఎందుచేత ననగా "భారత్ అంటే దేశ ప్రగతి కొరకు పనిచేసే స్త్రీ అని ఎ. ఐ. సి. సి. లో ఆయన అన్నారు.

కేరళలో పోలీసు లాఠీఛార్జిపై బహిరంగ విచారణ

తిరువనంతపురం నవంబర్ 22

క్విలన్ వద్ద పరవూరులో ట్రేడ్ యూనియన్ కార్యకర్తలపై పోలీసు లాఠీఛార్జీ గురించి దర్యాప్తుకు కేరళ ప్రభుత్వం ఉత్తర్వు చేసింది.

అత్యవసర పరిస్థితి తరువాత బహిరంగ విచారణకు ఉత్తర్వుచేయడం కేరళలో ఇదే ప్రథమం. క్విలన్ జిల్లా కలెక్టర్ ఏక సభ్యవిచారణ కమిషన్ గా వ్యవహరిస్తారు. మూడు నెలలలోగా కమిషన్ నివేదిక సమర్పిస్తుంది.

అధికారంలో ఉన్న ఐక్య సంఘటన సంధాన కమిటీలో చర్చ అనంతరం పరవూర్ ఘటనలపై దర్యాప్తుకు ప్రభుత్వం ఉత్తర్వు చేసింది. అత్యవసర పరిస్థితి అధికారాలను దుర్వినియోగం చేస్తున్న అధికారులపై తీవ్ర చర్యతీసుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది.

పరవూర్ కార్మికులపై పోలీసు చర్యలను కమ్యూనిస్టుపార్టీ నిరసించింది.

ఆయుధ సరఫరాపట్ల భారత్ ఆందోళన

న్యూఢిల్లీ, నవంబరు 22

పాకిస్థాన్ కు 110 అధునాతనమైన ఎస్ బాంబర్ విమానాలు అమ్మేందుకు అమెరికా ప్రతిపాదనపట్ల భారత్ ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలియవచ్చింది.

అమెరికా ఛార్జి-డి ఎఫైర్స్ ష్నీడర్ ను భారత విదేశాంగశాఖ కార్యదర్శి నేడు కలుసుకుని భారత్ ఆందోళనను తెలియచేశారు.

వెల్లోడి, ష్నీడర్ల సమావేశంపై అధికార వార్తలేమీ అందలేదు. అత్యంత శక్తివంతమైన యీ విమానాల అమ్మకం ఉపఖండంలో ఆయుధ పోటీని పెంచుతుందని ఆయన చెప్పినట్లు భావిస్తున్నారు.

కొత్తరకం ఎద్దుబండి

న్యూఢిల్లీ, నవంబరు 22

కలకత్తాకు చెందిన 15 సంవత్సరాల వయసు గల విద్యార్థి సుమిత్ సేన్ కొత్తరకం ఎద్దుబండిని రూపొందించారు. దానికి కాలితో వేసే బ్రేకులు, కాడిమాను, బండిని నడిపేందుకు ప్రత్యేకమైన పద్ధతి వున్నాయి. వీటివల్ల ఎద్లకు కొంతబరువు తగ్గి సౌలభ్యంగా వుంటుంది.

ఇక్కడ తీన్ మూర్తి భవనంలో 6 వ వార్షిక పిల్లల వైజ్ఞానిక ప్రదర్శనలో ఏర్పాటుచేసిన నమూనాలలో యిది ఒకటి. భారతశాస్త్రజ్ఞులకు అసూయ కల్గించే విధంగా ఆయన దీనిని రూపొందించారు.

సేన్ రూపొందించిన దానిలో, బండి చట్రం రెండు భాగాలుగా విభజించబడింది. ముందు భాగంలో ఎద్దులు, ఒక జత చిన్న చక్రాలు, కాడిమాను వుంటాయి. నడపడానికి వీలుంటుంది. వెనుక భాగంలో బరువు, డ్రైవరు వుంటాయి.

ముందు, వెనుక భాగాలుబాల్ బేరింగ్ తో కలపబడి జరిగింది. దీనివల్ల బండి మలుపులు తిరగడానికి సులభంగా వుంటుంది. ముందు భాగములోని బేరింగ్ లు, చక్రాలజత ఎడ్లకు బరువు భారంనుండి కొంత పూరట కల్గిస్తాయని శ్రీ సేన్ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్, జమ్మూ - కాశ్మీర్, కొన్ని తూర్పు రాష్ట్రాలు మినహా అన్ని రాష్ట్రాలకు చెందిన పాఠశాలలు యీ ప్రదర్శనలలో పాల్గొన్నాయి.

జాతీయ, పరిశోధనాభివృద్ధి కార్పొరేషన్ ప్రదర్శనలో పదమూడింటిని ఉత్తమమైనవిగా ఎంపిక చేసినట్లు తెలుస్తున్నది.

గుంటూరులో కార్మికుల ప్రదర్శన

కార్మికుల ప్రాథమిక హక్కుల వారోత్సవం సందర్భంగా

గుంటూరు, నవంబరు 22

కార్మికుల ప్రాథమిక కోర్కెల వారోత్సవం సందర్భంగా గుంటూరులో నిన్న సాయంత్రం ఎ. పి. టి. యు. సి.కి అనుబంధించబడిన కార్మిక సంఘాలకు చెందిన కార్మికులు తమ కోర్కెలను తెలిపే బ్యాడ్జీలను ధరించి ప్రదర్శన జరిపారు.

ప్రదర్శనకు ఎ. పి. టి. యు. సి. కార్యదర్శి శ్రీ జి. సూర్యం, పట్టణ కమ్యూనిస్టు సమితి సహాయ కార్యదర్శి శ్రీ జి. వి. కృష్ణారావు, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ పంచాయతీ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ వి. కోటేశ్వరరావు, పొగాకు కార్మిక సంఘ నాయకులు శ్రీ కె. చెన్నయ్య, రిక్షాడ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ కె రామచంద్రరావులు నాయకత్వం వహించారు.

ప్రదర్శనకు ముందు ఎ. పి. టి. యు.సి ఉపాధ్యక్షులు శ్రీ కనపర్తినాగయ్య ప్రసంగిస్తూ జమ్ షెడ్ పూర్ మహాసభలో ఎ.ఐ.టి.యు.సి. యిచ్చిన పిలుపును, కార్మికుల కొన్ని హక్కులను ప్రభుత్వంఅరికట్టడాన్ని వివరించారు.

ప్రదర్శన అనంతరం మల్లయ్యలింగం భవన్ లో జరిగిన సభలో కార్మికుల నుద్దేశించి శ్రీ జి వి. కృష్ణారావు, కె. చెన్నయ్య ప్రసంగించారు.

వైద్యోద్యోగుల ప్రదర్శన

గుంటూరు ఆస్పత్రి వైద్య వుద్యోగులు కార్మికుల ప్రాథమిక హక్కుల వారోత్సవం సందర్భంగా ఈనెల 20వ తేదీన 300మందితో ప్రదర్శన జరిపారు.

అనంతరం వైద్యోద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ వి. తిరుపాలు నాయకత్వాన కార్యవర్గ సభ్యులు హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వై. ఆర్. రెడ్డికి మెమొరాండం సమర్పించారు.

ఉద్యోగులకు క్వార్టర్స్ ఏర్పరచాలని, కంటిన్యూటీ సర్వీసులు రద్దు చేయాలని, స్త్రీలకు యూనిఫారం ఇవ్వాలని, ఆస్పత్రిలో ఎఫిషియన్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని మెమొరాండంలో కోరారు. అవసరమైన చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ హామీ యిచ్చారు. (వి. వి.)

కృష్ణాజిల్లాలో 20 వేల ఆపరేషన్లు

మచిలీపట్నం, నవంబరు 22

కృష్ణాజిల్లాలో యీ సంవత్సరానికి 31 వేల కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను లక్ష్యంగా పెట్టుకోగా ఈ నెల 15 వ తేదీ నాటికి 20,314 ఆపరేషన్లు నిర్వహించటం జరిగిందని జిల్లా ఎక్స్టెన్షన్ ఎడ్యుకేటర్ శ్రీ కె. సత్యనారాయణ తెలిపారు.

కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు ప్రారంభించిన నాటినుండి 8 నెలల్లో యింత ఎక్కువగా ఆపరేషన్లు చేయటం యిదేనని ఆయనన్నారు. ఒక్క అక్టోబర్ లోనే 9190 ఆపరేషన్లు జరిపారు. 6745 ఆపరేషన్లు నిర్వహించటం ద్వారా విజయవాడ రెవిన్యూ డివిజన్ ప్రథమ స్థానాన్ని సంపాదించింది.

తాతమ్మకల, అయినా చిత్రాల నిలిపివేత

న్యూఢిల్లీ, నవంబరు 22

"తాతమ్మకల" తెలుగు చలనచిత్ర ప్రదర్శనను ఇప్పటినుండి రెండునెలలు పాటు నిలుపుచేస్తూ కేంద్ర సమాచార శాఖ మొన్న ఒక ఉత్తర్వు జారీచేసింది.

హిందీ చిత్రం "అయినా" పైన కూడా నెలరోజుల నిషేధాన్ని విధించింది.

ఏలూరులో ఎ. పి. టి. యు. సి మహాసభ: ఆహ్వానసంఘం ఎన్నిక

ఏలూరు, నవంబరు 23

ఏలూరులో జరుగనున్న ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎ. పి. టి. యు. సి.) మహాసభ నిర్వహణకుగాను ఈనెల 21న స్థానిక మోతే వారి సత్రంలో జరిగిన సభలో ఒక ఆహ్వాన సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

ఈ సందర్భంగా వివిధ కార్మికసంఘ ప్రతినిధులు తమ యూనియన్ల తరఫున మహాసభ నిర్వహణకు రు. 21730 లు విరాళాలు ప్రకటించారు.

ఆహ్వాన సంఘం ఎన్నిక

అధ్యక్షులుగా శ్రీ వంకా సత్యన్నారాయణ ఉపాధ్యక్షులుగా శ్రీయుతులు మారెళ్ళ నరసింహారావు, కలిదిండి భీమరాజు, జె. వి. సత్యనారాయణ, తానేటి ప్రకాశం, ప్రధాన కార్యదర్శిగా శ్రీ పూడి అప్పస్వామి కార్యదర్శులుగా శ్రీయుతులు జె. లక్ష్మణరావు, బసవరాజు, హైదర్ మొహిద్దీన్ తంచె అప్పారావు, కోశాధికారిగా శ్రీపి కృష్ణంరాజు, శ్రీయుతులు కడుపు రాములు, అనిశెట్టి అప్పారావు మరో 38 మందితో ఆహ్వాన సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విరాళాల ప్రకటన

మొహిద్దీన్ (భీమవరం)	రు. 1000
తానేటి ప్రకాశం (తణుకు)	1000
జిల్లా సామిల్లు వర్కర్సు యూనియన్	800
లారి లోడింగ్ అన్ లోడింగ్ ముఠా వర్కర్సు ఏలూరు. వగిరెడ్డి ఎరకయ్య	[illegible]
పెనుగొండ ఏరియానుండి లాల్ సాహెబ్ గారు	800
అజ్జరం మెటల్ వర్కర్సు యూనియన్	116
దాగల్లు షుగర్ ఫ్యాక్టరీ వర్కర్సు యూనియన్	500
తాడేపల్లి గూడెం రైస్ ఫ్యాక్టరీ వర్కర్సు యూనియన్	1000
తాడేపల్లి గూడెం షడ్స్ ఫ్యాట్స్ పెర్టిలైజర్స్ వర్కర్సు యూనియన్	500
ఏలూరు జూట్ లేబరు యూనియన్	7000
నేషనల్ సీడ్సు కార్పొరేషన్ మహిళా వర్కర్సు యూనియన్ (తణుకు)	116
జట్లు, లాగుడుబండ్ల కార్మిక సంఘం (ఏలూరు)	200
పోలవరం తాలూకా రైస్ ఫ్యాక్టరీ యూనియన్స్	500
మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్	200
రైస్ ఫ్యాక్టరీ వర్కర్సు యూనియన్ (ఏలూరు)	116
ఇనిఓసి వర్కర్సు యూనియన్ (భీమవరం)	250
రైస్ ఫ్యాక్టరీ వర్కర్సు యూనియన్ (నిడదవోలు)	500
టానరీ వర్కర్సు యూనియన్ (ఏలూరు)	200
మునిసిపల్ వర్కర్సు (భీమవరం)	200
కార్పెట్ వర్కర్సు (ఏలూరు)	100
టౌన్ టుబాకో అండ్ గోల్డెన్ టుబాకో వర్కర్సు	500
పంచాయతీ వర్కర్సు (తణుకు తాలూకా)	116
జిల్లా ఆర్.టి.సి. ఎంప్లాయీస్ యూనియన్	3,000
జిల్లా బ్యాంక్ ఎంప్లాయీస్	2000
ద్వారకా తిరుమల సుద్ద వర్కర్సు	116
భీమడోలు సంతద్వార వర్కర్సు యూనియన్	200
తాడేపల్లిగూడెం టౌన్ ట్రేడ్ యూనియన్స్	500

హువా ఘనతపై చైనాలో భారీ ప్రచారం

టోక్యో, నవంబరు22

ఛైర్మన్ హువాకో ఫెంగ్ నాయకత్వ ఘనత పెంచడానికి, ఉత్పత్తి పునర్నిర్మాణానికి అనుగుణంగా మావోయిజానికి భాష్యం చెప్పడానికి చైనాలో క్రిందస్థాయిలో భారీ ఎత్తున ప్రచారం ప్రారంభమైంది.

ఈ రెండు లక్ష్యాల మధ్య రాడికల్ ముఠాపై నిరంతర విమర్శ సాగుతోందని సమాచార కథనం.

స్వావలంబన గురించి చైనా నొక్కి చెపుతున్నదంటే, అది బయటి ప్రపంచంతో వేరుపడిపోయే విధానంకాదని పెకింగ్ పత్రిక "పీపుల్స్ డైలీ" వివరించినట్లు హాంగ్ కాంగ్ నుండి రాయిటర్ కథనం.

విభిన్న సామాజిక వ్యవస్థలుగల దేశాల మధ్య ఆర్థిక, సాంకేతిక మార్పిడులు సాధారణ కార్యకలాపాలేనని ఒక వ్యాసంలో ఆ పత్రిక తెలిపిందని నవచైనా వార్తా సంస్థ పేర్కొంది.

ఇతర దేశాల శాస్త్ర సాంకేతిక అభివృద్ధి నుండి అనుభవాలనుండి చైనానేర్చుకోవలసి వుందని రాసింది.

స్వావలంబనను పనిగట్టుకు వక్రీకరించి మనకు తోడ్పడే విదేశీ విషయాలను స్వావలంబనకు పోటీ పెట్టడం నలుగురి ముఠా ఎత్తుగడ అని విమర్శించింది. పీపుల్స్ డైలీలో వ్యాసాన్ని పరిశ్రమల శాఖకు చెందిన విమర్శకుల బృందం రాసింది.

కాల్టెక్సు రిఫైనరీ స్వాధీన ఒప్పందంపై సంతకాలు

న్యూఢిల్లీ, నవంబరు 22

కాల్టెక్స్ నూనె శుద్ధి కర్మాగారం, కాల్టెక్స్ మార్కెటింగ్ కంపెనీలను భారత ప్రభుత్వం పూర్తిగా స్వాధీనపరచుకొనే ఒప్పందంపై నేడిక్కడ లాంఛన ప్రాయంగా సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందం 1976డిశంబరు 30వ తేదీ నుండి అమల్లోకి వస్తుంది.

ఈ రెండు సంస్థలను, భారత్ లో వాటి వాటి కార్యకలాపాలు, ఆస్తులు స్వాధీనం చేసుకొనేందుకు ఒప్పందం మేరకు న్యూయార్క్ కాల్టెక్స్ పెట్రోలియం కార్పొరేషన్ కు, భారత్ రు. 13 కోట్లు చెల్లించవలసి వుంటుంది. ఈ మొత్తాన్ని ఐదు వాయిదాల్లో అమెరికన్ డాలర్లలో చెల్లించాలి.

మోడరన్ బేకరీస్ బ్రెడ్ ధరల తగ్గింపు

మద్రాసు, నవంబరు 22

ప్రభుత్వ రంగానికి చెందిన మోడరన్ బేకరీస్ కంపెనీ వెంటనే అమలులోకి వచ్చే విధంగా రొట్టెల ధరలను తగ్గిస్తూ నేడిక్కడ ప్రకటించింది.

400 గ్రాముల బరువుగల బ్రెడ్ ను రు 1.15 నుండి రు.1,10కి 200 గ్రాముల బరువుగల ఫ్రూట్ బ్రెడ్ ను రు.1.20 నుండి రు 1.10 కి తగ్గిస్తూ ప్రకటించింది.

కేంద్ర ప్రభుత్వం గోధుమ ధరను క్వింటాల్ కు 135 రూపాయల నుండి 125 రూపాయలకు తగ్గించినందున ఈ తగ్గింపు సాధ్యమయిందని కంపెనీ జనరల్ మేనేజర్ శ్రీ కె. ఎల్. రాధాకృష్ణన్ సమాచార విలేకరికి తెలియజేశారు.



హౌసింగ్ కాలనీకి శంకుస్థాపన చేస్తున్న మంత్రి, చిత్రంలో యింకా శాసనసభ ప్రతిపక్ష నాయకులు శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ, జిల్లాకలెక్టరు శ్రీ ఆర్. కుప్పురావులను చూడవచ్చు

మంగళగిరిలో హౌసింగ్ కాలనీకి శంకుస్థాపన

(విశాలాంధ్ర విలేకరి)

గుంటూరు, నవంబరు 21

రాష్ట్ర అవతరణ దినోత్సవాల ముగింపు సందర్భంలో నిన్న ఉదయం గుంటూరుకు 15 మైళ్ళ దూరంలోవున్న మంగళగిరిలో ఇటీవల అగ్ని ప్రమాదాలవలన గృహాలు కోల్పోయిన నిర్వాసితుల సహాయార్థం 8 లక్షల 28 వేల రూపాయల ఖర్చుతో 278 మంది కుటుంబాల వారికి నిర్మిస్తున్న హౌసింగ్ కాలనీకి రాష్ట్ర రవాణా మంత్రి శ్రీ చేబ్రోలు హనుమయ్య శంకుస్థాపన చేశారు.

ఇందులో లక్ష 50 వేల 750 రూపాయల ఖర్చుతో 45 గృహాల నిర్మాణం పూర్తయింది.

అనంతరం మంత్రి శ్రీ హనుమయ్య లక్ష 34 వేల 5 వందల రూపాయలు రుణ, మంజూరు పత్రాలను 350 మంది బలహీన వర్గాల ప్రజలకు అందచేశారు.

ఈ సందర్భమున జరిగిన సభకు జిల్లా కలెక్టరు శ్రీ ఆర్. కుప్పురావు అధ్యక్షత వహిస్తూ మంగళగిరి వైర్ల ఫ్యాక్టరీకి వచ్చే నెలలో ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ శంకుస్థాపన చేస్తారని తెలియ చేశారు.

శాసనసభ ప్రతిపక్ష నాయకులు శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ, శాసనమండలి సభ్యులు శ్రీ బ్రగడ కోటయ్య, జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ ఉన్నవ చిన్నయ్య మున్నగు వారు రాష్ట్రంలో జరుగుతున్న పారిశ్రామిక ప్రగతి, మున్నగు వాటిని వివరిస్తూ ప్రసంగించారు.

ప్రారంభంలో శ్రీ గోలి గోపాలరావు ముఖ్య అతిథులను వేదికపైకి ఆహ్వానించి స్వాగతం చెప్పారు. (వి. వి.)

క్రీడారంగం

పాక్ క్రికెట్ జట్టు కెప్టెన్ గా ఇంతికాబ్ అలం: ముస్తాక్ అహమ్మద్ తొలగింపు

లాహోర్, నవంబరు 22

పాకిస్థాన్ క్రికెట్ జట్టు కెప్టెన్ ముస్తాక్ మొహమ్మద్ ను కెప్టెన్ పదవినుండి తొలగించారు.

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అత్యవసర సమావేశం జరిపి పై నిర్ణయం తీసుకున్నది. జట్టు కెప్టెన్ గా ఇంతికాబ్ ఆలమ్ ను నియమించింది.

పాకిస్థాన్ లో క్రికెట్ ప్రస్తుతం పెద్ద వివాదాస్పదమైన అంశంగా తయారైంది ఇటీవల సంభవించిన వివాదాస్పద ఘటనలపై కొంత మేరకు ట్రేడ్ యూనియన్ ఛాయలు కూడా పడ్డాయి. పాకిస్థాన్ క్రికెట్ జట్టు కెప్టెన్ ముస్తాక్ అహమ్మద్ ఈ నెల 12 వ తేదీన ఇంగ్లండ్ బయలుదేరి వెళ్ళేనాటికి పాక్ లో ప్రొఫెషనల్ క్రికెటర్ల (వృత్తి రీత్యా క్రికెట్ ఆటగాళ్ళు) వేతనాల పెంపుకు సంబంధించిన వివాదం తారాస్థాయికి చేరుకుంది.

ఇంగ్లండ్ లోని నార్తంప్టాన్ షైర్ లో ప్రొఫెషనల్ క్రికెటర్ గా ఆడే ముస్తాక్ అహమ్మద్ మరి ఆరుగురు ప్రొఫెషనల్ ఆటగాళ్ళ తమ వేతనాలను పెంచకపోయినట్లయితే ఆస్ట్రేలియా, వెస్టిండీస్ లలో పర్యటనకు బయలుదేరే పాకిస్థాన్ జట్టులో ఆడబోమని స్పష్టం చేశారు.

ఈ తగాదా అంతా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు ఎ. హెచ్. కర్దార్ కూ, ప్రొఫెషనల్ ఆటగాళ్ళు ముస్తక్ అహమ్మద్ సాదిక్, ఇమ్రాన్, మజీద్ ఖాన్, ఆసిఫ్ ఇక్బాల్, జాహెద్ మైందాద్, వాసిమ్ బారీలకూ వచ్చింది. కర్దార్ యిస్తానన్న వేతనాలను వీరు తిరస్కరించడంతో అసలు కథ బయటపడింది.

మూడవ టెస్ట్ కు కెప్టెన్ గా బేడి

కాన్పూరు, నవంబరు 22

నవంబరు 26వ తేదీ నుండి మద్రాసులో భారత - న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగనున్న మూడవ క్రికెట్ టెస్టు పోటీకి బిషన్ సింగ్ బేడీని కెప్టెన్ గా ఎంపిక చేశారు.

మొదటి రెండు టెస్టులకు మాత్రమే బేడీని గతంలో ఎంపిక చేశారు.

వెస్టిండీస్ మహిళా జట్టుచే 5 వికెట్లకు 122 పరుగులు

లక్నో, నవంబరు 22

భారత్ - వెస్టిండీస్ ల మధ్య జరుగుతున్న ఐదవ మహిళా క్రికెట్ టెస్టు పోటీలో వెస్టిండీస్ జట్టు నేడు ఆటముగిసే సమయానికి తన మొదటి ఇన్నింగ్సులో 5 వికెట్లనష్టానికి 122 పరుగులు చేసింది.

అంతకుముందు భారత్ జట్టు 9 వికెట్లకు 215 పరుగులుచేసి డిక్లేర్ చేసింది.

బెంగుళూరు గ్రాండ్ ప్రిక్స్ పోటీల్లో హరీన్ రహీమ్ గెలుపు

బెంగుళూరు, నవంబరు 22

బెంగుళూరులో నేడు ప్రారంభమైన నాల్గవ జాతీయ టెన్నిస్ టోర్నమెంట్లు చాలా మందకొడిగా వుంది. ఉదయం ఒక మ్యాచ్ మాత్రమే జరిగింది. పాకిస్థాన్ కు చెందిన హరీన్ రహీమ్, పాక్ - భారత్ ల మధ్య జరిగిన పోటీలో భారత్ ఆటగాడు శ్రీ జైదీప్ ముఖర్జీని 6-2, 6-0 స్కోరుతో 53 నిముషాల్లో ఓడించారు.

పురుషుల సింగిల్స్ లో మరో మ్యాచ్ జరగలేదు. మనీలాలోను, ఫిలిప్పైన్సు నుండి వస్తున్న క్రీడాకారులు బొంబాయిలోను ఆగిపోయినందువల్ల మరే ఇతర మ్యాచ్ లు జరగలేదు.

సిగార్ కార్మికులకు పండుగ శెలవులు: తూ॥ గో॥ జిల్లా వర్కర్స్ యూనియన్ విజ్ఞప్తి

రాజమండ్రి, నవంబర్ 22

సిగార్ కార్మికులకు వేతనాలతో పండుగ శెలవు లివ్వాలని యీ నెల 14 వ తేదీన మండపేటలో జరిగిన తూర్పు గోదావరి సిగార్ వర్కర్స్ యూనియన్ కమిటీ విస్తృత సమావేశం, మండపేట సిగార్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

కార్మికుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రావిడెంట్ ఫండ్ పథకం గ్రాట్యుటీ, ఇ. యస్. ఐ. పథకాలను సిగార్ కార్మికులకు కూడా వర్తింపచేయాలని సమావేశం కోరింది. కార్మికులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని, గృహ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందచేయాలని ప్రభుత్వానికి సమావేశం విజ్ఞప్తి చేసింది.

ఈ సమావేశానికి శ్రీ పీరం అప్పారావు అధ్యక్షతవహించారు. జిల్లా యూనియన్ కార్యదర్శి శ్రీ అంబటి సూర్యారావు వివిధ ప్రాంతాలలో యూనియన్ నిర్మాణంపై నివేదిక నిచ్చారు.

కార్మికుల సమస్యలపై శ్రీయుతులు జిగు వెంకట్రావు, కొంకి వీర్రాజు, బొడ్డు సత్యారావు, షేక్ గౌస్ లు ప్రసంగించారు.

రాజమండ్రిలో ఆర్.టి. ఆర్.సి. సాంస్కృతికోత్సవాలు

రాజమండ్రి, నవంబరు 22

"సాంస్కృతిక కళాకార్యక్రమాలు అన్ని స్థాయిలలోనూ పనిచేసే వారి మధ్య సమైక్యతను చేకూరుస్తాయి. అయిదు రోజుల పాటు ఆర్. టి. సి. క్లబ్ వారు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు జయప్రదం కావాలి" అంటూ తూర్పు గోదావరిజిల్లా సెషన్స్ జడ్జి శ్రీ యు. వేణుమాధవరావు శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి కళ్యాణమండపంలో రోడ్ ట్రాన్స్ పోర్టు రిక్రియేషన్ క్లబ్ వారి ఆధ్వర్యాన నిర్వహింపబడే 13 వ సాంస్కృతికోత్సవాలను ప్రారంభిస్తూ అభిలాషించారు.

తుపాను హెచ్చరిక జరిగినా ఎంతో ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైనాయి.

ఎ. పి. ఎస్. ఆర్. టి. సి. జాయింట్ జనరల్ మేనేజర్, ఆర్. టి. ఆర్. సి. అధ్యక్షులు శ్రీ ఎం. పి. వి అనంత ఉత్సవ సభలకు అధ్యక్షత వహిస్తూ రోడ్ ట్రాన్స్ పోర్టు రిక్రియేషన్ క్లబ్ 25 సంవత్సరాలుగా దినదినాభివృద్ధి చెందడానికి అందరి సహకార సానుభూతులే కారణమని, రోడ్ ట్రాన్స్ పోర్టు కార్పొరేషన్ లో పనిచేసే పని వారిలో వున్న శక్తిసామర్థ్యాలను వెలికితీసి ప్రోత్సాహించడమే ఈ ఉత్సవాల ధ్యేయం అన్నారు.

తొలుత శ్రీ ఎం. మల్లన్న స్వాగతం పలికారు. డా॥ పద్మనాభం వందన సమర్పణ చేశారు.

బస్ డ్రైవర్ శ్రీ పోలాంకి అప్పారావు శివతాండవ నృత్యంతో సాంస్కృతిక ఉత్సవాలు ప్రారంభమైనాయి.

చేనేత కార్మికుల కనీస వేతనాల అమలుపై సెమినార్

హైదరాబాద్, నవంబర్ 22

నవంబర్ 28 న సిరిసిల్లలో చేనేత పరిశ్రమలో కనీస వేతనాల అమలుపై సెమినార్ జరుగుతుంది.

ఈ సెమినార్ లో చేనేత కార్మికులకు సంబంధించిన ఆర్థిక సమస్యలపై కూడా చర్చలు జరుగుతాయని తెలంగాణా చేనేత కార్మికుల సమాఖ్య అధ్యక్షులు శ్రీ డి. వెంకటేశం తెలియచేసారు.

చేనేత పరిశ్రమలశాఖ మంత్రి శ్రీ కె. వి. కేశవులు సెమినార్ ను ప్రారంభిస్తారు. కార్మికమంత్రి శ్రీ టి. అంజయ్య అధ్యక్షత వహిస్తారు.

కొన్ని ఆసుపత్రుల్లో పడకల పెంపుకు ప్రభుత్వం అనుమతి

హైదరాబాద్, నవంబరు 22

కోహిర్ (మెదక్ జిల్లా) రాపూర్ (నెల్లూరు జిల్లా) ప్రభుత్వ ఆసుపత్రుల పడకల సంఖ్యను హెచ్చిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది.

20 పడకల ఆసుపత్రిగా మార్పు చేస్తున్న కోహిర్ ఆసుపత్రికి రు. 1.23 లక్షలు, రాపూర్ ఆసుపత్రికి రు.1.27 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది.

ప్రకాశంజిల్లా దర్శి తాలూకా మారెళ్ళ గ్రామంలో 12 పడకల ఆసుపత్రి నిర్మించడానికై కూడా ప్రభుత్వ అనుమతి లభించింది. ఈ ఆసుపత్రి భవన నిర్మాణానికి శ్రీ దిరిసల వెంకటరమణారెడ్డి స్థలాన్ని విరాళంగా ఇచ్చారు.

ద్వైపాక్షిక చర్చల ద్వారా మాత్రమే భారత-బంగ్లా సమస్యల పరిష్కారం

శ్రీ స్వరణ్ సింగ్ స్పష్టీకరణ

జవహర్‌నగర్, నవంబర్ 22

భారత-బంగ్లాదేశ్‌ల మధ్య అపరిష్కృతంగా వున్న సమస్యలు ద్వైపాక్షిక చర్చల ద్వారా మాత్రమే పరిష్కరించుకోవడం సాధ్యమన్న విషయాన్ని బంగ్లాదేశ్ గుర్తించాలని; భారత్‌పై బయటినుండి వత్తిడి తీసుకురావడానికి చేసే ప్రయత్నాలు విఫలమవుతాయని మాజీ విదేశాంగమంత్రి శ్రీ స్వరణ్‌సింగ్ నేడిక్కడ చెప్పారు.

ఎ. ఐ. సి. సి. సమావేశంలో అంతర్జాతీయ తీర్మానంపై చర్చలో పాల్గొంటూ బంగ్లాదేశ్ తన ప్రస్తుత వైఖరిని పునరాలోచించుకొని సమస్యల పరిష్కారానికి సహాయపడాలని శ్రీ స్వరణ్‌సింగ్ విజ్ఞప్తి చేశారు.

అత్యంత క్లిష్ట పరిస్థితులలో కూడా విదేశీ వత్తిడులకు భారత్ ఎన్నడూ లొంగలేదని, పాకిస్తాన్ ఒకసారి ప్రయత్నించి విఫలమయిందని ప్రస్తుతం సమస్యల పరిష్కారానికి ద్వైపాక్షికత ప్రాముఖ్యతను గుర్తించిందని ఆయన అన్నారు. పాకిస్తాన్, వియత్నాం వంటి దేశాల అనుభవాల నుండి బంగ్లాదేశ్ గుణపాఠాలను నేర్చుకోవాలని ఆయన చెప్పారు.

భారత్ ఎల్లప్పుడూ పొరుగు దేశాలతో మంచి స్నేహ సంబంధాలనే వాంఛిస్తోంది. అందువల్లనే బంగ్లాదేశ్‌లో 1975 లో జరిగిన ఘటనలను బంగ్లాదేశ్ అంతరంగిక వ్యవహారంగా భావించింది. కాని ఈ ఘటనలు అంతర్జాతీయ సమస్యలను సృష్టిస్తే భారత్ చూస్తూ వూరుకోదు అని శ్రీ స్వరణ్‌సింగ్ చెప్పారు.

బంగ్లాదేశ్ లేవనెత్తిన ఫరక్కా సమస్యను ప్రస్తావిస్తూ బంగ్లా వినియోగించుకో గలిగే నీటి కంటే దానికి ఎక్కువ లభిస్తోందని, గంగా, బ్రహ్మపుత్ర నదుల పై భాగాలు భారత్‌లో వున్నందున బంగ్లాకు ఏ మైనా సమస్యలుంటే కేవలం అవగాహన ద్వారా మాత్రమే పరిష్కారం సాధ్యమవుతుందని ఆయన అన్నారు.

సిమ్లా ఒప్పందానికికట్టుబడి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్న అనంతరం పాకిస్తాన్‌తో సంబంధాలను మామూలు స్థాయికి తీసుకు వచ్చేక్రమంఆరంభమయిందన్నారు. చైనాతో సంబంధాలు మెల్లగా మామూలు స్థాయికి చేరుకునే అవకాశాలపట్ల భారత్‌కు ఆనందంగా వుందని రెండు దేశాల మధ్య వున్న సమస్యలు పరిష్కరించుకో లేనివి కాదని శ్రీ స్వరణ్‌సింగ్ చెప్పారు.

వలసవాదుల, జాత్యహంకారాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలకు భారత్ పూర్తి మద్దతును ఆయన పునరుద్ఘాటించారు.

జింబావేలో ప్రజలు క్లిష్ట సమస్యల నెదుర్కొంటున్నారని జింబావే స్వాతంత్ర్యోద్యమనాయకులు తమ అంతరంగిక విభేదాలను పరిష్కరించుకోవటం సంతృప్తికరమైన పరిణామమని ఆయన అన్నారు. దక్షిణాఫ్రికాలో విముక్తిఉద్యమాన్నిప్రస్తావిస్తూ అక్కడి జాత్యంహంకార ప్రభుత్వవైఖరిని తీవ్రంగా విమర్శించారు. దక్షిణాఫ్రికా ప్రజలకు భారత్ పూర్తి మద్దతును ఆయన పునరుద్ఘాటించారు.

అలీన విధానంలో ప్రపంచంలో అన్ని దేశాలకుస్వాతంత్ర్యం, సార్వభౌమాధికారం వుండాలన్న విధానాన్ని ఆయన ప్రశంసించారు.

తుంగాన్ ప్రసంగం

అంతర్జాతీయ తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ అందరికీ స్వేచ్ఛ, అందరి హక్కుల పరిరక్షణకూ భారత్ కట్టుబడివుందని అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ పి. తుంగాన్ చెప్పారు.

మానవతావాద వుత్తేజంతో ఉద్భవించిన ఈ విధానం భారత నాగరికతకు నిదర్శనమని ఆయన అన్నారు. జవహర్‌లాల్‌నెహ్రూ చెప్పినట్లు అలీన వుద్యమం, ఒక విధానం కాదు. అది ఒక వుద్యమం ప్రస్తుతం ప్రపంచంలో యిది అత్యంత ప్రధాన శక్తిగా రూపొందింది అని ఆయన చెప్పారు.

వివిధ అంతర్జాతీయ సమస్యలపై కాంగ్రెస్ వైఖరిని ప్రశంసిస్తూఒక సమయంలో అసాధ్యమని భావించిన పాక్ చైనాలతో సంబంధాలు భారత నిర్మాణాత్మక వైఖరి వల్ల మెరుగుపడ్డాయని ఆయన అన్నారు.

గతంలో కొంత కాలం ఈశాన్య ప్రాంతం రాజకీయ అస్థిరతలతో తమ పురోగతి నిరోధించబడిందని, ప్రస్తుతం ఈ ప్రాంతంలోని రాష్ట్రాలు జాతీయ జీవన స్రవంతిలో భాగస్వాములయ్యాయని శ్రీ తుంగాన్ చెప్పారు

తీర్మానాన్ని మిజోరాంకు చెందిన శ్రీ హెచ్. దగాయ్ బలపరిచారు.

ఐరాస ఆధ్వర్యాన ఒక ప్రపంచ నిరాయుధీకరణ మహాసభను త్వరలో నిర్వహించాలని కోరుతూ శ్రీ బి. ఎ. దేశాయ్ (బొంబాయి) తీర్మానానికి సవరణ ప్రతిపాదించారు.

డాక్టర్ హెన్రీ ఆస్టిన్ (కేరళ) ప్రసంగిస్తూ దేశంలో స్థిరత్వం వుండటంవల్ల అంతర్జాతీయంగా భారత్ పాత్రకు గుర్తింపు పెరుగుతోందన్నారు.

ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో యిబ్బందులను సృష్టించడానికి నయా వలసవాద శక్తులుచేసే ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వర్ధమాన దేశాలను ఆయన హెచ్చరించారు.

ఢిల్లీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్ శ్రీ రాధారమణ్ ప్రసంగిస్తూ భారత్ ఎల్లప్పుడూ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం పోరాడుతున్న దేశాలకు అండగా నిలబడిందన్నారు. అలీన ఉద్యమం బలపడ్డానికి భారత్ గణనీయమయిన కృషి చేసిందని అన్నారు.

అంతర్జాతీయ పరిస్థితిని సమీక్షిస్తూ పరిస్థితి ప్రతికూలంగాలేదని అన్నారు. అనేక సానుకూలమైనఅంశాలు వున్నాయనిచెప్పారు.

యూరప్‌లో సౌమనస్యతను భారతదేశం హర్షించిందని చెప్పారు. అయితే ఈ సౌమనస్యతాక్రమం ఆసియా, ఆఫ్రికా దేశాలకు విస్తరించకపోవడం విచారాన్ని కలిగిస్తున్నదని చెప్పారు.

అపరిష్కృత సమస్యల పరిష్కారానికి వర్ధమానదేశాలు తమకు తాము ప్రయత్నాలు చేయడంఅవసరమని నొక్కిచెప్పారు. దీన్ని మనమే సాధించాలి. ముఖ్యమైన దేశాల నుండి బహుమతిగాఅది మనకు రాదని ఆయన అన్నారు.

ప్రమాదం గుర్తించని పాత్రికేయులు

ప్రధాన సమాచార సలహాదారు శ్రీ శారదాప్రసాద్ ప్రసంగం

మైసూరు, నవంబరు 22

"మనమీనాడు ఇక్కడ ప్రమాదం మధ్య వుంటున్నాం. అయితే దురదృష్టవశాత్తూ మన పాత్రికేయులలో ఎక్కువ మంది ఆ ప్రమాదాన్ని గుర్తించలేదు" అని ప్రధాని శ్రీమతి గాంధీ సమాచార సలహాదారు శ్రీ హెచ్. వై. శారదా ప్రసాద్ అన్నారు.

"జన్మభూమి ఎండోమెంట్ లెక్చర్" నిర్వాహకులు ఏర్పాటు చేసిన సమావేశంలో "పత్రికలు - హక్కులు - బాధ్యత" అన్న అంశంపై ప్రసంగిస్తూ ఆయన పైవిధంగా అన్నారు.

ఆయన ఇంకా ఇలా ప్రసంగించారు:

పత్రికలకు స్వాతంత్ర్యం ఇవ్వకూడదన్నది నా ఉద్దేశ్యంకాదు. బాధ్యతారహితులు, విరాళోపహతులు, ఎదుటివారి సమ్మతిని తమ ప్రయోజనాలకు వినియోగించు కోకుండా వుండేలా మన సాంఘిక సంస్థలను పటిష్టం చేయాలి.

పత్రికల హక్కులను, బాధ్యతలను అవగాహన చేసుకోవాలంటే పత్రికల స్వభావం కర్తవ్యాలపట్ల స్పష్టమైన అవగాహన వుండడం అవసరం.

ఉక్కును ఒకేఒక సరుకుగాచెప్పడంసరి కాదని ఆర్థిక వేత్తలు, లోహ నిపుణులు చెప్తారు. ఉక్కులో అనేక పదార్థాలు ఉన్నాయి కాబట్టి ఉక్కు, అనే పదానికి బదులుగా "ఉక్కులు" అనాలనివారంటారు. ఉక్కులాగే పత్రికలు అన్న పదంలో అనేకత్వం వుంది. పత్రికలు అన్నపదంలో వివిధ రకాల పత్రికలు, మళ్ళీ ఆ పత్రికల స్వభావం, ప్రయోజనం, ప్రాంతం, పరిధి, వగైరా వైవిధ్యాలున్నాయి. యజమాని, సంపాదకుడు, పాఠకుడు- వీరంతా కలిసి ఒక పత్రిక స్వభావాన్ని నిర్ణయిస్తారు. పత్రికల విధానం, ప్రమాణం అన్నవి యజమానుల ఉద్దేశం, సంపాదకుల శక్తి సామర్థ్యాలు, పాఠకుల ఊహాపైన ఆధారపడివుంటాయి.

చాలామంది పత్రికల యజమానులు వ్యాపారం నిర్వహిస్తున్నది. డబ్బు చేసుకోడానికి మాత్రమేకాదు, ప్రభుత్వం మీద, రాజకీయాలమీద తమ ప్రభావాన్ని ప్రసరింపడానికివారు ఆ వ్యాపారం నిర్వహిస్తున్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం, పత్రికలమధ్య సంబంధాలు తరుచుగా మాత్రమే సవ్యంగానూ, సామరస్యంగానూ ఉంటాయి.

ప్రజాప్రయోజనాల దృష్ట్యా దేనినైతే రహస్యంగా వుంచాలని ప్రభుత్వం అనుకుంటుందో, అదే విషయాన్ని ప్రజాప్రయోజనాలదృష్ట్యా ప్రజలకు వెల్లడించాలని పత్రికలు ప్రయత్నిస్తాయి. అప్పుడు ప్రభుత్వమేమో పత్రికలను హద్దులో వుంచేందుకు ప్రయత్నిస్తుంది.

అన్నిసామాజిక సంస్థలాగే పత్రికలు కూడా ఒక సామాజిక సంస్థ

అవి కొన్ని స్పష్టమైన పరిమితులకు లోబడి పనిచేయాలి. ఒక అధికారం వుంటే మరొకరికి రక్షణ వుండితీరాలి కదా. ఎదుటివాడి ప్రయోజనానికి భంగం కలిగే విధంగా ఎవ్వరి అధికారాలు వినియోగింపబడరాదు.

ఇలాటి పరిమితులు, హద్దులు, రక్షణ అన్నవి చట్టంవల్లకానీ లేక ఫలప్రదమైన స్వయం అజమాయిషీ ద్వారాకానీ వస్తాయి. పత్రికల స్వేచ్ఛకు విశేష ప్రాముఖ్యంఇచ్చే దేశాలుకూడా ఆ స్వేచ్ఛకు పరిమితులున్నాయన్న విషయాన్ని గుర్తిస్తున్నాయి.

ఎక్కడయినా అధికార దుర్వినియోగాలకు వ్యతిరేకంగా రక్షణలు వుండితీరవలసిందే. పత్రికా స్వేచ్ఛను బలపరచేఅత్యంత ఉదారవాదులు సైతం - ఏదయినా ఒక పత్రిక జాతి భద్రతకు హానికలిగిస్తే దానిని నిరోధించడానికి చట్టం సహాయంపొందవలసిందేనని అంగీకరిస్తున్నారు

నచ్చచెప్పి ఒప్పించడం పత్రికల ప్రథమ కర్తవ్యం అని శ్రీ శారదా ప్రసాద్ అన్నారు.

మైసూరు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు శ్రీ డి. వి. అర్స్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఆయన,తొలుత ప్రముఖ పాత్రికేయుడు, జన్మభూమి ట్రస్టు వ్యవస్థాపకుడు అయిన కీ॥ శే॥ బి. ఎన్. గుప్తా చిత్రపటాన్ని ఆవిష్కరించారు.

రైలుప్రయాణీకులకు భోజన సదుపాయం

బిట్రగుంట, నవంబర్ 22

కావలి-బిట్రగుంటల మధ్యగల శ్రీ వెంకటేశ్వరపాలెం సమీపంలో భారీవర్షాల వల్ల చిక్కుకుపోయిన రైలు ప్రయాణీకులకు రైల్వే కార్మికులు భోజన సదుపాయాలను ఏర్పాటుచేశారు.

స్థానిక కార్మికులు, తదితరుల నుండి బియ్యం సేకరించి ప్రయాణీకులకు బిట్రగుంటలో ఉచిత భోజన సదుపాయాలు కలుగచేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ కార్యకర్తలు, ఆలిండియా లోకోరన్నింగ్ స్టాఫ్ కార్యకర్తలు, స్థానిక వ్యవసాయ కార్మిక సంఘ కార్యకర్తలు, యితర కార్మికులు పాల్గొన్నారు.

నిజామాబాద్ క్లాత్ షాప్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయం ప్రారంభం

నిజామాబాదు, నవంబరు 17

నిజామాబాద్ క్లాత్ షాప్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయానికి నిజామాబాద్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి శ్రీ హెచ్. నరసయ్య ప్రారంభోత్సవం చేశారు. నిజామాబాద్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, శ్రీ ముక్కా చంద్రశేఖరరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు.

శ్రీ కె. విఠల్ అధ్యక్షునిగా శ్రీ ఎస్. కె. కరీం ఉపాధ్యక్షునిగా శ్రీ జి. శ్రీశైలం ప్రధాన కార్యదర్శిగా శ్రీ టి. మాణిక్యం సహాయ కార్యదర్శిగా శ్రీ పి. జగన్నాధం కోశాధికారిగా ఎన్నికయ్యారు. శ్రీ డి.కాంతారావు వందన సమర్పణ చేశారు.

రష్యన్‌భాషా ప్రేమికుల అసోసియేషన్

హైదరాబాద్, నవంబర్ 22

రష్యన్ భాష ప్రేమికుల అసోసియేషన్ ప్రారంభోత్సవం ఇటీవల విదేశీ భాషల అధ్యయన కేంద్రి సంస్థ ఆడిటోరియంలో జరిగింది.

అనేక మంది హాజరైన యీ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ యం. సి. పాండే సభికులకు స్వాగతం చెబుతూఅసోసియేషన్ లక్ష్యాలను వివరించారు. రష్యను భాష తెలిసిన వారిని ఒకచోట చేర్చటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించటం, సభ్యులకు రష్యన్‌భాష బోధించటం అసోసియేషన్ లక్ష్యాలని చెప్పారు.

అసోసియేషన్ సలహాదారు డాక్టర్ వి.బి. మాక్సిమోవ్ మాట్లాడుతూ మానవజాతి పురోగమనానికి ప్రపంచంలోని వివిధజాతులు కలిసి పనిచేయవలసిన సమయం యిదేనన్నారు. ప్రజలందరు ఒక చోటకు చేరేందుకు ఏదో ఒక అంతర్జాతీయ భాష తెలుసుకోవటం అవసరమని చెప్పారు.

విదేశీ భాషల అధ్యయన సంస్థ డైరెక్టర్ శ్రీ రమేష్‌మోహన్ ప్రధాని అతిథిగా పాల్గొంటూ విదేశీ భాష అధ్యయనానికి అవసరమైన వాతావరణాన్ని ఇటువంటి అసోసియేషన్‌లు కల్పించాలన్నారు.

సభ అనంతరం రష్యన్, తెలుగు, హిందీలలో పాటలు పాడటంతోపాటు లెనిన్‌పై చిత్రాన్ని ప్రదర్శించారు. అసోసియేషన్ కార్యదర్శి శ్రీ బి. గాంధి వందన సమర్పణ చేశారు.

రాజేంద్రనగర ఉపాధ్యాయసంఘ కార్యవర్గ సమావేశం

హైదరాబాద్, నవంబరు 17

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాజేంద్రనగర్ సమితి కార్యవర్గ సమావేశం శ్రీ బి. ఎన్. రావు అధ్యక్షతన యీ నెల 14న జరిగింది.

శ్రీ వి. ప్రభాకరరావు (కార్యదర్శి) సమితి శాఖ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు.

సమితి శాఖ ఆధ్వర్యాన పత్రిక ప్రచురించుటకు, పాఠశాలల పనిదినాలు, వేళలు హెచ్చించుటవలనఉత్పన్నమైన సమస్యలను ప్రభుత్వదృష్టికి తెచ్చునిమిత్తం ఒక రోజు సదస్సు నిర్వహించుటకు కార్యవర్గం నిర్ణయించింది.

రాష్ట్రసంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్రీ ఎ. శ్యామసుందర్, శ్రీ యం. వి. రాంరెడ్డి జిల్లాశాఖ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీ జి. ఎస్. నరసింహారెడ్డి, శ్రీ ధన్‌పాల్ క్రిష్టి ప్రసంగించారు. శ్రీ వి. ప్రభాకరరావు వందన సమర్పణ చేశారు.

వ్యవసాయ కార్మికులకు వయోజన పాఠశాల

నల్గొండ, నవంబరు 17

నల్గొండ తాలూకా గుగ్గు గ్రామంలో హరిజన వ్యవసాయ కార్మికులకొరకు రాత్రి పాఠశాలను వ్యవసాయ కార్మికసంఘం ప్రారంభించింది.

ఈ సందర్భంగా జరిగిన సభకు శ్రీ జి. వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా, వ్యవసాయ కార్మికసంఘం అధ్యక్షులు శ్రీ కె. పాపిరెడ్డి ప్రారంభోత్సవం చేశారు.

సభలో స్థానిక నాయకులు శ్రీ మెట్టయ్య, శ్రీ యస్. వెంటయ్య, శ్రీ రాంరెడ్డి, రామయ్య, యెల్లయ్యలు సందేశాలిచ్చారు.

'లోహపు బట్టీల'లావున్న హరిజన గృహాలు

మద్రాసు, నవంబరు 23

తమిళనాడు హరిజన గృహనిర్మాణాభివృద్ధి కార్పొరేషన్ హరిజనుల నిమిత్తం నిర్మించిన గృహాలు "లోహాలను కరగించే చిన్న బట్టీల"ల లాగ వున్నాయని రాష్ట్ర గవర్నరు సలహాదారుడు శ్రీ పి కె. దావే అభివర్ణించారు.

ఈ గృహాలలో వేడి చేసుకొనేందుకు అవసరమగు పరికరాలను అమర్చి, విద్యుదీకరణ చేసినట్లయితే గొర్రె మాంసాన్ని వేయించుకొనేందుకు ఇళ్ళు అనువుగా వున్నాయని ని అన్నారు. వర్షాకాలంలో "షవరబాత్" చేయవచ్చునని తనకు తెలియజేశారని అన్నారు.

మద్రాసు ప్రాంతం టౌన్‌ప్లానర్స్ సంస్థ రజతోత్సవాలకు ప్రారంభోత్సవం చేస్తూ ఆయన పై విధంగా అన్నారు.

హరిజనులు పనిచేసేప్రాంతాలకుదూరంగా నిర్మించిన ఈ గృహాలను తాను చూడావని చెప్పారు.

ఈ పరిస్థితికి పరిపాలనా యంత్రాంగాన్ని, ఇంజనీర్లను, పథకాలను రూపొందించిన వారిని, రాజకీయ నాయకులను నిందించవలసి వుందని చెప్పారు. ఈలా వుండగా నిర్ణయాలు చేయడం, ఒకటి రెండు రోజులల్లో పథకాలను సిద్ధంచేయాలని నిపుణులను కోరడం తరువాత ఇళ్ళ నిర్మాణానికి వుత్తర్వులు జారీచేయడం ఇందుకు కారణమని అన్నారు. ఈ ఇళ్ళు నివాసయోగ్యంగా లేవని అన్నారు.

నీలగిరి కొండలలోని గిరిజనులకు, మద్రాసులోని మత్స్యకారులకు నిర్మించిన ఇళ్ళ పరిస్థితి వేరుగా లేదని అన్నారు. ఈఇళ్ళను తాను చూచినపుడు అక్కడి గిరిజనులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను తనకు వివరించారని అన్నారు.

కరుణానిధిపై గోధుమ అమ్మకాల కుంభకోణం కేసు

విచారణ 30వ తేదీకి వాయిదా

మద్రాసు, నవంబరు 23

1974 లో జరిగిన గోధుమ అమ్మకాల కుంభకోణంలో లంచం తీసుకోవటం పోర్జరి,చేయటానికి సంబంధించి తమిళనాడు మాజి ముఖ్యమంత్రి శ్రీ కరుణానిధిపై సి. బి. ఐ. నమోదుచేసిన కేసు విచారణను స్పెషల్ జడ్జి శ్రీ యస్. స్వామికన్ను నవంబరు 30వ తేదీకి నేడు వాయిదావేశారు.

కేసుకు సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించేందుకు ముద్దాయిల తరపు న్యాయవాదికి ఒక వారం రోజుల వ్యవధినిస్తూ విచారణను తిరిగి వాయిదావేసే సమస్యేలేదని న్యాయమూర్తి స్పష్టీకరించారు,

కోర్టులో నేడు శ్రీ కరుణానిధి హాజరయ్యారు,

కోర్టులో నేడు కేసువిచారణను ప్రారంభించిన వెంటనే ముద్దాయిల తరపు న్యాయవాది శ్రీ కె. రంగస్వామి డాక్యుమెంట్లు చాలా పెద్దవైనందుకు వాటిని సమగ్రంగా పరిశీలించేందుకు మరో రెండు వారాల వ్యవధినివ్వవలసిందిగా కోరారు,

కేసు ప్రాథమిక దశలోనే వుండగా ఇంత వ్యవధి ఎందుకు కోరుతున్నారో అర్థం కావటం లేదని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది యన్. టి. వానమామలై చెప్పారు.

ఇద్దరు బాలల మృతి

హైదరాబాదు, నవంబరు 22

శ్రీకాకుళంజిల్లా ఎల్విన్‌పేట ప్రాంతంలో రాత్రిపూట చిరుతపులి సంచరిస్తూ యిద్దరు పిల్లలను చంపివేసింది.

గత సోమవారం రాత్రి ఒకఅమ్మాయిని, శనివారం రాత్రి 9 సంవత్సరాల ఒక బాలుడ్ని చిరుతపులి చంపినట్లు నేడు ఇక్కడికి అందిన పోలీసు సమాచారంవల్ల తెలియవచ్చింది.

తిరుమలాయ పాలెం ఉపాధ్యాయ సంఘ సమావేశం

తిరుమలాయపాలెం, నవంబరు 19

ఖమ్మంజిల్లా తిరుమలాయపాలెం పంచాయత్‌రాజ్ ఉపాధ్యాయుల సంఘ సమావేశం బీక్కు చెర్వునందు ఈ నెల 7వ తేదీన శ్రీ యం. నాగభూషణం అధ్యక్షతన జరిగింది.

హైద్రాబాద్‌జిల్లా శాఖ, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఖమ్మంజిల్లా శాఖ ప్రతినిధులు సమితి ఉపాధ్యాయులు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

కార్యదర్శి శ్రీ జి. సత్యం నివేదికను సమర్పించారు.

శ్రీ సి. హెచ్. లక్ష్మీనర్సింహాచారి, శ్రీ రామకిషన్‌రావు, శ్రీ ఎస్. ఎస్. ప్రసాదరావు, శ్రీ కె. నారాయణ ప్రసంగించారు.

శ్రీ ఎస్. వెంకటేశ్వర్రావు వందన సమర్పణ చేశారు.

కె. కె. పాయ్‌కి జె. సి. అవార్డు

బెంగుళూరు, నవంబరు 24

సిండికేట్ బ్యాంకు ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కె. కె. పాయ్‌కు 976 జె.సి. అంతర్జాతీయవిశిష్టసేవల అవార్డును మిస్సోరిలోని సెంట్‌లూయిస్‌లో జరిగిన ప్రపంచ జె. సి. మహాసభ ప్రకటించింది.

అంతర్ రాష్ట్ర సరకుల వాహనాల పర్మిట్లపై ఒప్పందం

మద్రాసు, నవంబరు 23

ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేంద్ర పాలిత ప్రాంతాలైన పుదుచ్చేరి, గోవాలమధ్య నడిచే రవాణా వాహనాలకు సంబంధించిన ఒప్పందం 1978 మార్చి 31 వరకు పొడిగించబడుతుంది.

1975 జూలై ఒకటవ తేదీనుండి అమలులోకి వచ్చిన ప్రస్తుత ఒప్పందం 1976 డిసెంబర్ 31తో ముగుస్తుంది,

తమిళనాడు ప్రభుత్వం ఈ చిత్తు ఒప్పందాన్ని అసాధారణ గజిట్‌లో ప్రకటించింది,

ఈ ఒప్పందం ప్రకారం 5 రాష్ట్రాలు 500కు మించకుండా అంతర్‌రాష్ట్ర పర్మిట్లు జారీచేయుటకు, పుదుచ్చేరి, గోవాలు 120 పర్మిట్లు జారీ చేయుటకు అంగీకరించాయని తెలపబడింది,

చిన్న తరహా పరిశ్రమల సందర్శన

యూత్ కాంగ్రెస్ సదస్సుకు హాజరైన విదేశీ ప్రతినిధులచే

న్యూఢిల్లీ, నవంబరు 23

గౌహతిలో జరిగిన యూత్ కాంగ్రెసు జాతీయ సదస్సుకు హాజరైన విదేశీ ప్రతినిధులు నేడు ఢిల్లీలోనూ, ఆ పరిసర ప్రాంతాలలోనూ గల చిన్న తరహా పరిశ్రమలను సందర్శించారు.

భారత పారిశ్రామికవేత్తలు సాధించిన పురోగతి తమను ముగ్ధుల్ని చేసిందని వారు చెప్పారు. ఫరిదాబాద్‌లో గల కొన్ని పారిశ్రామిక యూనిట్లనుకూడా వారు సందర్శించారు.

మొత్తం 60 మంది ప్రతినిధులకు ఒక్కొక్కటి చొప్పున ఢిల్లీలో తయారు చేయబడిన గ్రిక్‌బ్రాండ్ ఎలక్ట్రానిక్ కాలకులేటర్లను ఢిల్లీ పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషన్ బహూకరించింది.

మద్రాసు సోవియట్ కాన్సల్ జనరల్‌కు సన్మానం

కోజికోడ్, నవంబర్ 22

భారత, సోవియట్ సాంస్కృతిక సంఘం కాలికట్ శాఖ నేడిక్కడ మద్రాసులోని సోవియట్ కాన్సల్ జనరల్ వి. బి. కిషిరేవ్, కాన్సల్ కార్యాలయంలో సమాచారశాఖ అధిపతి బోరొకిన్‌లను సన్మానించింది.

అనేక అంతర్జాతీయ సమస్యలపై భారత్ సోవియట్ యూనియన్‌లు ఒకేరకమైన అభిప్రాయాలను కలిగి వున్నాయి. ప్రపంచంలో ఎక్కడ జరిగినా విముక్తి ఉద్యమాలకు రెండు దేశాలు మద్దతునిస్తున్నాయని సన్మానానికి సమాధానమిస్తూ కిషిరేవ్ అన్నారు.

భారత-సోవియట్ మైత్రి ఒప్పందాన్ని శ్లాఘిస్తూ, ప్రధాని శ్రీమతి గాంధీ ఇటీవల జరిపిన సోవియట్ పర్యటన మైత్రి ఒప్పందానికి పూతం యివ్వడమేకాక, ప్రపంచ శాంతికి కూడా దోహదం చేసిందని అయన్నారు.

55 సీసాల రక్తదానం

చిలకలూరిపేట సి. ఆర్. కాలేజీ విద్యార్థులచే

చిలకలూరిపేట, నవంబర్ 23

గుంటూరు బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జ్ డాక్టర్ సంతోష్‌కుమార్, చిలకలూరిపేట, సి. ఆర్. కళాశాల యన్. సి. సి లెఫ్టినెంట్ శ్రీ యస్. బి. రెడ్డి ఆధ్వర్యమున 30 మంది యన్.సి.సి క్యాడెట్లు, మరియు 15 మంది ఇతర విద్యార్థులు, 8 మంది విద్యార్థినులు కలిసి 55 సీసాల రక్తాన్ని గుంటూరుబ్లడ్‌బ్యాంక్‌కు నిధిగా యిచ్చారు (వి. వి)

ట్రాక్టర్ ప్రమాదంలో ముగ్గురు మృతి

హైదరాబాద్, నవంబర్ 22

కరీంనగర్‌జిల్లా రంగంపేట అడవులనుండి అక్రమంగా టేకు దూలాలను చేరవేస్తున్న ట్రాక్టర్ బోల్తాపడి ముగ్గురు వ్యక్తులు మరణించారు. మరో నలుగురికి గాయాలు తగిలాయి.

కొనపూర్ గ్రామానికి చెందిన పదిమంది బుధవారం నాడు శ్రీ వి. రామమోహన్‌రావు ఆధ్వర్యాన రిజిస్టర్ చేయని ఒక కొత్త ట్రాక్టర్‌తో రంగంపేట అడవుల నుండి దొంగతనంగా, వేగంగా టేకు దూలాలను చేరవేస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది.

తెల్లవారుజామున దూలాలతో బయలుదేరిన ట్రాక్టర్‌ను ఇద్దరు ఫారెస్టు కావలాదారులు కనిపెట్టిన సందర్భంగా ట్రాక్టర్‌ను వేగంగా నడుపుటకు ప్రయత్నించారు.

ప్రమాదంలో శ్రీ వి. రామమోహనరావు, శ్రీ శ్రీనేని నరసయ్య, శ్రీ బనావత పాండు టేకు దూలాల క్రిందపడి నలిగిపోయారు. డ్రైవర్‌తో సహా మరో ఇద్దరికి గాయాలు తగిలాయి.

జూనియర్ కాలేజీ టీచర్లకు యు. జి. సి. స్కేళ్ళు వర్తింపుకై విజ్ఞప్తి

హైదరాబాదు, నవంబరు 22

జూనియర్ కాలేజీల్లో పనిచేసే జూనియర్ లెక్చరర్లకు కూడా యు.జి.సి. వేతనాలను వర్తింపచేయాలని జూనియర్ కాలేజి లెక్చరర్ల సోసియేషన్ అధ్యక్షులు శ్రీ టి. లోకేశ్వరరావు నేడొక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

డిగ్రీ కాలేజీల్లో పని చేసే 1286 జూనియర్ లెక్చరర్లకు యు. జి. సి. వేతనాలు వర్తింపచేస్తూ, అదే అర్హతలతో, బాధ్యతలు నిర్వహిస్తున్న జూనియర్ కాలేజి లెక్చరర్లకు యు. జి. సి వేతనాలు వర్తింపచేయకపోవడం జరిగిందని ఆయన తెలిపారు.

కేరళలో ఇల్మనేట్ ఖనిజ వనరులు

రాంచి, నవంబరు 23

కేరళలోని థావరబీచ్‌లోని ఇసుకలోవున్న ఇల్మెనైట్ ఖనిజ నిక్షేపాలలో టిటానియం డయాక్సైడ్ పిగ్‌మెంట్ వుత్పత్తికి అవసరమైన టిటానియం డయాక్సైడ్‌అత్యధికశాతం వుందని సమాచార్ విలేకరితెలియజేస్తున్నారు.

కేరళలోని క్విలన్ జిల్లాలోని ఒక పెద్ద టిటానియం డయాక్సైడ్ కర్మాగారాన్ని నెలకొల్పడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చే విదేశీ సహకార పారిశ్రామిక వేత్తల విదేశాలలో జరిపిన పరీక్షలలో ఈ విషయం వెల్లడైంది,

సమగ్ర టిటానియం, ధనిక, రసాయన కాంప్లెక్‌లో భాగంగా క్విలన్‌పల్లి కరునాగపల్లి తాలూకాలో సంకరామంగళంలో ఒక టిటానియం డయాక్సైడ్ పిగ్ మెంట్ కర్మాగారాన్ని నిర్మించాలన్న కేరళ ఖనిజాలు, లోహాల ,కార్పొరేషన్ (రాష్ట్ర ప్రభుత్వ సంస్థ) తీసుకున్న నిర్ణయాన్ననుసరించి ఈ పరీక్షలు జరిపారు.

పిగ్‌మెంట్ వుత్పత్తికి సల్ఫేటు శుద్ధి చేయడానికి ఈ కర్మాగారం ఒక ఆధునిక క్లోరైడ్ రూట్‌ను నెలకొల్పుతోంది.

చావర ఇల్‌మెంట్ ఖనిజ నిక్షేపాలలో కనీసం 92 శాతం టిటానియం డయాక్సైడ్ వుందని దీనివల్ల వుత్పత్తి సాధనలో పరిశోధనలో తేలింది. అయితే ఇల్‌మెంట్‌ను ఇంకా పరీక్షలు చేయవలసి వుంది.

కేరళ ఖనిజ, లోహాల కార్పొరేషన్‌కు ఏజంట్లు కన్సల్టెన్సీగా నియమించబడిన ప్రభుత్వరంగ మెటలర్జికల్ ఇంజనీరింగ్ కన్సల్టెక్స్ తమ ప్రాజెక్టు నివేదికను యిటీవలనే ఈ కార్పొరేషన్ ఆమోదించింది. అనంతరం అమెరికాలోని కర్మాగారాలలో జరిగిన పరీక్షలలో మెటలర్జికల్ ఇంజనీరింగ్ నిపుణులు పాల్గొన్నారు.

రేడియో లైసెన్సుల పునరుద్ధరణకు గడువు

హైద్రాబాదు, నవంబర్ 23

తంతి తపాలా శాఖ చేసిన రేడియో లైసెన్సుల గడువు డిసెంబర్ 31 తోముగుస్తుంది. ఈ లైసెన్సులను 1977 జనవరి 31 లోగా పునరుద్ధరించుకోవాల్సివుంది.

రేడియో లైసెన్సుల పునరుద్ధరణకు గాను నవంబర్ ఒకటో తేదీ నుండి అన్ని పోస్టాఫీసుల్లో ప్రత్యేక ఏర్పాటు చేయబడ్డాయి.

అధికారయుతంగా లైసెన్సులు రద్దు చేయకపోతే తప్పనిసరిగా లైసెన్సులు పునరుద్ధరించుకోవాలి.

రేడియోలు, ట్రాన్సిస్టర్లు, టి. వి. సెట్‌లు పోయినా, దొంగిలించబడినా, లేక పనికి రాకుండాపోయినా వాటి పోస్టాఫీసు రిజిస్ట్రేషన్ రద్దు చేయించు కోవాల్సి వుంటుంది.

సరైన లైసెన్సు లేకుండా రేడియోలు, ట్రాన్సిస్టర్లు టీవిసెట్లు కలిగివుండటం నేరం క్రింద పరిగణించబడుతుంది.

నేపాల్ రాజు తిరిగి ఖాట్మండు రాక

ఖాట్మండు, నవంబర్ 24

సోవియట్ యూనియన్‌లో వారంరోజులు అధికార పర్యటన జరిపిన అనంతరం నేపాల్‌రాజు బీరేంద్ర నిన్న మధ్యాహ్నం యిక్కడకు తిరిగివచ్చారు.

రాజు బీరేంద్ర వెంట విదేశాంగమంత్రి కృష్ణరాజ్ ఆర్యల్‌కూడా వున్నారు. తమ పర్యటన విజయవంతమయిందని ఆర్యల్ చెప్పారు. ఆసియా భద్రతా పథకాన్ని గురించి సోవియట్ చర్చించిందా అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ అన్ని విషయాలు చర్చించాం అన్నారు.

ఈ విషయంలో నేపాల్ వైఖరిగురించి ప్రశ్నించగా నేపాల్ వైఖరి అందరికీ తెలిసిందేనన్నారు. అంతకుమించి ఆర్యల్ వివరించలేదు.

తుపాన్‌కు, వర్షాభావానికి తట్టుకొనే వరి, చెరకు, ప్రత్తి వంగడాలు

రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంచే

[విశాలాంధ్ర విలేకరి]

హైదరాబాద్, నవంబరు 22

కృష్ణా, గోదావరి డెల్టా భూములలోను, రాయలసీమలోను, అటు తుపాన్‌లు, ఇటు వర్షాభావాలు ఏర్పడినా తట్టుకోగల సరికొత్త వరి, చెరకు, ప్రత్తి వంగడాలను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా విభాగం రూపొందించింది

ఈ విషయాన్ని వైస్-ఛాన్సలర్ డాక్టర్ సి.వి.కృష్ణారావు, పరిశోధన విభాగం డైరెక్టరి డాక్టర్ అప్పారావులు నేడిక్కడ జరిగిన పత్రికా గోష్టిలో వెల్లడించారు.

ఈ సంవత్సరం అనేక నూతన వరి, చెరకు వంగడాలను విశ్వవిద్యాలయం పరిశోధనశాఖ రూపొందించి విడుదల చేసినట్లు శ్రీ కృష్ణారావు తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తిలో అద్భుతమైన ఫలితాలు సాధించడంలో కొత్త వంగడాలు కీలక పాత్ర వహించగలవని ఆయన అన్నారు.

ఈసారి రూపొందించిన వంగడాలలో గౌతమి, వశిష్ట ముఖ్యమైనవి. ఇవి అధిక దిగుబడిని ఇచ్చేదీర్ఘ కాలిక పంట వంగడాలు

ఆలస్యంగా వర్షాలు పడినప్పటికీ, తుపాన్‌లు వచ్చినప్పటికీ ఇవి తట్టుకోగలవు. సెప్టెంబర్, అక్టోబర్‌లలో వర్షాలు ప్రారంభమైనా ఇబ్బంది వుండదు. నవంబరు 10 దాటాక వర్షాలు తగ్గాక కోతలకు వస్తాయి.

అనేక స్వల్పకాలిక వంగడాలను ఇది వరకు రూపొందించినప్పటికి, కృష్ణ, గోదావరి డెల్టాలలో కోతకు ఎక్కువ కాలం పట్టే వరి విత్తనాలనే రైతులు ఎన్నుకుంటున్నారు. ఈ దృష్ట్యా పంటకు ఎక్కువకాలం పట్టే విత్తనాలను అన్ని రకాల అననుకూల వాతావరణాలకు తట్టుకోగల వాటిని పశ్చిమ గోదావరి జిల్లా మారుటేరులోని తమ పరిశోధనా కేంద్రం రూపొందించినట్లు డాక్టర్ అప్పారావు చెప్పారు.

గౌతమి, వశిష్ట రకాలు హెక్టార్‌కు ఐదు వేల నుండి ఆరు వేల కె. జి. ల ఫలసాయం ఇస్తాయని తేలింది. వరిలో రూపొందించిన ఇతర కొత్త వంగడాలు ప్రభాత్, సురేక,రాజేంద్ర.ఇందులో ప్రభాత్‌వంగడాలు మెట్టప్రాంతాలలోను, బావులక్రింద సాగుకు ఎంతో అనుకూలమైనవి. 135 రోజులలో ఇవి కోతకు వస్తాయి. గౌతమి, వశిష్టలు 160 రోజులలో కోతకు వస్తాయి. సురేక వంగడాన్నివరంగల్‌లోని పరిశోధనా కేంద్రం రూపొందించింది.

ఇవి మధ్యతరహాకాలపువంట, 135నుండి 140 రోజులలో కోతకు వస్తాయి.

ఆగస్టు మొదటి వారంలో వేయవచ్చు. అంటే ఆలస్యం జరిగినా పర్వాలేదు. వీటికి ఎక్కువగా నీరు నిలవ వుండకూడదు.

ఎరువులను బాగా పీల్చుకుంటాయి.

ఈ సురేకను ఇండొనీసియాలో కూడా ప్రయోగించి చూడగా మంచి ఫలితాలు వచ్చాయి. భారతదేశమంతటా వీటిని వినియోగించ వచ్చని డాక్టర్ అప్పారావు చెప్పారు.

రాజేంద్ర అనే మరో రకం వంగడం వర్షాధార పంటలకు ఎంతో ఉపయోగకరమయింది.

మధ్యకాలపువంట. బహూకార్థక పంటల క్రిందకూడా వెయ్యవచ్చు ప్రస్తుతంవస్తున్న తెల్లహంస కన్నా మెరుగైంది. వర్షాధార పొలాలు, నీటి సదుపాయంగల మెట్ట పంటలకు యిది ఎంతో వుపయోగకరం.

వ్యవసాయ విశ్వవిద్యాలయం యీ ఏడు రూపొందించిన కొత్త వంగడాలలో "శ్రీశైలం" ప్రత్తి వంగడం ముఖ్యమైంది. ఇది ముఖ్యంగా రాయలసీమకు అందులోను కర్నూలు ప్రాంతంలోను ఎంతో వుపయోగకరం.

వర్షపాతం ఎక్కువగావున్నా లేక వర్షాభావం ఏర్పడినా యివి తట్టుకోగలవు. ఆరు నెలలలో పంట చేతికివస్తుంది. ఈ పరిశోధనా విభాగం చెరకులో రెండు కొత్తరకం వంగడాలను రూపొందించింది.

చెరకు పండించే రైతులకు "రెడ్ రాట్ పెస్టు" ఒక పెద్ద గండం. ఈ తెగులుకు ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క పేరు వుంది. గోదావరి జిల్లాలో ఎర్ర ఆకు తెగులు అంటారు. విశ్వవిద్యాలయం రూపొందించిన కోవా 7601, కోవా 7602 అనే రెండు వంగడాలు యీ తెగులను తట్టుకోగలవని భావిస్తున్నారు.

ఇందులో కోవా - 7601 వంగడంవేసిన పంట నవంబరు, జనవరిలలో ఫ్యాక్టరీలకు తోలడం మంచిది. ఇవి ఎక్కువ, రసాన్నిస్తాయి. స్థిరమయిన / నీటిపారుదల సౌకర్యం వుండాలి. ప్రస్తుతంవేస్తున్న చెరకుకన్నా ఇవి హెక్టారుకు 3.23 టన్నుల హెచ్చు బెల్లాన్ని, 3 57టన్నుల హెచ్చు చెరకుకు ఇవ్వగలదని శాస్త్రజ్ఞుల భావన.

కోవా - 7602 రకంలకు మాత్రం నీరు నిలవ ఉండకూడదు.

ఇవిగాక ఈ విశ్వ విద్యాలయం బాలాజి, నాగార్జున, విశాఖ అనే "బజ్రా" వంగడాలను రూపొందించింది. శనగపప్పులో "జ్యోతి" అనే రకాన్ని రూపొందించింది.

అలాగే "మంజీర" అనే పొద్దు తిరుగుడు పువ్వు రకాన్ని,లక్ష్మి అనే రకాన్ని కూడా రూపొందించినట్లు డాక్టర్ అప్పారావు వివరించారు.

ఆంధ్రా యూనివర్సిటీ సెనెట్ సమావేశం

డిసెంబర్ 31 వ తేదీన

విశాఖపట్నం, నవంబరు 22

ఆంధ్రా యూనివర్సిటీ సెనెట్ సమావేశం డిసెంబరు 31 వ తేదీ ఉదయం 10 గంటలకు వాల్తేర్‌లోని యూనివర్సిటీ ఆవరణలో టి. ఎల్. ఎన్. సభలో జరుగుతుంది.

అకడమిక్ కౌన్సిల్

ఆంధ్రా యూనివర్సిటీ అకడమిక్ కౌన్సిల్ సమావేశం డిసెంబర్ 30 వ తేదీ ఉదయం 10 గంటలకు వాల్తేరులో యూనివర్సిటీ ఆవరణలోని టి. ఎల్. ఎన్. సభలో జరుగుతుంది.

సోవియట్ మంత్రి మద్రాసు రాక

మద్రాసు, నవంబరు 22

నగరంలో రెండు రోజుల పాటు పర్యటించేందుకు గానూ సోవియట్ ప్రమాణీకరణ శాఖ మంత్రి ప్రొఫెసర్ వి. వి. బొయిట్‌సెవ్ బెంగుళూరు నుండి నేడిక్కడకు వచ్చారు.

తమిళనాడు గవర్నర్ సలహాదారు శ్రీ పి. కె. దావే, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ వి. కార్తికేయన్, మద్రాసులోని సోవియట్ కాన్సల్ తరసోవ్,మద్రాసు ఐ. యస్. ఐ. డైరెక్టర్ శ్రీ యస్. సుబ్రహ్మణ్యం విమానాశ్రయంలో ఆయనకు స్వాగతం పలికారు.

అప్లయిడ్ సైన్స్, సాంకేతిక రంగంలో భారత్, సోవియట్‌ల ద్వైపాక్షిక సహకార ఒప్పందంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆహ్వానంపై ఆయన భారత్‌లో పర్యటిస్తున్నారు.

బెంగుళూరులోని హిందుస్థాన్ మెషిన్ టూల్స్, హెచ్.యం.టి. వాచ్ ఫ్యాక్టరీలలోని కార్మికులు ఉన్నత సాంకేతిక స్థాయిని కలిగివుండటం, ఉన్నతస్థాయిలో ఉత్పత్తిని కొనసాగించటంలో తనను ముగ్ధుణ్ని చేసిందని విమానాశ్రయంలో బొయిట్‌సెవ్ పత్రికల వారితో అన్నారు.

ఫోర్డ్- కార్టర్ భేటీ

వాషింగ్టన్, నవంబర్ 23

అమెరికా అధ్యక్షులుగా ఎన్నికైన జిమ్మి కార్టర్, అధ్యక్షులు ఫోర్డుతో నిన్న వైట్ హౌస్‌లో చర్చలు జరిపారు అమెరికా అధ్యక్షులుగా కార్టర్ ఎన్నికైన తరువాత ఆయన వాషింగ్టన్‌ను సందర్శించడం యిదే ప్రథమం.

చర్చల అనంతరం కార్టర్ విలేకరులతో మాట్లాడుతూ కమ్యూనిస్టేతర పారిశ్రామిక దేశాల తృతీయ ఆర్థిక శిఖరాగ్ర సమావేశం కొంతమంది విదేశీ నాయకులను కలుసుకొనేందుకు తనకు అవకాశం కల్పించగలదని అన్నారు.

నాటో దేశాల మంత్రులను, వివిధదేశాల అధిపతులను కలుసుకోవడం మంచిదని, లాభదాయకమని చర్చల సందర్భంగా ఫోర్డు జిమ్మి కార్టర్‌కు తెలియజేశారని తెలుస్తున్నది.

ఐవర్ రిచర్డ్ జెనీవా తిరిగి రాక

జెనీవా, నవంబరు 23

లండన్‌లో బ్రిటన్ మంత్రులతో సంప్రదింపులు జరిపిన అనంతరం రొడీషియాపై జెనీవా మహాసభ అధ్యక్షుడు ఐవర్ రిచర్డ్ నిన్న తిరిగి జెనీవా చేరుకున్నారు. మహాసభ చర్చలలో బ్రిటన్ నుండి ఎలాంటి నూతన ప్రతిపాదనలు లేవని ఆయన చెప్పారు.

రొడీషియాకు చట్టబద్ధమైన స్వాతంత్ర్యాన్నిచ్చే సమస్యపై ప్రతిష్టంభనను అక్కడ జనరల్ ఎన్నికలకు ఒక తేదీనినిర్ణయించడం ద్వారా అధిగమించ వచ్చునని రిచర్డ్ సూచనప్రాయంగా తెలిపారు

రొడీషియాకు స్వాతంత్ర్యాన్నిచ్చే తేదీ 1978 మార్చి 1లోగా వుండాలని, ఆ తేదీ నాటికి ఎన్నికలతోసహా స్వాతంత్ర్యానిచ్చే ముందు జరగవలసిన రాజ్యాంగ చర్యలు పూర్తి కావాలని బ్రిటన్ ప్రతిపాదించింది.

అయితే రాజ్యాంగ పరమైన చర్యలు పూర్తయినా కాకపోయినా ఒక తేదీని నిర్ణయించాలని జాతీయవాద నాయకులు రాబరు ముగాన్, జాషువా కోమోలు బ్రిటన్‌పై ఒత్తిడి చేస్తున్నారు.

రిచర్డ్ లండన్‌నుండి తిరిగి రావడానికి ముందు కొన్ని పత్రికలవారితో మాట్లాడుతూ 1978 మార్చి 1 లోగా చట్టబద్ధమైన స్వాతంత్ర్యాన్నివ్వాలని తాను, ముగాబే బ్రిటన్‌ను కోరుతున్నట్లు ప్రకటించారు.

వచ్చే కొద్ది రోజులలో చర్చలు సంక్లిష్టమైన స్థితికి చేరుకోవచ్చునని, ఎలాంటి పరిష్కారం సాధ్యంకాకపోతే మహాసభను రిచర్డ్ మరికొంతకాలం వాయిదా వేయవచ్చునని అంతకుముందు మహాసభవర్గాలు తెలిపాయి.

1978 మార్చి 1 లోగా స్వాతంత్ర్యాన్నిచ్చే ముందు జరపాల్సిన రాజ్యాంగ పరమైన చర్యలు ఎందుకు పూర్తిచేయరాదన్న అభిప్రాయంతో బ్రిటన్ వుందని రిచర్డ్ చెప్పారు.

గౌహతి నవంబర్ 22

ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ఇక్కడకు సమీపాన గల కామాఖ్య దేవాలయాన్ని సందర్శించారు.

ఏడు నిమిషాల్లో ఎనిమిది రాష్ట్రాల ప్రయాణం

జవహర్‌నగర్, నవంబరు 22

ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో కేవలం ఏడు నిమిషాల్లో ప్రయాణం సాధ్యమౌతుందా ?

ఇది అసాధ్యమే. కాని ఈశాన్య సరిహద్దు రైల్వే దీనిని సాధ్యం చేసి చూసింది

"ప్రగతి మెయిల్" మరియు "జవహర్ ఎక్స్‌ప్రెస్"ల అనే రెండు చిన్న రైళ్ళను యిక్కడి ఎగ్జిబిషన్‌లో ఈశాన్య సరిహద్దు రైల్వే ప్రవేశపెట్టింది. ఈ రైళ్ళ ఎగ్జిబిషన్‌లో ఎనిమిదిచోట్ల నిలుస్తాయి పై స్టేషన్లకు ఎ. ఐ. సి. సి. కి ఆతిధ్యమిచ్చిన రాష్ట్రాలైన అస్సాం, మేఘాలయ, మణిపూర్, త్రిపుర, నాగాలాండ్, సిక్కిం, మిజోరామ్ మరియు అరుణాచల్ ప్రదేశ్ అని పేర్లుపెట్టారు. ఈ స్టేషన్లన్నిటినీ ఏడు నిమిషాల్లో ఈ రైళ్ళు అధిగమించాయి.

ఆంధ్రాయూనివర్శిటీ

వాల్తేరు, నవంబరు 23

1976 సెప్టెంబరు నెలలో నిర్వహించబడిన బి. కామ్. (యం. ఆర్.) మూడవ సంవత్సరాంతము పరీక్ష ఫలితములు ఈ దిగువ నీయబడినవి.

ఫస్టుక్లాస్ : లేరు.
సెకండ్ క్లాసు : లేరు.
థర్డు క్లాసు : 449
మొత్తం పరీక్షలో : 292

బ్యాంకింగ్ ప్రిన్సిపల్స్ అండ్ ప్రాక్టీస్: 28 30 35 37 42 66 68 92 94 135 40 51 55 69 79 81 82 90 96 242 43 53 67 68 69 85 333 78 97 440 43 67 82 82ఎ 85 92 500 03 07 12 47 49 51 63 7 63 9 72 81 82 87 96 600 04 06 10 58 59 67

బిజినెస్ స్టాటిస్టిక్స్ : 81 90 96 248 64 65 89 334 61 9 98 444 57 81 92 504 09 12 49 87 600 05 58 59 67

మర్కంటైల్ లా : 1 30 47 71 129 32 52 58 74 81 96 244 73 332 37 41 69 78 85 92 406 07 09 18 20 82ఎ 94 503 06 12 18 78 83 653 72.

అడ్వాన్సు అకౌంటింగ్ : 3 39 186 42 44 48 61 63 70 74 83 90 254 66 78 86 331 43 69 97 418 85 93 96 97 98 505 09 10 13 54 61 84 606 07 11 58 67 72 73 75.

ఆడిటింగ్ ; 3 23 42 67 142 64 74 78 87 96 248 50 67 72 369 402 12 67 548 49ఎ 50 79 82 87 94 96 605 06 72.

ఎలక్టివ్ సబ్జక్టు: 13 42 46 85 86 87 91 154 74 75 96 237 42 50 53 67 341 65 78 79 81 82 457ఎ 67 88 89 92 506 63 69 94 602 10 16 65 74

130ఎ, 143ఎ మరియు 678 నెంబర్ల ఫలితాలు తర్వాత ప్రకటించబడును.

573 నెంబరు ఫలితం నిలిపివేయుట మైనది.

అభ్యర్థులు తమఅప్లికేషన్స్‌లోపేర్కొన్న అడ్రసుల ప్రకారం మార్కుల లిస్టు పోస్టు ద్వారా పంపబడును.

1977 మార్చిలో జరిగే పరీక్షకు ఫీజు చెల్లించవలసిన ఆఖరు తేది 15-12.76.

జపాన్ లో చైనా అణు మేఘం

టోకియో, నవంబరు 21

గత బుధవారం చైనా జరిపిన హైడ్రోజన్ బాంబు ప్రయోగం సందర్భంగా వెలువడిన అణు ధార్మిక మేఘం మధ్య జపాన్‌కు ప్రయాణించిందని జపాన్ శాస్త్రీయ, సాంకేతిక అధికారులు వెల్లడించారు.

మొన్న శుక్రవారం ఉదయంనుండి శనివారం ఉదయంలోగా అంటే సరిగ్గా 24 గంటల సమయంలో ఒక చదరపు కిలోమీటరులో 1 85 మిలిక్యూరీల అణుధార్మిక శక్తి మధ్య జపాన్‌లో కనుగొనబడింది.

వర్థమాన దేశాల ప్రచార సాధనాలకు ఐరాస సాయం

నైరోబీ, నవంబరు 22

వర్థమాన దేశాలు ప్రచార సాధనాలను నిర్వహించుకునేందుకు ప్రత్యేక ఆర్థిక సాయం అందించాలని ఐరాసను యునెస్కో మహాసభ నేడిక్కడ కోరింది.

19 తృతీయ ప్రపంచ దేశాలు ప్రతిపాదించిన ఈతీర్మానాన్ని మొత్తం 73 దేశాలు బలపరచగా వ్యతిరేకంగా ఒక్కదేశం గూడా ఓటు చేయలేదు. కేవలం 3 దేశాలు గైరుహాజరయ్యాయి.

చర్చలో భిన్నాభిప్రాయాలు ప్రకటించిన అమెరికా, సోవియట్‌లు తీర్మానాన్ని బలపరిచాయి.

యునెస్కో యూరప్ ప్రాంత బృందంలో ఇజ్రాయిల్‌కు నేడు సభ్యత్వం ఇచ్చారు.

యూరప్ బృందంలోని మెజారిటీసభ్యులు ఇజ్రాయిల్ సభ్యత్వాన్ని బలపరిచారు.



అమెరికా అమ్మాయి

* * *

ఈరోజు రాత్రి (24-11-76) గం.9-30 ని॥లకు

'అమెరికా అమ్మాయి' చిత్రంలోని పాటలు

వివిధ భారతిలో

శ్రీ శ్రీధర్ & శ్రీ రంగనాథ్‌ల వ్యాఖ్యానంతో

ప్రత్యేక రేడియో కార్యక్రమం వినండి.



బాలాజీగ్రూప్

సభ్యత్వ నమోదు కొరకు రు. 23/- లు యం. ఓ. పోస్టలు ఆర్డరు, ఏ బ్యాంక్‌దైనా డిమాండ్ డ్రాఫ్ట్, నగదు, లోకల్ మార్పిడీలు ద్వారా పంపండి.

ఈ అత్యద్భుతమైన అవకాశాన్ని జారవిడువకండి.

నేడే చేరండి - త్వరపడండి

కాలము అంటే విలువైనది.

మీ బహుమతులు ఎదురు చూస్తున్నవి.
సభ్యత్వం త్వరగా తీసుకోండి.
పరిమితంగానే వున్నవి.

ఉచిత లిటరేచరు, దరఖాస్తు ఫారమునకు మీ సమీప గుజరాత్ సేవింగ్స్ బ్రాంచి లేదా ఏ ఆంధ్రా బ్యాంక్‌లోనైనా లేదా

ఏజెంట్లు లేదా దిగువ వారిని సంప్రదించండి

గుజరాత్ సేవింగ్స్
కోటి, ఫోన్ : 53706
హైదరాబాద్-500001.
హెచ్ ఓ. 518, కల్బాదేవి,
బొంబాయి-400002.
ఫోన్ : 310 605 — 310 533 — 313 458

గ్రౌండ్, ఫస్టు అండ్ సెకండ్ ఫ్లోర్ పూర్తిగా ఎయిర్ కండిషన్ చేయబడినది.

మొదటి డ్రా త్వరలో ప్రకటించబడును.
భారత దేశమంతటా బ్రాంచీలు కలవు.

YOUR TOTAL INVESTMENT Only Rs. 432

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

ఐ & పి. డిపార్టుమెంటు, ఇరిగేషన్ సర్కిల్, హైదరాబాదు-1
రెడ్ హిల్, హైదరాబాదు ఎ. పి.

టెండరు నోటీసు

నెం 16/SE- ఇరిగేషన్ సర్కిల్, హైదరాబాదు/1976-77/8643 తేదీ 8-11-1976

ఈ క్రింది పనులకు సీలువేసిన టెండర్లు ప్రసిద్ధి చెందిన సంస్థలు మరియు కాంట్రాక్టర్లు (జి. ఓ ఎం. ఎస్. నెం 1077 తేది 10-7-67 ప్రకారం రిజిస్టరైనవారు) కాలం నెంబరులలో తెలియజేయబడిన తరగతికి చెందినవారినుండి 16-12-1976 సాయంత్రం 3-00 గంటలవరకు స్వీకరించబడును. తిరిగి అదే రోజు సాయంత్రం 3-30కు అప్పటికి హాజరైన టెండరుదార్లు లేక వారి ఏజంట్ల సమక్షంలో తెరువబడును.

వ.నెం.	పని పేరు	కాంట్రాక్టుపద్ధతి	టెండరుతో దాఖలు చేయవలసిన ఇఎండి	కాంట్రాక్టు మొత్తం	పని పూర్తిచేయవలసిన కాలం	షెడ్యూల్‌కొరకు పుచ్చుకొను టెండరు షెడ్యూళ్ళఖరీదు	టెండరు షెడ్యూళ్ళ కొరకు దరఖాస్తులు స్వీకరించబడును ఆఖరు తేదీ	టెండరు షెడ్యూళ్లు జారీ చేయు కాలం	కాంట్రాక్టరు తరగతి
1	2	3	4	5	6	7	8	9	10
1. హైదరాబాదుజిల్లా, తాండూరుతా॥ గొట్టిగుర్తి గామం ఉద్దండ పూర్ ప్రాజెక్టు నిర్మాణము.	ఎల్. ఎస్.	రు.19,500	రు. 13.00 లక్షలు	24 నెలలు	రు. 52 00	8-12-76	10-12-76 నుండి 13-12-76	II ఆ పైన
2. హైదరాబాదుజిల్లా, తాండూరు తా॥ దేవనూర్ (గ్రామం) పెద్ద వాగుకు అడ్డంగా ఆనకట్ట నిర్మాణం.	ఎల్. ఎస్.	రు. 5,625	రు. 3.75 లక్షలు	12 నెలలు	రు. 57.00	-డిటో-	-డిటో-	III ఆ పైన

1 టెండరు ఈ కార్యాలయంనుండి సప్లయి చేయబడిన నిర్ణీత ఫారములోనే పెట్టుకోవాలి. టెండరు షెడ్యూలు కొరకు వాటి ఖరీదు క్రింద చలాను దరఖాస్తుకు జతపరచి సూపరింటెండింగ్ ఇంజనీర్, ఐ. & పి. డి. ఇరిగేషన్ సర్కిల్ రెడ్‌హిల్స్ హైదరాబాదు వారికి పంపి పొందవచ్చును టెండరు షెడ్యూళ్ళు పోస్టుద్వారా పంపబడవు. అభిలాషగల టెండరుదార్లు వీటిని పైన తెలిపిన తేదీలలో ఆఫీసు పనివేళలలో ఏరోజునైనా పొందుటకు వారి స్వంత ఏర్పాట్లు చేసుకోవాలి.

2. పైన తెలిపిన నిర్ణీత తేదీ తరువాత వచ్చిన దరఖాస్తులు అంగీకరించబడవు.

3. టెండరుదారు వారి రిజిస్ట్రేషన్ ధృవ పత్రాలను టెండరు షెడ్యూళ్ళకొరకు పెట్టుకొను దరఖాస్తుకు జతపరచి పంపాలి దరఖాస్తుతో లేదా షెడ్యూళ్ళ తీసుకునేముందు పై ధృవ పత్రాలను దాఖలు చేయనట్లయితే టెండరు షెడ్యూళ్ళు జారీ చేయబడవు. పైన తెలిపిన తేదీ తరువాత టెండరు షెడ్యూళ్ళు జారీ చేయబడవు.

4 టెండరు షెడ్యూళ్ళ ఖరీదు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఐ & పి. డి. ఐ. బి. డివిజన్, హైదరాబాదు వారిపేర ఈ క్రింది హెడ్‌కు జమకట్టి ట్రెజరీ చెలానా పంపాలి.

"882 క్యాష్ రెమిటెన్సెస్ & అడ్జెస్టుమెంట్స్ బిట్వీన్ ఆఫీసర్స్ రెండరింగ్ అకౌంట్స్ టుది సేమ్ అకౌంట్ జనరల్ (ఎ. జి. ఎ. పి హైదరాబాదు, పి. డబ్ల్యు. డి. రెమిటెన్సెస్ III అదర్ రెమిటెన్సెస్(బి) అయిటమ్స్ అడ్జెస్టబుల్‌బై పి. డబ్ల్యు డి."

టెండరు షెడ్యూళ్ళ ఖరీదు క్రింద మనియార్డర్లు అంగీకరించబడవు ఒకసారి చెల్లించిన టెండరు షెడ్యూళ్ళ ఖరీదు ఎట్టి పరిస్థితిలోనూ తిరిగి యివ్వబడదు

. ఇ. ఎం. డి.ని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఐ. & బి. డి. ఐ. బి. డివిజన్, హైదరాబాదువారిపేర ట్రెజరీలో "కె. డిపాజిట్స్ అండ్ అడ్వాన్సెస్ (బి) డిపాజిట్ నాట్ బేరింగ్ ఇంటరెస్టు 843 సివిల్ డిపాజిట్స్ సెక్యూరిటీ డిపాజిట్స్" హెడ్‌కు జమకట్టి చలాను సీలువేసిన కవరుపై జతపరచి పంపాలి. లేనిచో టెండర్లు నిరాకరించబడును.

6. ఎట్టి కారణము తెలుపకనే ఏ ఒక్క టెండరునైనా లేక అన్ని టెండర్లు నిరాకరించు అధికారము సూపరింటెండింగ్ ఇంజనీర్ ఐ. & పి. డి. ఇరిగేషన్ సర్కిల్, హైదరాబాదు వారికి కలదు.

(సం) పి. వి. కోటేశ్వరరావు,
సూపరింటెండింగ్ ఇంజనీర్, ఐ. & పి. డి,
ఇరిగేషన్ సర్కిల్, హైదరాబాదు.

DIPR 1886/76

రేడియో

గురువారం-నవంబరు 25
శక 1898 ∴ మార్గశిర 4

హైదరాబాదు-ఎ

ప్రసారము I

6-00 వందేమాతరం, మంగళధ్వని, 6-10 భక్తిరంజని: 7.15 చైతన్యరథం; 7.30 చిత్రసీమ: 8-30 పి. బి. నీలారాయ్: వీణ: 9-00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

ప్రసారము II

11-45 ఉన్నపాఠశాలలకు:12-05 ప్రాథమిక పాఠశాలలకు: 1-00 చిత్రసీమ: 2-10 ఉన్నతపాఠశాలలకు; 2-30ప్రసారసమాప్తి.

ప్రసారము III

5-20 సంస్కృత పరిచయం: 5-45 సంగీత సుధ- ఎస్. ఎల్. గానసరస్వతి : గానం: 6-55 మాటా-మంతీ: 7-15 ఇల్లు - వాకిలి: 8.00 నాటిక; 8-15 సంగీత సాహిత్య సౌరభం; 8.45 జానపదలహరి: 9-30 పాముల బుట్ట - జాతీయ నాటకం: 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

విజయవాడ

ప్రసారము I

6-00 వందేమాతరం, శుభోదయం, ప్రసార విశేషాలు, దేశభక్తిగేయం: 6-15 భక్తిరంజని; 7-15 చైతన్య రథం; 7-20 సంగీత శిక్షణ (జూనియర్లకు): 7.45 ఒక్కొక్క మెట్టు - సమర్పణ : మల్లాది సూరిబాబు: 8-30 మిరియాల వెంకటరత్నం: నాదస్వరం: 9 00 ప్రసార సమాప్తి.

ప్రసారము II

11.45 ఉన్నత పాఠశాలలకు; 12-05 మిరియాల వెంకటరత్నం : నాదస్వరం: 1.00 చిత్రతరంగిణి: 2.10 ఉన్నత పాఠశాలలకు; 2-30 ప్రసార సమాప్తి.

ప్రసారము III

5-30 సంస్కృత పరిచయం: 5-45 సంగీతం: 6.30 యువవాణి: 8-00 నామకరణం - నాటిక; 8-15 పద్యపఠనం; 8-30 వాద్యబృందం: 9-15 తూమాటి దోణప్ప- ప్రసంగం: 9.30 పాముల బుట్ట- జాతీయ నాటకం: 10-30 ప్రసార సమాప్తి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

ఇరిగేషన్ అండ్ పవర్ డిపార్ట్‌మెంట్ (ఇరిగేషన్ బ్రాంచి)

చిట్ టెండరునోటీసు

నెం. 38/76-77 తేదీ 8-11-76

ఈ క్రింద తెలియజేయబడిన పనులకు సీలువేసిన టెండర్లు పి.డబ్ల్యు.డి. రిజిష్టర్డు కాంట్రాక్టర్లు మరియు ప్రసిద్ధిచెందిన సంస్థలనుండి కోరబడుచున్నవి.

వరుస నెంబరు	పని పేరు	కాంట్రాక్టు మొత్తం ([illegible])	కాంట్రాక్టు పద్ధతి	ఎర్నెస్టుమనీ డిపాజిట్ 1½% చలానా లేక డి. డి. రూపంలో	ఎర్నెస్టుమనీ డిపాజిట్ [illegible] 1% బ్యాంకు గ్యారంటీ రూపంలో	షెడ్యూళ్ళకొరకు కలుపుకొని టెండరు డాక్యుమెంట్లు ఖరీదు అభ్యర్ధన సమయంలో దాఖలు చేయాలి	పూర్తిచేయవలసిన కాలం	అభ్యర్ధనకు చివరి తేదీ	టెండరు డాక్యుమెంట్లు సప్లయి చేయు తేదీ	టెండర్లు స్వీకరించు తేదీ	టెండరు డాక్యుమెంట్లు ఖరీదు చెల్లించవలసిన ఇ. ఇ.	టెండరు పెట్టుటకు అర్హతగల తరగతి కాంట్రాక్టరు
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)
1.	ఖమ్మం జిల్లా కొత్తగూడెం తాలూకా సూరంపాలెం (గ్రామం) వద్ద లింగ సముద్రం వాగుకు అడ్డంగా చెరువు ఏర్పాటు చేయుట.	4.50 లక్షలు	ఎల్. ఎస్.	రు. 6,750/-	రు. 4,500/-	రు. పై. 52.20	ఒక సంవత్సర కాలం	30.11.76	3.12.76 మరియు 4.12.76	7.12.76	ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు P. W. D. స్పెషల్ డివిజన్ కొత్తగూడెం	క్లాసు III ఆపైన

1. టెండర్లు పైన కాలం నెంబరు 11 లో తెలియజేయబడిన తేదీన సాయంత్రం 3 గంటల వరకు స్వీకరించబడి అదేరోజు సాయంత్రం 3-30 గంటలకు తెరువబడును.

2. పైన కాలం నెంబరు 11 లో తెలియజేయబడిన టెండర్లు స్వీకరించు చివరి తేదీ ప్రభుత్వ శెలవురోజు అయినట్లయితే టెండర్లు ఆ తరువాత పనిరోజున తీసుకొనబడును.

3. టెండరు డాక్యుమెంట్లు పైన కాలం నెంబరు 10 లో తెలియజేయబడిన తేదీలలో ఆఫీసు పనివేళలలో కాలం నెంబరు 7 లో తెలియజేయబడిన టెండరు షెడ్యూళ్ళ ఖరీదు బ్యాంకు లేక ట్రెజరీ చలాను రూపంలో చెల్లించి పొందవచ్చును. ఎట్టి పరిస్థితిలోనూ ఈ మొత్తం తిరిగి ఇవ్వబడదు. టెండరు డాక్యుమెంట్ల సప్లయి కొరకు చలానులో పూర్తి చేయవలసిన అకౌంటు హెడ్ ఈ క్రింద నీయబడినది.

మేజర్ హెడ్ :- 882 క్యాష్ రెమిటెన్స్ అడ్జెస్టుమెంట్ బిట్వీన్ ఆఫీసెస్ రెండరింగ్ అకౌంట్ టు సేమ్ ఎ. జి. ఎ. పి. I అండ్ ఎ.జి. ఎ. పి. II.
మైనర్ హెడ్ :- (బి) పి. డబ్ల్యుడి, రెమిటెన్సెస్ ఇన్ ఫేవర్ ఆఫ్ ది ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (నోటీసులోని కాలంనెంబరు 12 లో తెలిపిన విధంగా) టువర్డ్స్ ది కాస్టు ఆఫ్ టెండరు డాక్యుమెంట్స్ వర్ ది వర్క్ ఆఫ్ (పైన కాలం నెంబరు 2 లో తెలిపిన విధంగా)
(III అదర్ రెమిటెన్సెస్ (బి) అయిటమ్స్ అడ్జెస్టబుల్ బై ది పి. డబ్ల్యు. డి. ఆఫీసర్స్).

4. అభిలాషగల టెండరుదారు రిజిస్ట్రేషన్ ఆర్డర్ కాపీని అభ్యర్ధనకు జతపరచి పంపాలి.

5. అభ్యర్ధనకు గతంలో ఇరిగేషన్ పనిలో అనుభవానికి సంబంధించిన స్పష్టమైన ధృవ పత్రాన్ని జతపరచి పంపాలి. గత అనుభవంలేని కాంట్రాక్టర్లు దరఖాస్తు చేయరాదు.

(సం.) జీవన్‌సింగ్
సూపరింటెండింగ్ ఇంజనీర్
పి. డబ్ల్యు. డి. ఇరిగేషన్ సర్కిల్, వరంగల్

Dipr 1889/76

విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరపున ప్రింటర్, అండ్ పబ్లిషర్ : టి. వెంకటేశ్వరరావు. ఎడిటర్ : ప. రాఘవాచారి, ముద్రణ : విశాలాంధ్ర ప్రెస్, విజయవాడ 520004. R, No. 1138/57